Pubilshed from Kadapa

PRGI NO : APTEL/25/A1220

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




కడప KADAPA | సంపుటి : 02 Vol.No : 02 | సంచిక : 229 Issue No : 229 | శనివారం Saturday | జూన్ 27, 2026 27 JUNE 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## మాదకద్రవ్య రహిత భారత్ సాధనే లక్ష్యం

కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:వచ్చే 2047 నాటికి మాదక ద్రవ్య రహిత భారత్ (డ్రగ్స్ ఫ్రీ భారత్)సాధనే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పని చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపు నిచ్చారు.శుక్రవారం ఆయన ఢిల్లీ నుండి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు,పోలీసు ఉన్నతాధికారులు,నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో తదితర విభాగాల అధికారులతో నార్కో కోఆర్డినేషన్ పై వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడి పిలుపు మేరకు 2047 నాటికి డ్రగ్స్ రహిత భారత్ సాధనే లక్ష్యంగా పని చేయాలని ఇందుకు సాంకేతికత సాయంతో పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్రాలకు సూచించారు. - మిగతా 2లో..

## విద్యావ్యవస్థలో మార్పులు జరగాలి

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు గారి ప్రజా ప్రభుత్వం టీచర్లను లీడర్లు భావిస్తోంది, కష్టపడి మంచి ఫలితాలు సాధించే ఉపాధ్యాయులకు ప్రత్యేక గుర్తింపునిస్తామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఇటీవల సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లిన 37మంది ఉత్తమ ఉపాధ్యాయులతో మంత్రి లోకేష్ ఉండవల్లి నివాసంలో సమావేశమయ్యారు. సింగపూర్ అధ్యయన యాత్రలో తాము తెలుసుకున్న అంశాలు, రాష్ట్రంలో వాటిని అమలు చేయడానికి గల అవకాశాలను వారు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఉపాధ్యాయులు సమాజంలో మార్పునకు నాయకత్వం వహించే లీడర్లని అన్నారు.

### ఉపాధ్యాయులు నాయకత్వం వహించాలి

- రాష్ట్రంలో టీచర్లంతా ఛేంజ్ మేకర్లుగా, నాయకులుగా తయారుకావాలి
- కష్టపడి మంచి ఫలితాలు సాధించే ఉపాధ్యాయులకు గుర్తింపునిస్తాం
- రాష్ట్ర విద్యావ్యవస్థలో సంస్కరణల వల్లే ప్రైవేటు నుంచి లక్షమంది చేరిక
- అందరం కలిసికట్టుగా ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ సాధిద్దాం
- విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్ ను నెం.1గా నిలబెడతాం
- సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లిన టీచర్లతో మంత్రి లోకేష్ సమావేశం



విద్యద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుంది, అందుకోసమే నేను పట్టుదల, కమిట్ మెంట్ తో విద్యాశాఖను తీసుకున్నాను, ప్రపంచంలో అత్యుత్తమ మోడల్ విద్యావిధానం కోసం అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశించిన స్వర్ణాంధ్ర సాధనలో విద్యాశాఖ కీలకపాత్ర వహిస్తుంది, క్వాంటమ్, ఏఐ వంటి అధునాతన సాంకేతికతలు అమలు చేయడం విద్యాశాఖ ద్వారా మాత్రమే సాధ్యమని అన్నారు. నేను చిన్న వయసులోనే అమెరికా వెళ్లి స్టాన్ ఫోర్డ్ లో విద్యనభ్యసించాను, అక్కడ 100 దేశాల విద్యార్థులతో 2 లో..



## ఎపిలో మూడు రోజులపాటు భారీ వర్షాలు

### ఏపీఎస్డీఎంఏ అలర్ట్

- వాతావరణ మార్పుల ప్రభావంతో ఏపీలో నేటి నుంచి భారీ వర్షాలు
- ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40-50 కి.మీ వేగంతో గాలులు
- పలు కోస్తా, రాయలసీమ జిల్లాల్లో రానున్న రెండు రోజులు వర్ష ప్రభావం
- ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : వాతావరణ మార్పుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో నేటి (శనివారం) నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ స్పందిస్తూ... రేపు ఉత్తరాంధ్ర, కాకినాడ, కోనసీమ, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడొచ్చని తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) 2 పేజీలో..



## పాగాకు గిట్టుబాటు ధరకు ప్రభుత్వం గట్టి భరోసా

### మార్కెట్ పరిస్థితులపై నిరంతర నిఘా పెట్టాలి

- పొగాకు రైతుల సమస్యలు, ఎరువుల పంపిణీపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెలీ కాన్ఫరెన్స్

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : వర్జీనియా పొగాకు రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా కొనుగోలు ప్రక్రియను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షించాలని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సరాసరి ధర కిలోకు రూ.200 కంటే తక్కువ ధరకు కొనుగోళ్లు జరిగేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని వ్యవసా య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ జిలాని, వర్జీనియా పొగాకు సాగు జరిగే జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం మంత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పొగాకు కొనుగోళ్లు, రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులు, ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ఎరువుల లభ్యత, పంపిణీ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

పొగాకు కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, కంపెనీలు నిర్ణయించిన నిబంధనలకు లోబడి పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్ దృష్ట్యా రాష్ట్రంలో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ సహా అన్ని రకాల ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందేలా నిల్వలు, రవాణా, పంపిణీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, కృత్రిమ కొరత, 2 పేజీలో..

## యువశక్తే దేశానికి పెట్టుబడి..

### గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం..

- డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యం...
- హోం మంత్రి వంగలపూడి అనిత.



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ : దేశంలో అత్యంత శక్తివంతమైన మానవ వనరులైన యువశక్తి భగ్నం కాకుండా, రాబోయే తరాల అభివృద్ధికి వారిని ఒక పెట్టుబడిగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, డిపార్ట్మెంట్ ఫర్ వెల్ఫేర్ ఆఫ్ డిఫెరెంట్లీ ఏబుల్డ్, ట్రాన్స్జెండర్ అండ్ సీనియర్ సిటిజన్స్ శాఖ, ఈగల్ సంయుక్త ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హోంమంత్రి వంగలపూడి అనిత యువతకు, తల్లిదండ్రులకు కీలక సందేశాన్ని ఇచ్చారు. 2 లో



## పల్నాడులో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

- ప్రమాదాల ప్రదేశాలను గుర్తించి ముందస్తు భద్రతా సూచికలు ఏర్పాటు చేయాలి
- పల్నాడు ఉన్నతాధికారుల సమీక్షలో ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: పల్నాడు జిల్లాలో ఇటీవల వరుసగా చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలపై జిల్లా ఇన్‌ఛార్జి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి, ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. - మిగతా 2లో..

## ప్రజల్లో అవగాహన కల్పించండి

### కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల మంజూరులో అడ్డంకులు తొలగించాలి

- రేషన్ కార్డుల విభజనను మరింత సులభతరం చేయండి
- అభ్యర్థి ఆధార్ నంబర్ తో సర్టిఫికెట్లన్నీ డీజీ వెరిఫై చేసేలా ఉండాలి
- ఆర్టీజీఎస్ పై సమీక్షలో మంత్రి నారా లోకేష్



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: రాష్ట్రంలో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ వినియోగంపై ప్రజల్లో మరింతగా అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. శుక్రవారం సచివాల యంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ఆర్టీజీఎస్‌పై మంత్రి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ లక్ష్యాలు, ప్రాజెక్టుల ప్రగతిపై ఆ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వ శాఖల సమాచారాన్ని క్రోడీకరించేందుకు చేపట్టిన డేటాలేక్ పనులన్నీ జులై నాటికి పూర్తికావాలని మంత్రి ఆదేశించారు. 2 లో



## ఝార్ఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### ఏడుగురు మృతి

రాంచీ : ఝార్ఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వ్యాను, ట్రక్కు ఢీకొన్న ఘటనలో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఒకరికి గాయాలయ్యాయి. ఈ విషాదకర సంఘటన రాజ్‌రప్ప పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్‌గఢ్-బొకారో రోడ్డుపై గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో జరిగింది. గాయాలైన వ్యక్తిని రామ్‌గఢ్ సదర్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. - మిగతా 2లో..

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

### అధికారులకు డిప్యూటి సిఎం ఆదేశాలు



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి: వర్షాకాలం వేళ ... గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసు కోవాలని పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధిశాఖ అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నియంత్రణ చర్యలపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, కమిషనర్ కృష్ణతేజ ఇతర ఉన్నతాధికారులతో చర్చించారు. ప్రజారోగ్య పరిరక్షణను ప్రతి గ్రామ పంచాయతీ అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని.. అన్ని పంచాయతీల్లోనూ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలని పవన్ ఆదేశించారు. ముఖ్యంగా వర్షపు నీరు, మురుగునీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవటం ద్వారా, దోమల వ్యాప్తిని కట్టడి చేయాలన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ, రోజు వారీ చెత్త సేకరణ శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని, ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. 'ఫ్రైడే - డ్రైడే' కార్యక్రమాన్ని - మిగతా 2లో..



## జపాన్ ప్రధాని భారత్ పర్యటన

న్యూఢిల్లీ : జపాన్ ప్రధాని సనే తకైచి వచ్చే నెలలో భారత్‌లో పర్యటించను న్నారు. ఆమె జూలై 1-3 వరకు పర్యటించనున్నారని భారత విదేశాంగ శాఖ శుక్రవారం ధృవీకరించింది. 2 పేజీలో..

# విద్యావ్యవస్థలో మార్పులు జరగాలి



కలిసి ఐడియాస్, నాలెడ్జి, కల్చర్ పంచుకునే అవకాశం లభించిందని తెలిపారు. విదేశాల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులంతా ఛేంజ్ మేకర్స్ గా తయారు కావాలి. సింగపూర్ అధ్యయన యాత్రలో మీరు నేర్చుకున్న అంశాలను స్కూలు, క్లస్టర్, మండలాల్లో అమలు చేసేందుకు నాయకత్వం వహించండి. సహ టీచర్లకు మెంటరింగ్ చేయండి. టీచర్ -- స్టూడెంట్ -- సబ్జెక్ట్ రిలేషన్ షిప్ ముఖ్యం. ప్రస్తుతం మనం మౌలిక సదుపాయాలపై దృష్టిపెట్టి, సాఫ్ట్ వేర్ మర్చిపోతున్నాం. రాష్ట్రంలో లీప్ మోడల్ విద్యావ్యవస్థ సాధనకు కలిసికట్టుగా పనిచేయాలి. టీచర్లు బోధనపైనే శ్రద్ధ వహించాలని అన్నారు. విద్యావ్యవస్థలో ఆశించిన మార్పు తేవడం వెనువెంటనే సాధ్యం కాదు, ఇందుకు కొంత సమయం పడుతుంది. రాష్ట్రంలో మనం చేపట్టిన సంస్కరణల కారణంగా ఈ ఏడాది లక్షమందికి పైగా విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు మారారు, ఇది శుభపరిణామం, ప్రభుత్వ ఉపాధ్యాయులకు మించిన టీచర్లు ప్రైవేటు స్కూళ్లలో లేరు, ఆదర్శవంతమైన విద్యావ్యవస్థ (ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్) సాధనకు మీ సహకారం కావాలి, కలిసికట్టుగా పనిచేసి అత్యుత్తమ ఫలితాలు సాధించాలి, లక్షలాదిమంది బిడ్డల భవిష్యత్తు మనపై ఆధారపడి ఉంది.

ఈరోజు దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థ గురించి చర్చ జరుగుతోంది. ఇప్పుడు మనం ఇతర రాష్ట్రాలతో కాదు, ఇతర దేశాలతో పోటీపడాలి, ఉపాధ్యాయులకు నా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని మంత్రి లోకేష్ చెప్పారు. ఎటువంటి పైరవీలకు తావులేకుండా టీచర్ ట్రాన్స్ ఫర్ యాక్ట్ తెచ్చి సీనియారిటీ ప్రాతిపదికన పారదర్శకంగా ప్రమోషన్లు ఇచ్చాం. మీకు అత్యంత శక్తి, సామర్థ్యాలు ఉన్నాయి, ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ ను ప్రపంచానికి చాటిచెప్పాలి, ఇందులో భాగంగా ఇప్పుడు తొలిఅడుగు వేశాం...అభ్యసన ఫలితాలు, ఎనలిటికల్ థింకింగ్ పై దృష్టిసారించాలి. విద్యావ్యవస్థలో అన్ని సమస్యలను ఒకేరోజు పరిష్కరించడం సాధ్యం కాదు, ప్రాధాన్యత క్రమంలో అన్నింటినీ పరిష్కరిస్తాం, ప్రజాప్రభుత్వం మీ వెంట ఉంది, విద్యారంగంలో ఏపీని నెం.1గా తయారుచేసేందుకు సమిష్టిగా కృషిచేద్దామని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. సింగపూర్ టూర్ ద్వారా ఉపాధ్యాయులు వివిధ అంశాలపై కెపాసిటీ బిల్డింగ్ పై శ్రద్ధవహించాలి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75ఏళ్ల వయసులో ఇప్పటికీ నేర్చుకుంటూనే ఉంటారు. ఇటీవల ఆయన సింగపూర్ వెళ్లి ప్రధాని, ఇతర మంత్రులను కలిసి పలు కొత్తవిషయాలపై అధ్యయనం చేశారు, గత కొంతకాలంగా ప్రభుత్వ టీచర్లకు గౌరవం పెరిగింది, మీరు లీడర్లుగా, ఛేంజ్ మేకర్స్ గా తయారుకండి, మీకు అండగా మేముంటామని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, ఎస్ సీఈఆర్ టీ డైరెక్టర్ ఎం.వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# వెనిజువెలా విలయం !

పర్యావరణ విధ్వంసం కూడా భూకంపాలకు కారణమై ఉండొచ్చని నిపుణులు కొందరు అభిప్రాయ పడుతున్నారు. జాపన్ భూకంపాలకు నిలయం. అయితే ఇప్పడు వెనిజువెలాలో జరిగిన భూకంప విలయం అంతా ఇంతా కాదు. ఏకకాలంలో పలు దేశాల్లో భూకంపాలు ఆందోళనకు గురిచేశాయి. ఇవి మానవులకు హెచ్చరిక కావాలి. వెనెజువెలాలో సంభవించిన రెండు భారీ భూకంపాలు అక్కడి ప్రజల జీవితాలను అతలాకుతలం చేశాయి. ఒక్క నిమిషం వ్యవధిలో రెండు తీవ్ర భూకంపాలు రావడంతో భారీ ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించాయి. ఇకపోతే లాటిన్ అమెరికా దేశం వెనెజువెలాలో సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు భారీ భూకంపాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ విలయంలో మృతులు అంతకంత కూ పెరుగుతుండగా గల్లంతైన వారి సంఖ్య వేలల్లో ఉండటం విచారకరం. ప్రకృతి ప్రకోపానికి ఇప్పటివరకు 235 మంది బలైనట్లు ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. మరో 4300 మంది గాయపడి నట్లు తెలిపింది. భవన శిథిలాల కింద ఇంకా అనేక మంది చిక్కుకున్నట్లు పేర్కొంది. ఈ వరుస భూకంపాల అనంతరం దాదాపు 40వేల మంది జాడ తెలియరాలేదని అధికారిక వర్గాలు వెల్లడించాయి. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వెనెజువెలా రాజధాని కారకాస్ సహా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ఈ భూప్రకంపనలు సంభవించాయి. అయితే, అత్యంత తీవ్రంగా ప్రభావితమైన లా గువేరాలో మాత్రం పరిస్థితి దయనీయంగా ఉంది. భూకంపం ధాటికి ఈ తీర నగరం అతలాకుతలమైంది.ఇక్కడ 100కు పైగా భవనాలు నేలమట్టమైనట్లు సహాయక చర్యల్లో పాల్గొన్న ఐరాస ప్రతినిధులు వెల్లడించారు. వీటి కింద చిక్కుకున న్నవారిని గుర్తించడం కూడా కష్టతరంగా మారిందని పేర్కొన్నారు. శిథిలాలను తొలగించడానికి చాలా సమయం పడుతోందని తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు 250 బహుళ అంతస్తుల భవనాలు పూర్తిగా శిథిలాల దిబ్బగా మారినట్లు తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ వెల్లడించారు. భూకంపం నేపథ్యంలో సామాజిక మాధ్యమాలపై ఉన్న ఆంక్షలను తొలగించాలని ఐరాస ప్రతినిధులు వెనెజువెలా ప్రభుత్వాన్ని కోరారు. సోషల్ మీడియాతో ప్రజలు కీలక సమాచారాన్ని వేగంగా తెలుసుకోగలుగుతారని పేర్కొన్నారు. ఇందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో వెనెజువెలా పౌరులకు 'ఎక్స్' అందుబాటులోకి వచ్చింది. 2024లో మదురో అధికారంలో ఉన్నప్పడు ఈ మైక్రోబ్లాగింగ్ సైట్‌ను నిషేధించిన సంగతి తెలిసిందే. మరోవైపు ఈ క్లిష్ట సమయంలో వెనెజువెలాను ఆదుకునేందుకు పలు దేశాలు ముందుకు వస్తున్నాయి. 150 మిలియన్ డాలర్ల విలువైన సహాయక సామగ్రిని అందిస్తామని అమెరికా ప్రకటించింది. దీన్ని తరలించేందుకు ఇప్పటికే రెండు యుద్ధ నౌకలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లను సిద్ధం చేసింది. స్పెయిన్,జర్మనీ,ఫ్రాన్స్, స్విట్జర్లాండ్,నెదర్లాండ్, మెక్సికో, బ్రెజిల్ వంటి దేశాలు కూడా సహాయక సిబ్బంది, వైద్య సిబ్బంది, మానవతా సాయం అందించేందుకు సిద్ధమయ్యాయి. ఈ భూకంపాల ప్రభావం భారత్‌పై కూడా తీవ్రంగా పడనుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల వాణిజ్యపరంగా ఆదేశంతో పలు ఒప్పందాలు జరిగాయి. ఇప్పడు దెబ్బతిన్న వెనిజువెలాతో మనకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఇటీవలి కాలంలో వెనెజువెలా నుంచి భారత్ చమురు దిగుమతులను గణనీయంగా పెంచింది. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో భారత చమురు శుద్ధి సంస్థలు ఇటీవల వెనెజువెలా నుంచి ముడి చమురు కొనుగోళ్లను పెంచాయి. ఏప్రిల్, మే నెలల్లో భారత్‌కు ప్రధాన చమురు సరఫరాదారుల్లో ఒకటిగా వెనెజువెలా ఎదిగింది. ఈ పరిస్థితుల్లో భూకంపం వల్ల అక్కడి ఎగుమతి వ్యవస్థకు అంతరాయం కలిగితే భారత్‌పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. భూ÷ఔకంపం కారణంగా వెనెజువెలా నౌకాశ్రయాల కార్యకలాపాలు దెబ్బతినడం, విద్యుత్ అంతరాయాలు, రవాణా వ్యవస్థలో సమస్యలు, అత్యవసర ఆంక్షలు అమలులోకి రావడం వల్ల చమురు ట్యాంకర్ల రాకపోకలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దీంతో సరుకు రవాణా ఖర్చులు, బీమా ప్రీమియంలు, నౌకల నిరీక్షణ వ్యయాలు పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. భారత ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ విదేశ్‌కు వెనెజువెలా చమురు ప్రాజెక్టుల్లో పెట్టుబడులు ఉన్నాయి. భూకంప ప్రభావం ఎక్కువకాలం కొనసాగితే ఆ పెట్టుబడుల నిర్వహణ, ఉత్పత్తి కార్యకలాపాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే వెనిజువెలా కోలుకుంటేనే మళ్లీ వ్యాపార కార్యకలాపాలు ముమ్మరం కానున్నాయి. అందువల్ల అప్పటి వరకు భారత్ వ్యాపారాలకు దెబ్బగానే భావించాలి.

## యువశక్తే దేశానికి పెట్టుబడి...



**డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యం...** మాదకద్రవ్యాల జోలికి ఎవరూ పోకూడదనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ యాంటీ నార్కోటిక్ క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నాయని తెలిపారు.

నేటి తరం పిల్లలు ఎంతో ఫాస్ట్ గా, క్లారిటీగా ఉంటున్నప్పటికీ, చిన్న అవగాహన లోపం వల్ల డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్' (నివారణే మేలు) అన్నట్లుగా, యువత వీటి జోలికి వెళ్లకుండా ముందే కాపాడుకోవడం ముఖ్యం అని చెప్పారు.

**60శాతం నుండి 70 శాతం స్నేహితుల ప్రభావమే...** దేశంలో దాదాపు 3.5 నుండి 4 కోట్ల మంది గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని, ముఖ్యంగా 13 నుండి 18 సంవత్సరాల వయస్సు వారు ఎక్కువగా దీనికి ఆకర్షితులవుతున్నారని హోం మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం స్నేహితుల ఒత్తిడి వల్లే 60 నుంచి 70 శాతం మంది వీటికి బానిసలవుతున్నారని, ఇలాంటి అలవాట్లు చేసే స్నేహితులు శత్రువులతో సమానమని హెచ్చరించారు.

**తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయవద్దు...**ఎన్నో కష్టాలకోర్చి, తమ స్థాయికి మించి పిల్లలను హాస్టల్స్ లో ఉంచి చదివిస్తున్న తల్లిదండ్రుల ఆశలను యువత అపహాస్యం చేయవద్దని కోరారు. ఒక్కసారి గంజాయికి బానిసైతే జైలు పాలవ్వడం ఖాయమని, ఈ మధ్య కాలంలో తల్లిదండ్రులు కూడా ఇలాంటి పిల్లలకు బెయిల్ ఇప్పించడానికి ముందుకు రావడం లేదని గుర్తుచేశారు.

**'ఈగిల్' టాస్క్ ఫోర్స్ ఘనత...** గంజాయి రవాణా, సాగును అరికట్టడానికి 450 మంది సిబ్బందితో పనిచేస్తున్న 'ఈగిల్' టాస్క్ ఫోర్స్ అద్భుతమైన ఫలితాలు సాధించిందని కొనియాడారు. గత గత ప్రభుత్వ కాలంలో ఏజెన్సీ పరిధిలో దాదాపు 20 వేల ఎకరాల్లో గంజాయి సాగు జరిగేదని దానిని ధ్వంసం చేశామని, ప్రస్తుతం అక్కడ గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించి 'జీరో కల్టివేషన్' సాధించామని స్పష్టం చేశారు. లిక్విడ్ గంజాయి (హాష్ ఆయిల్) తయారీ కేంద్రాలపై కూడా కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

**?కఠినమైన ఎన్ డి పి ఎస్ (చీణూూ) చట్టం..**గంజాయి లేదా డ్రగ్స్ రవాణా చేసినా, దగ్గర పెట్టుకున్నా, కన్జ్యూమ్ చేసినా ఎన్ డి పి ఎస్ చట్టం ప్రకారం కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. పట్టుబడితే కనీసం ఆరు నెలల పాటు జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. విజయవాడ కమిషనరేట్ పరిధిలో ప్రతి మూలలోనూ సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.?రాష్ట్రంలో ఎక్కడైనా గంజాయి లేదా డ్రగ్స్ అమ్మకాలు, రవాణా జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే 1972 నెంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించాలని హోం మంత్రి పిలుపునిచ్చారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హోమ్ మంత్రి అనిత హామీ ఇచ్చారు.

# ప్రజల్లో అవగాహన కల్పించండి

కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల మంజూరులో అడ్డంకులు తొలగించాలి. రేషన్ కార్డుల విభజన, కుటుంబ సభ్యుల పేర్లు చేర్చడం, తొలగించే ప్రక్రియను మరింత సులభతరం చేయాలి. సంజీవని కార్యక్రమాన్ని కూడా డేటా లేక్ తో అనుసంధానించాలి. పాఠశాలల్లో డ్రాప్ అవుట్లను డేటా లేక్ ద్వారా విశ్లేషించి, తగ్గించడానికి గల మార్గాలను అన్వేషించాలి. విద్యారంగంలో సమగ్ర సమాచారాన్ని ట్రాక్ చేస్తున్నాం. అన్ని శాఖల సమాచారం డేటా లేక్ ద్వారా అనుసంధానం కావాలని మంత్రి సూచించారు.

**మనమిత్ర ప్రజలకు మరింత చేరువ కావాలి :** ప్రజల్లో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ వినియోగంపై మరింతగా అవగాహన కలిగేలా నెలరోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్రజలకు కలిగే ఉపయోగం, వినియోగం, సులభంగా ప్రభుత్వ సేవలు ఎలా పొందవచ్చో ప్రజలకు వివరించాలన్నారు.

**సర్టిఫికెట్ల వెర్ఫికేషన్‌కు ఆధార్ :** విద్యార్థులు, అభ్యర్థులకు విద్యా-క్రీడా సంస్థలు ఇచ్చే సర్టిఫికెట్లు, స్పోర్ట్స్ సర్టిఫికెట్లన్నీ అభ్యర్థి ఆధార్ నెంబర్ ఆధారంగా పారదర్శకంగా పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభ్యర్థి ఆధార్ నంబర్ కొడితే ఆ విద్యార్థి లేదా అభ్యర్థికి ఆ సర్టిఫికెట్లు ఏ సంస్థ, ఎప్పుడు, ఎవరు జారీ చేశారనే వివరాలు కూడా రియల్ టైమ్‌లో తెలిసేలా డీజీ వెరిఫైని పకడ్బందీగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. దీనివల్ల 99 శాతం అధికారుల పని కూడా సులభతరం అవుతుందన్నారు. రాబోయే రోజుల్లో ఇచ్చే వేలాది పోస్టుల నోటిఫికేషన్లకు, లక్షల సంఖ్యలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటారని, వీరందరి సర్టిఫికెట్లు పొందుపరచడంలో ఇబ్బందులు లేకుండా డీజీ వెరిఫైని సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొందాం :** రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావంపైనా మంత్రి నారా లోకేష్ సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను జలవనరుల శాఖ, వ్యవసాయ శాఖ, ఇతర శాఖలన్నీ కూడా సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా పనిచేసి సమర్థవంతంగా ఎదుర్కొందామన్నారు. నీరు వృథాను అరికట్టి, తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించే దిశగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. జలాశయాల్లో నీటి లభ్యత ఎంత ఉంది, భూగర్భజల మట్టాలు ఏ స్థాయిలో ఉన్నాయనేది ఆర్టీజీఎస్‌లోని అవేర్ విభాగం ద్వారా రియల్ టైమ్‌లో ఎప్పటికప్పుడు తెలుసుకుని ఆ దిశగా అధికారులు కార్యాచరణ చేపట్టాలి. రాయలసీమలో నీటి ఎద్దడి లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. యూరియా సరఫరాపైనా మంత్రి ఆరా తీశారు.

**విద్యుత్ డిమాండ్ పైనా దృష్టి కేంద్రీకరించాలి :** వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జల విద్యుత్ ఉత్పత్తి తగ్గడంతో ఎదురయ్యే సమస్యలు అధిగమించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని మంత్రి సూచించారు. జలాశయాల్లో నీటి మట్టాలు, పెరుగుతున్న విద్యుత్తు వినియోగం, భూగర్భ జలాలు వీటన్నిటినీ క్రోడీకరించి ఆర్టీజీఎస్‌లోని అవేర్ విభాగం విశ్లేషించి అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలి. విద్యుత్తు సరఫరాకు ఎక్కడా ఎలాంటి అంతరాయం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్, సంయుక్త కార్యదర్శి మాలిక గార్గ్, ఆర్టీఐహెచ్ సీఈవో ధాత్రి రెడ్డి, ఫైబర్‌నెట్ ఎండీ గీతాంజలి శర్మ, సివిల్ సప్లైస్ కమిషనర్ కన్నబాబు, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్త, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మన్జీర్ జిలానీ పాల్గొన్నారు.

## మాదకద్రవ్య రహిత భారత్ సాధనే లక్ష్యం

ముఖ్యంగా మాదక ద్రవ్యాలు సరఫరా,విక్రయం చేసే వారిపై కఠినంగా మరియు జీరో టోలరెన్స్ గా వ్యవహరించాలని స్పష్టం చేశారు.ఇందుకు సంబంధించిన హాట్ స్పాట్లను గుర్తించి కట్టుదిట్టమైన నిఘా ఉంచి కింగ్ పిన్ లను పెట్టుకోవడంతో పాటు వారికి సకాలంలో శిక్షపడేలా చూడాలన్నారు.ప్రత్యేక రోడ్డు మ్యాప్ ను రూపొందించుకోవడంతో పాటు కమ్యునిటీ పోలీసింగ్ ను మరింత పెంపొందించుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్రాలకు స్పష్టం చేశారు.అదే విధంగా మాదక ద్రవ్యాల సేవనం, సరఫరా, విక్రయాల వల్ల కలిగే అనర్ధాలు గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కలిగించాలని చెప్పారు.విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ వీడియో సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఎపిలో **EAGLE (Elite Anti- Narcotics Group for Law Enforcement)** పోలీసు విభాగం ప్రత్యేక రాష్ట్ర స్థాయి మాదకద్రవ్య వ్యతిరేక దళం సమర్ధవంతంగా పనిచేస్తోందని చెప్పారు.ఒకప్పుడు ఆంధ్ర-ఒడిశా సరిహద్దు గంజాయి ప్రాంతంగా పేరుపొందిన ఆంధ్రప్రదేశ్ నేడు మాదకద్రవ్యాల నియంత్రణ అమలులో జాతీయ స్థాయిలో ఒక ఆదర్శప్రాయమైన ప్రమాణంగా నిలిచిందని అన్నారు. రైల్వే నెట్‌వర్క్ ద్వారా రాష్ట్రాల మధ్య జరిగే మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకోవడానికి ప్రతి జిల్లాలో వారానికి మూడుసార్లు స్థానిక పోలీసులు,జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్,ఈగిల్ మరియు శునక దళాలను సంయుక్తంగా మోహరించి పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈగల్ మంగళగిరిలోని ప్రధాన కార్యాలయంలో ఒక ప్రత్యేకమైన, సురక్షితమైన డేటా సెంటర్‌ను నిర్వహించడంతో పాటు రాష్ట్ర మాదకద్రవ్యాల నిరోధక వ్యవస్థకు కేంద్రీకృత నిఘా కేంద్రంగా పని చేస్తోందని తెలిపారు. ఈవీడియో సమావేశంలో ఈగల్ చీఫ్ ఐజిపి ఆకె రవికృష్ణ,ఈగల్ ఎస్పి ఆపరేషన్స్ కెయం. మహేశ్వర రాజు, విశాఖపట్నం ఎన్సిబి ఎస్పి జెడి పంకజ్,ఎన్సిబి డిఎస్పి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎపిలో మూడు రోజులపాటు భారీ వర్షాలు



కూడా రానున్న కొద్దిరోజుల పాటు ఏపీలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తన నివేదికలో పేర్కొంది. ఆదివారం (జూన్ 28) కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలకు ఆస్కారం ఉందని అధికారులు వివరించారు. వర్షాలు, ఈదురు గాలుల సమయంలో ప్రజలు చెట్లు, హోర్డింగ్‌ల కింద ఆశ్రయం పొందవద్దని సూచించారు. విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, రైతులు, పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

## పల్నాడులో రోడ్డు ప్రమాదాల

# నివారణకు ప్రత్యేక చర్యలు



జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటిని యాక్సిడెంట్ స్పాట్స్ గా గుర్తిస్తూ... అవసరమైన ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. రహదారులపై ప్రమాద సూచికలు, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టివ్ సైనేజీలు ఏర్పాటు చేసి, వాహనదారులు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించిన మంత్రి, భారీ వాహనాలు సాంకేతిక లోపం లేదా ఇతర కారణాలతో రోడ్డుపై నిలిచిపోయిన సందర్భాల్లో, వెనుక నుంచి వచ్చే వాహనాలకు ముందుగానే హెచ్చరిక అందేలా వెంటనే భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీకి దిశానిర్దేశం చేశారు. అవసరమైతే ట్రాఫిక్ సిబ్బంది, క్రేన్లు, అత్యవసర సహాయక బృందాలను వెంటనే రంగంలోకి దించాలని పేర్కొన్నారు. మాచర్ల నగరవనం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ కుటుంబాలకు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రమాదంలో గాయపడిన వారికి అందుతున్న వైద్య చికిత్సపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న మంత్రి, క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చూడాలని, అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజల ప్రాణ భద్రత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్న మంత్రి, రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రమాదాల సంఖ్య తగ్గించే దిశగా శాశ్వత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# పొగాకు గిట్టుబాటు ధరకు ప్రభుత్వం గట్టి భరోసా



నిల్వదాచివేత, అధిక ధరలకు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన పొగాకు బోర్డు 168వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కూడా మంత్రి ప్రస్తావించారు. 2026--27 పంట సంవత్సరానికి మార్కెట్ పరిస్థితులు, దేశీయ, అంతర్జాతీయ డిమాండ్, రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని ఆంధ్రప్రదేశ్‌లో ఖీజఒ (ఖీశ్రీబవ జబతీవస ఎఱతీస్త్రఱఅఱఖ) పొగాకు ఉత్పత్తి పరిమాణాన్ని సుమారు 81 మిలియన్ కిలోలకు నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే, ఖీజఒ పొగాకు మార్కెటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, కొనుగోలు విధానంలో పారదర్శకత పెంచడం, పంట నియంత్రణ వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు తీసుకురావడం, రైతులకు మెరుగైన ప్రయోజనాలు కల్పించడం కోసం అన్ని భాగస్వాములతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర, ఖరీఫ్ రైతులకు సకాలంలో ఎరువుల సరఫరా జరిగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా

## ముందస్తు చర్యలు


రాష్ట్ర వ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేయాలని.. ప్రతి శుక్రవారం అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి మురుగునీటి నిల్వలను తొలగించే ఏర్పాటు చేయాలన్నారు. దోమలు పెరిగితే డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని.. ప్రతి గ్రామంలో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు. సోషల్ మీడియా, వాట్సప్ గ్రూపులు, మైక్ అనౌన్స్ మెంట్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తాగునీటి సరఫరా వ్యవస్థపై పర్యవేక్షణ ఉండాలని.. పైపు లైన్లలో లీకేజీలు లేకుండా చూడాలని ఆదేశించారు.

## జపాన్ ప్రధాని భారత్ పర్యటన

16వ భారత్– జపాన్ వార్షిక శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని మోడీ ఆహ్వానం మేరకు తకైచి భారత్ రానున్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది. జపాన్ ప్రధాని భారత్ పర్యటన ఇదే తొలిసారి కావడం గమనార్హం. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి, ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై చర్చించడానికి ఈ సమ్మిట్ జరుగుతుంది.

## ఝార్ఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

మృతులంతా బ్యాండ్ వాయించే వారని, హజారీ బాగ్ జిల్లా బల్సాగ్రాలో జరిగిన ఓ వివాహ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# వేదాలు వ్యక్తి ఔన్నత్యం పెంచుతాయి



## అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తాడేపల్లి మలయాళ ఆశ్రమంలో వేద పాఠశాల ప్రారంభం

అవనిగడ్డ / ఘంటసాల ప్రజాభూమి ప్రతినిధి

వేదాలు వ్యక్తి ఔన్నత్యం పెంచుతాయని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం ఘంటసాల మండలం తాడేపల్లిలోని శ్రీ మలయాళ స్వామి ఆశ్రమంలో నూతనంగా ఏర్పాటు చేసిన శృతి భారతి వేద పాఠశాలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, జాతీయ సంస్కృత యూని వర్సిటీ ఉప కులపతి ఆచార్య గుళ్ళపల్లి శ్రీరామ కృష్ణ, ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూ ర్ణానంద గిరి స్వామి చేతులమీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పూర్వం వేద ఘోషతో అలరారిన దివిప్రాంతంలో మళ్ళీ వేదాల పునరుజ్జీవనానికి బాటలు వేస్తున్న మలయాళ స్వామి ఆశ్రమం వారిని అభినందించారు. మనిషి నడవడికను తీర్చి దిద్దే వేద అధ్యయనం వినయ సంపన్నత అలవరుస్తుందన్నారు. కేరళ నుంచి వచ్చిన మలయాళ స్వామి ప్రధానంగా ఈ ప్రాంతంలో భక్తి, ధ్యానం, సేవ ధ్యేయాలతో కార్యక్రమాలు నిర్వహించారన్నారు. తనను తాను తెలుసుకోవటమే నిజమైన విద్య - తనను తాను జయిం చటమే నిజమైన విజయం అని ప్రభోధించిన మలయాళ స్వామి బోధనలు మనిషి వ్యక్తిత్వాన్ని వికసింపచేస్తాయన్నారు.



ఆధునిక శాస్త్ర విజ్ఞా నంతో పలుమార్లు అనర్ధాలు సంభవిస్తున్నప్పటికీ, వేద విజ్ఞానం మాత్రమే ఉన్నత సమాజానికి బాటలు వేస్తోందన్నారు. ప్రపంచ దేశాల్లో దాదాపు కుటుంబ వ్యవస్థ అంతరించిపోయినా, భారతదేశంలో కుటుంబ వ్యవస్థ పరిఢవిల్లుతుందంటే అందుకు ప్రధాన కారణం వేదాల ద్వారా భారతీయులు అలవర్చుకున్న సంస్కారమే ప్రధాన కారణం అన్నారు. దేశంలో మరోసారి కుటుంబ వ్యవస్థకు ముప్పు ఏర్పడుతున్న నేపథ్యంలో మరోసారి వేదాల సారాన్ని సామాన్య ప్రజలకు చేరవేయటం, నేటితరానికి వేద శిక్షణ ఇవ్వటం ద్వారా సమాజంలో విలువలు కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఈ దిశగా నేటితరానికి వేద శిక్షణ ఇచ్చేందుకు వేద పాఠశాల ఏర్పాటు చేసిన మలయాళ స్వామి ఆశ్రమ నిర్వాహకులను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అభినందించారు.కార్యక్రమంలో ప్రముఖ తెలుగు కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగశాస్త్రి, ఎన్ఆర్ఐ మూల్పూరి వెంకటరావు - సావిత్రి దంపతులు, జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మెన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, అసంగానంద గిరిస్వామి, ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, తెలుగు సహస్రావధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, కావూరి కోదండరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# నర్సింగ్ కేవలం ఉద్యోగం కాదు , ప్రాణాలను కాపాడే పవిత్ర సేవా వృత్తి





## వాగ్దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో ఘనంగా ల్యాంప్ లైటింగ్ & ఫ్రెషర్స్ డే వేడుకల లో ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్

జగ్గయ్యపేట, ప్రజాభూమి

నర్సింగ్ వృత్తి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని అది ప్రాణాలను కాపాడే అత్యంత పవిత్రమైన సేవా వృత్తి అని ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ అన్నారు.జగ్గయ్యపేట లోని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో నూతన విద్యార్థినుల ల్యాంప్ లైటింగ్ కార్యక్రమం మరియు ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) హాజరై విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ నర్సింగ్ సేవలకు ఆద్యురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవా స్ఫూర్తికి ప్రతీకగా ల్యాంప్ లైటింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని, క్యాండిల్ వెలుగు సేవా భావానికి, కరుణకు, మానవత్వానికి ప్రతీక అని వివరించారు. నర్సింగ్ ప్రతిజ్ఞ చేసిన విద్యార్థినులను అభినందిస్తూ, నర్సింగ్ అనేది అత్యంత గొప్ప సేవా వృత్తి అని, వైద్య రంగంలో విశేష ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు అంకితభావంతో, సేవా దృక్పథంతో రోగులకు ఉత్తమ వైద్య సేవలు అందించాలని సూచించారు.

ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా డాక్టర్ ఎస్. నరసింహారావు, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ నందకిషోర్, డాక్టర్ అనూష పాల్గొని ప్రసంగించారు.స్థానిక మెడికల్ ఆఫీసర్ ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ, వాగ్దేవి నర్సింగ్ కళాశాల విద్యార్థినులు క్లినికల్ ప్రాక్టీస్‌లో ప్రతిభ కనబరుస్తున్నారని అభినందించారు.చిల్డ్రన్స్ వైద్యశాల డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ, జగ్గయ్యపేటలో నర్సింగ్ కళాశాల స్థాపన వల్ల ఈ ప్రాంత ఆసుపత్రులకు నాణ్యమైన నర్సింగ్ సిబ్బంది అందుబాటులోకి వస్తారని, తద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం కలుగుతుందని తెలిపారు.శ్రీలక్ష్మి హాస్పిటల్స్ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ, వైద్య రంగంలో నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, వైద్యుడు మరియు రోగి మధ్య వారధిగా నిలుస్తున్నారని వివరించారు.స్మైలీ వైద్యశాల డాక్టర్ అనూష మాట్లాడుతూ, ప్రతి నర్సింగ్ విద్యార్థిని శరీరంలోని ప్రతి అవయవం ఎలా పనిచేస్తుంది, దాని ఉపయోగం ఏమిటి, అది సరిగా పనిచేయకపోతే కలిగే పరిణామాలు ఏమిటి అనే మూడు అంశాలపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలని సూచించా రు. ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ ఎస్. వి నరసింహారావు మాట్లాడుతూ, జగ్గయ్యపేట ప్రాంత ప్రజలకు ఉన్నత ప్రమాణాల వైద్య సేవలు అందించే లక్ష్యంతో వాగ్దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌ను స్థాపించామని, ఉత్తమ నర్సులను తీర్చిదిద్దేందుకు కళాశాల కృషి చేస్తోందని తెలిపారు.కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ డాక్టర్ బుస్సా సరిత మరియు డాక్టర్ బుస్సా సురేష్ మాట్లాడుతూ, స్థానిక శాసనసభ్యులు మరియు పట్టణంలోని ప్రముఖ ఆసుపత్రుల సహకారంతో నర్సింగ్ కళాశాలను స్థాపించి, పేద మరియు మధ్యతరగతి విద్యార్థుల కు నాణ్యమైన నర్సింగ్ విద్యతో పాటు ఉత్తమ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ బుస్సా సురేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులతో నిర్వహిం చబడుతున్న నర్సింగ్ కళాశాలల్లోనే విద్యార్థులు చేరి విద్యను అభ్యసించాలని, తద్వారా వారి భవిష్యత్తు సురక్షితంగా ఉంటుం దని సూచించారు.అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకుల ను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్య క్ర మంలో కళాశాల అధ్యాపకులు, వైద్యులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# మచిలీపట్నం డ్రైనేజీ వ్యవస్థకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు

## రూ.75 కోట్లతో ఎస్‌టీపీలు, డ్రైనేజీ అభివృద్ధి పనులు వేగవంతం

## జిల్లా కోర్టు సెంటర్‌లో పనులను పరిశీలించిన మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నం పట్టణంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం భారీ ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతోందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శుక్రవారం మచిలీపట్నం జిల్లా కోర్టు సెంటర్‌లో కొనసా zగు తున్న డ్రైనేజీ పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోగా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మచిలీపట్నం పట్టణంలోని ప్రధాన డ్రైన్లు, మురుగునీటి పారుదల వ్యవస్థను ఆధునీకరించేందుకు సుమారు రూ.75 కోట్ల వ్యయంతో ఎస్‌టీపీలు (Sewage Treatment Plants), ప్రధాన డ్రైనేజీ నెట్‌వర్క్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లా కోర్టు సెంటర్‌లో జరుగుతున్న పనుల్లో భాగంగా నిర్మిస్తున్న డ్రైనేజీ లైన్‌ను సబ్‌జైలు వద్ద ఉన్న ప్రధాన డ్రైన్‌కు అనుసంధానం చేస్తున్నామని చెప్పారు. అక్కడి నుంచి మురుగునీటిని ఎస్‌టీపీలో శుద్ధి చేసి మహాలక్ష్మి అమ్మవారి కాలువ ద్వారా సముద్రంలోకి విడుదల చేసే విధంగా శాశ్వత ప్రణాళికను అమలు చేస్తున్నట్లు వివరించారు.అదేవిధంగా 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.15 కోట్లతో మచిలీపట్నం పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పట్టణ అభివృద్ధికి అవసరమైన ప్రతి పనిని ప్రాధాన్యతతో చేపడుతున్నామని పేర్కొన్నారు.అనంతరం మార్గమధ్యంలో రహదారి పక్కన ఏర్పాటు చేసుకున్న కూరగాయల దుకాణాలను మంత్రి సందర్శించారు. వ్యాపారులతో కాసేపు ముచ్చటించి కూరగాయల ధరలు, వ్యాపార పరిస్థితులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో రహదారులపై ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రతి ఒక్క వ్యాపారస్థుడు రైతు బజార్‌లోనే తమ దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వ్యాపారుల సంక్షేమంతో పాటు ప్రజల సౌకర్యం కూడా ప్రభుత్వానికి ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో పట్టణంలోని ప్రధాన డ్రైన్లలో కనీసం పూడిక కూడా తొలగించని పరిస్థితి నెలకొనిందని మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రంగా విమర్శించారు. డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రతి వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తాత్కాలిక చర్యలకు కాకుండా శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా భారీ నిధులు కేటాయించి ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. మచిలీపట్నాన్ని పరిశుభ్రమైన, ఆధునిక మౌలిక వసతులు కలిగిన ఆదర్శ



పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి. ఫణికుమార్, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# అదర్శప్రాయంగా ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు



## రామన్నపేటలో మొక్కలు నాటిన పిఏసిఎస్ అధ్యక్షుడు ధనేష్!

ప్రజాభూమి పెడన

పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పుట్టినరోజు వేడుకలను గూడూరు మండలంలోని రామన్నపేట గ్రామంలో అత్యంత ఉత్సాహంగా, వినూత్న రీతిలో జరుపుకున్నారు. రామన్నపేట పిఏసిఎస్ (PACS) అధ్యక్షులు మురాల ధనేష్ సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమం అందరికీ ఆదర్శంగా నిలిచింది. కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, భవిష్యత్ తరాలకు మేలు చేసే పర్యావరణహితమైన 'మొక్కలు నాటే' (సుమారు 150 కి పైగా)బృహత్తర కార్యక్రమానికి వారు శ్రీకారం చుట్టడం విశేషం. గ్రామంలోని ప్రతి వీధిని పచ్చదనంతో నింపాలనే ధనేష్ సంకల్పం, ఎమ్మెల్యే పై ఆయనకు ఉన్న అపారమైన గౌరవానికి నిదర్శనంగా నిలిచింది. ఒక ప్రజాప్రతినిధి జన్మదినాన్ని సామాజిక బాధ్యతతో జరుపుకోవడం ద్వారా, గ్రామాభివృద్ధిలో తాము భాగస్వాములం కావడమే కాకుండా, ప్రకృతిని కాపాడడంలో బాధ్యతాయుతమైన పాత్ర పోషించవచ్చని ఈ బృందం నిరూపించింది. ఈ సేవా స్ఫూర్తిని గ్రామస్థులందరూ అభినందించడమే కాకుండా, రానున్న రోజుల్లో మరిన్ని మొక్కలను నాటి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ప్రతిన పూనారు.

# కాగిత కృష్ణ ప్రసాద్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన కొరియర్ శీను

ప్రజాభూమి పెడన



పెడన నియోజకవర్గం కూటమి శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ వికృతి శ్రీనివాస్ బాబు (కొరియర్ శ్రీను) మరియు జనసేన నాయకులు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని కోరుకున్నారు.

# పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో అంబరాన్ని అంటిన కాగిత కృష్ణ ప్రసాద్ పుట్టిన రోజు వేడుకలు




ప్రజాభూమి పెడన

నిరుపేదల పెన్నిధికి పట్టణ కూటమి నాయకులు పలు సామాజిక కార్యక్రమాలలో భాగంగా బంటుమిల్లి రోడ్ జంక్షన్ లోని చలివేంద్రం వద్ద పండుగ వాతావరణంలో అభిమానులు భాణా సంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేసి శాసన సభ్యులు పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుకొనగా ముఖ్య అతిదులు పట్టణ ప్రముఖులు చందన నారాయణ రావు రాష్ట్ర శిష్టకరణం సాధికారసమితి కన్వీనర్ అక్కుమహంతి రాజా జనసేన నాయకురాలు మట్టా పావని సీనియర్ నాయకులు బెజవాడ నాగరాజు కేక్ కట్ చేసి అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం రెండింటిని సమపాళ్లలో అందిస్తున్న కూటమి ప్రభుత్వంలో మచ్చలేని మంచి వ్యక్తిత్వం మన శాసన సభ్యులు వారి సొంతం అని ప్రముఖులు కొనియాడి ఆశీర్వదించగా, తదుపరి అన్నప్రసాదం వితరణ ప్రారంభించి భోజన ఏర్పాట్లు పర్యవేక్షించారు ఈ కార్యక్రమానికి శ్రీనివాస్ వీణం మిత్ర బృందం నేతృత్వం వహించగా పట్టణ పార్టీ నాయకులు ,వివిధ వార్డుల ఇంచార్జ్ లు ,కార్యకర్తలు అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినారని తెలుపుటకు సంతోషిస్తున్నాము.

# విద్య ఉద్యోగానికే కాదు.. సమాజ వికాసానికి దోహదపడాలి

## మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి



విద్య, ఉద్యోగానికే కాకుండా సమాజ వికాసానికి దోహదపడేదిగా ఉండాలని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే బాధ్యతను ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఉద్బోధించారు.ఉంగుటూరు మండలం, ఆత్కూరు గ్రామంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు శుక్రవారం ముఖాముఖిగా సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ వారి విద్యాభ్యాసం, లక్ష్యాలు, భవిష్యత్ ప్రణాళికల గురించి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ, విద్యతో పాటు మంచి సంస్కారం, నైతిక విలువలు, క్రమశిక్షణ, దేశభక్తి వంటి లక్షణాలను ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని ఆయన ఉద్బోధించారు. వృత్తి విద్య యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడమే కాకుండా స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగేలా ఆత్మవిశ్వాసాన్ని పెంపొం దిస్తుందని పేర్కొన్నారు.ప్రతి విద్యార్థి సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరుడిగా ఎదగాలని, జ్ఞానంతో పాటు మానవీయ విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యా ర్థులు తమ ప్రతిభను సద్వినియోగం చేసుకుంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని



ఆకాంక్షించారు.కార్యక్రమంలో కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు కామినేని శ్రీనివాసరావు, స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రతినిధులు, అధ్యాపకులు, శిక్షణ పొందుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

## ఏలూరు, పశ్చిమగోదావరి 4

శనివారం 27, జూన్ 2026


# పెదవేగి ఆయిల్ ఫెడ్ నూతన నూతన కర్మాగారం నిర్మించాలి

- ఓ.ఈ.ఆర్ పేరుతో కంపెనీలు ఆయిల్ పామ్ రైతులను దోపిడీ చేయడాన్ని అరికట్టాలి.
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్.



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.

పెదవేగిలో నూతన ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని నిర్మించాలని, ఓ.ఈ.ఆర్ పేరుతో ఆయిల్ పామ్ రైతులను కంపెనీలు దోపిడీ చేసే చర్యలను అరికట్టాలని,ఆయిల్ పామ్ రైతులకు అధిక దిగుబడులు నిచ్చే మొక్కలు సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏలూరులోని ఉద్దరాజు రామం భవనంలో ఆయిల్ పామ్ రైతుల సమస్యలపై ఆయన మాట్లాడారు. జులై 3,4,5 తేదీల్లో ఏలూరులో జరిగే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభల్లో ఆయిల్ పామ్ రైతుల సమస్యలపై చర్చించి తీర్మానం చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన 20.5% ఆయిల్ ఎక్స్ ట్రాక్షన్ రేటు (ఓ.ఈ.ఆర్) కు వ్యతిరేకంగా కోర్టులో ఆయిల్ పామ్ కంపెనీలు కేసు వేసి 17.5%కు తగ్గించాలన కోరడం దుర్మార్గమని విమర్శించారు. ఆయిల్ పామ్ కంపెనీలు ఏకమై రైతులకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లడం తగదన్నారు. ఈ విషయంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరిని ప్రకటించాలని కోరారు. కంపెనీలు కోర్టుకు వెళ్లినా ప్రభుత్వాలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కంపెనీలకు వ్యతిరేకంగా, రైతులకు అనుకూలంగా ప్రభుత్వాలే కోర్టుకు వెళ్లాలని, రైతులు ఇంప్లీడ్ అయ్యే ఖర్చును ప్రభుత్వాలే భరించాలన్నారు. ఓ.ఈ.ఆర్ సమస్య పరిష్కారం కావాలంటే నూతన టెక్నాలజీతో పెదవేగిలో ఆయిల్ ఫెడ్ నూతన కర్మాగారాన్ని నిర్మించాలని అందుకు ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నూతన కర్మాగారం నిర్మాణానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు చర్యలు చేపట్టడం లేదన్నారు. పాత మిషనరీతో కూడిన పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం లాభాలలో ఉంటే దాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమ్మివేయాలని ప్రయత్నం చేయడం అన్యాయమన్నారు. పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్నాగారం ప్రైవేటీకరణను రైతులు ఐక్యంగా అడ్డుకున్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పామ్ రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. జులై 3న ఏలూరులో జరుగుతున్న హాలో రైతన్న - చలో ఏలూరు కార్యక్రమంలో ఆయిల్ పామ్ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం నాయకులు ఆర్.లింగరాజు, పి. రామకృష్ణ,పంపన రవికుమార్, ఎం.ఇస్సాకు తదితరులు పాల్గొన్నారు.

## పోతునూరు లో ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన

# ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



ప్రజా భూమి ప్రతినిధి-దెందులూరు

దెందులూరు మండలం పోతునూరులో ప్రముఖ ఆశ్రం వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆశ్రం వైద్య కళాశాల సీఈవో, స్థానిక కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఈ ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆశ్రం వైద్య కళాశాల యాజమాన్యం, వైద్య బృందం, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు.


## ఏలూరులో ఘనంగా బెస్ట్ మనీ గోల్డ్ నూతన బ్రాంచ్ ప్రారంభం




ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

నగరంలో బీఎంజీ బెస్ట్ మనీ గోల్డ్ నూతన బ్రాంచ్‌ను శుక్రవారం ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలనం, రిబ్బన్ కటింగ్‌తో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు పారదర్శకంగా, నమ్మకమైన సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.సంస్థ సీఈఓ సెల్వం మాట్లాడుతూ, పారదర్శక లావాదేవీలతో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం తమ లక్ష్యమన్నారు. అలాగే భారతదేశంలో 300 పైగా బ్రాంచులు కలిగి ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్లో 50 బ్రాంచీలు నెలకొల్పడమే తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.ఇతర బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థల్లో తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి,అదే రోజు మార్కెట్ ధరకు కొనుగోలు చేసే సేవలను అందిస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో జోనల్ మేనేజర్లు అనిల్ కుమార్,వెంకటేశ్వర్లు,సంస్థ సిబ్బంది, వ్యాపారవేత్తలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## గ్రూప్ వన్ ఆఫీసర్ అయిన స్నేహం ముందు బలాదూర్



ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి

ఇద్దరు మిత్రుల ఆత్మీయ కలయిక ప్రాంతాలు వేరైనా స్నేహం వేరు కాదని నిరూపించిన సంఘటన ఈరోజు జీలుగుమిల్లి మండల కేంద్రంలో నిరూపితమైంది.తెలంగాణ రాష్ట్రం దమ్మపేట మండలం తాటి సుబ్బన్న గూడెం గ్రామానికి చెందిన తాటి ప్రమోద్ సాయి ఇటీవల జరిగిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నందు గ్రూప్ 1 ఉద్యోగం సాధించి ఖమ్మం జిల్లా అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ తన స్నేహితుడిని కలవడానికి జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు హెల్త్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న కూరం ప్రసాద్ ను కలిసి ముచ్చటించారు. స్నేహం ముందు గ్రూప్ వన్ ఆఫీసర్ అయిన బలాదూరే అని నిరూపించారు. తనకోసం వచ్చిన మిత్రునికి పుష్ప గుచ్చం తో స్వాగతం పలికిన అభినందనలు తెలిపారు ప్రసాద్. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోయిన తాటి ప్రమోద్ సాయి ఎన్నో కష్టాలు పడి తన తల్లి సుదర్శనమ్మ ప్రోత్సాహంతో విజయం సాధించి పలువురి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. అభినందనలు తెలిపిన వారిలో సిరి వెంకటేశ్వరరావు, కోలా రాము తదితరులు ఉన్నారు.

## జనసేన పార్టీ సమాచార కమిటీని కలిసి అభినందన తెలియజేసిన వేలేరుపాడు జనసేన మండల పార్టీ



ప్రజా భూమి ప్రతినిధి-వేలేరుపాడు

జనసేన పార్టీ ఏలూరు పార్లమెంటరీలో పోలవరం నియోజకవర్గం నుండి జనసేన సమాచార సేకరణ కమిటీలు సభ్యులుగా సెలెక్ట్ అయిన కరాటం సాయి చంద్రమోహన్(సాయి),అడపా నాగరాజు, గుండుమొగులు సత్యనారాయణలను వారి నివాసాల వద్ద వేలేరుపాడు జనసేన పార్టీ మండల అధ్యక్షులు గణేషుల ఆదినారాయణ, సభ్యులు కలిసి పుష్పగుచ్చం ఇచ్చి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనసేన పార్టీని బలోపేతం చేయడంలో సమాచార కమిటీ ముందుంటుంది. పార్టీ కోసం కష్టపడిన వారికి ఎప్పుడూ గుర్తింపు వస్తుంది అని అన్నారు.అదేవిధంగా జనసేన పార్టీ ఎదుగుదాలకు కృషి చేసినవారిని గుర్తింపు మరియు జనసేన పార్టీ అధినేత పవన కళ్యాణ్ ఆశయాలను జనసేన పార్టీ సిద్ధాంతలను ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్ళేవారిని కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న వారిని తీసుకోవడం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో అయన వెంట జనసేన నాయకులు కుక్కునూరు సాయి, గుండారపు శివకృష్ణ, సోషల్ మీడియా ఇంచార్జి కొవ్వాల క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కామవరపుకోట మండలం అత్యవసర సమావేశం

- వైఎస్ఆర్సిపి నాయకులు అప్రమత్తంగా ఉండాలి
- నియోజకవర్గ ఇన్చార్జి విజయ రాజు



ప్రజా భూమి ప్రతినిధి-కామవరపుకోట

ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయ రాజు అన్నారు. కామవరపుకోటలో ఎస్ ఐ ఆర్ కీలక సమావేశం చింతలపూడి నియోజకవర్గ ఇన్చార్జ్ కంభం విజయరాజు పర్యవేక్షణలో మండల అధ్యక్షులు రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఎ ల కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం గురించి ప్రతి కార్యకర్త మరియు బి ఎల్ ఎ లు అప్రమాతంగా ఉండాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఏ ఒక్క ఓటు కూడా పోకూడదని బి ఎల్ ఓ లతో కలసి పని చేయాలనీ సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ ఇన్చార్జ్ కంభం విజయరాజు, చింతలపూడి నియోజకవర్గ ఎస్ ఐ ఆర్ ఇంచార్జి పల్లబత్తుల శ్రీను, కామవరపుకోట మండల అధ్యక్షులు రాయంకుల సత్యనారాయణ, బొడ్డు వెంకటేశ్వరరావు, చింతలపూడి మండల అధ్యక్షులు స్టేట్ కల్చర్ వింగ్ అధ్యక్షులు సాయిని కనకరాజు, కామవరపుకోట టౌన్ ప్రెసిడెంట్ బొల్లు వెంకట సత్యనారాయణ, కామవరపుకోట మండల బూత్ అధ్యక్షులు మానుకొండ దేవరాజు, సచివాలయం 1 ప్రెసిడెంట్ డాక్టర్ తమ్మిశెట్టి గిరిజ సుబ్రహ్మణ్యం మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## జగదాంబ అమ్మవారి విగ్రహాన్ని ఇక్కడే ఉంచాలి

### రోడ్ ఎక్కి ధర్నా రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు



ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి

ఆలయాన్ని ఎటి పరిస్థితులను కదిలించే ప్రసక్తి లేదంటూ పెద్ద ఎత్తున మహిళల ఆధ్వర్యంలో రాస్తారోకో ధర్నా నిర్వహిస్తున్నారు. జీలుగుమిల్లి సెంటర్లో ఉన్న శ్రీ శ్రీ జగదాంబ అమ్మవారి ఆలయాన్ని రోడ్డు విస్తరణ లోభాగంగా సెంటర్ నుంచి తీయటానికి వీ లేదని గ్రామంలో ఉన్న మహిళలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో జగదాంబ సెంటర్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రోడ్డు పనులు విస్తరి నా కార్యక్రమంలో చురుకుగా సాగుతుంది. కేవలం రింగ్ రోడ్డు మాత్రమే పనిచేయవలసి ఉంది. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం ముందుకు సాగాలని ఒక వర్గం. లేదు ఇక్కడే కొనసాగాలించాలి అంటూ మరో వర్గం పట్టుబడుతున్న నేపథ్యంలో నేడు రాస్తారోకో ధర్నా వరకు వచ్చాయి. రానున్న రోజులు ఏం జరగనున్నదో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

# కార్మికుల హక్కులను కాలరాస్తే సహించం

- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య
- కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికుల పర్మెంటుకై దశలు వారి పోరాటాలు
- రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు






ప్రజాభూమి ప్రతినిధి- కాకినాడ

కార్మికుల హక్కులను ప్రభుత్వాలు కలరాస్తే సహించేది లేదని ఏఐటీ యూసి నాయకులు పేర్కొన్నారు.ఏఐటీయూసీ కాకినాడ జిల్లా సమితి సమావేశం శుక్రవారం ఉదయం కాకినాడలో స్థానిక మూర్తి నగర్ లో పొన్నమండ రామచంద్రరావు భవన్లో జిల్లా అధ్యక్షులు కసింకోట కిషోర్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎస్. వెంకటసుబ్బయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ తాటిపాక మధు లు హాజరయ్యారు. ముందుగా ఇటీవల మృతి చెందిన మృత వీరులకు నివాళులర్పించారు. ఈ సమావేశానికి హాజరైన ఎస్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్లో సంభవించిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన బాధితు కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, గత ప్రభుత్వంలో ఎల్జి పాలిమర్ లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు చొప్పున నష్ట పరిహారం చెల్లించారని, అదేవిధంగా ఈ బాధిత కుటుంబాలకు కోటి రూపాయలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జులై మూడో తేదీన రాష్ట్రవ్యాప్తంగా బాధితు కుటుంబాలకు న్యాయం చేయాలని ఆందోళన నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ఈనెల 29వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయాలు వద్ద సివిల్ సప్లై హమాలీ కార్మికుల యొక్క సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రేట్లు పెంచాలని నిరసన ఆందోళన చేపడుతున్నామని ఆయన అన్నారు. ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు విశాఖపట్నంలో ఆగస్టు నెలలో అంగరంగ వైభవంగా జరుగుతాయని ఆటో కార్మికుల సమస్యలపై భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ చేపడతామని ఆయన అన్నారు. మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్‌కు జీతాలు పెంచాలంటే కాంట్రాక్టర్లు 50 సంవత్సరాలు బెదిరిస్తూ కుంటి సాకులు చెబుతున్నారని వారికి జీతాలు పెరిగే వరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమ పోరాటాలు కొనసాగిస్తామని ఆయన అన్నారు.తాటిపాక మధు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలపై జులై 7వ తేదీన చలో విజయవాడకు కార్మికుల అధిక స్థాయిలో తరలిరావాలని అదేవిధంగా అవుట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని మధు పిలుపునిచ్చారు.

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ నెలకొకసారి రంగాల సమావేశాలు నిర్వహించుకోవాలని, ఏఐటీయూసీ అనుబంధ ప్రజా సంఘాల నిర్మాణాలు పటిష్ట పరచాలని, జూలై నెల చివర భాగంలో ఏఐటీయూసీని మరింత బలపరచుటకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఆయన అన్నారు.ఇటీవలే తిరుపతిలో జరిగిన ఏఐటియుసి రాష్ట్ర మహాసభల్లో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎస్ వెంకటసుబ్బయ్యకు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ తాటిపాక మధుకు అభినందనలు తెలియజేయడం జరిగింది.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కామారెడ్డి బోడకొండ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి శ్రీనివాస రావు, సీనియర్ నాయకులు కే ఆదినారాయణమూర్తి, సివిల్ సప్లై రాష్ట్ర నాయకులు తలాటి వీరబాబు, కార్యదర్శి టి అన్నవరం, బి స్వామి బాబు, ఎం దుర్గాప్రసాద్, రాజాజీ, సుబ్బలక్ష్మి, బంగారు రాజేష్, నూకరాజు, చెక్క అప్పలకొండ, రామయ్య, అనిల్, శాఖ రామకృష్ణ, కాటవేణి, శివ, ముమ్మిడి బాబ్జి, కేశవరపు అప్పలరాజు, బొత్స శ్రీను, ఆనంద రావు, పద్మ, మోహన్ రావు తదితర రంగాల సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ప్రజాదర్బార్

కొత్తపేటలో జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండార సత్యానందరావు.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

ప్రజల సమస్యలపై స్పందిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులకు చేరేలా కృషి చేయడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం కొత్తపేట ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే బండారు స్వయంగా ప్రజలతో మమేకమై వారి వద్ద నుంచి వినతులు, అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా మొత్తం 16 వినతులు వచ్చాయి. గ్రామ స్థాయిలో సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ ఉపయోగపడుతుందన్నారు.

## పాలకొల్లు లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం భారీ అవగాహనా ర్యాలీ

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు



ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం జూన్ 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తున్న సందర్భంగా, నేడు పాలకొల్లు పట్టణంలోని బాలుర వసతి గృహం నుండి మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించబడింది.ఈ సందర్భంగా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఎం. శ్రీనివాసరావు, పాలకొల్లు టౌన్ సీఐ శ్రీ రజనీకుమార్ మాట్లాడుతూ, గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును, కుటుంబాలను మరియు సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండి విద్య, ఉపాధి మరియు ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. మాదక ద్రవ్యాల విక్రయం, రవా ణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప ప్రొహిబిషన్ ఙ ఎక్సైజ్ శాఖ లేదా పోలీసు శాఖకు తెలియజేసి, మత్తు రహిత సమాజ నిర్మాణంలో ప్రజలు భాగ స్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ అవగాహన ర్యాలీలో ప్రొహిబిషన్ ఙ ఎక్సైజ్ సీఐ ఎం. శ్రీనివాసరావు, ఎస్ఐలు రఘు, శ్రీ మహేష్, ప్రొహిబిషన్ ఙ ఎక్సైజ్ సిబ్బంది, పాలకొల్లు టౌన్ సీఐ రజనీకుమార్, పోలీసు సిబ్బంది, టాక్సీ డ్రైవర్లు, బాలుర వసతి హాస్టల్ విద్యార్థులు మరి యు ప్రజలు పాల్గొన్నారు

## జనసేన పార్టీ ఏలూరు పార్లమెంటు సాధక్ రిప్రజంటేటివ్ గా ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా గుర్తింపు.

-హర్షం వ్యక్తం చేసిన జనసేన శ్రేణులు, ఏలూరు జనసైనికులు.

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా



జనసేన పార్టీ సంస్థాగత బలోపేతానికి చేపట్టిన జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ నియామకాల్లో భాగంగా ఏలూరు పార్లమెంట్ పరిధికి సంబంధించిన కమిటీల ను జనసేన పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఈ కమిటీల్లో భాగంగా ఏలూరుకు చెందిన జనసేన సీనియర్ నాయకుడు, ఉమ్మడిగా పశ్చిమగోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి, ఓబిలి శెట్టి శ్రావణ్ కుమార్ గుప్తకు సాధక్ రిప్రెజెంటేటివ్ గా గుర్తింపు లభించడం పట్ల జనసేన నాయకులు, జన సైనికుల్లో ఆనందాన్ని నింపింది. ఈ సందర్భంగా ఆయన ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన ఇన్చార్జి రెడ్డి అప్పలనాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రావణ్ గుప్తా మాట్లాడుతూ పార్టీ కోసం అంకిత భావంతో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యతను కల్పిస్తూ కమిటీలను నియమించిన, జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని, పార్టీ బలోపేతానికి తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని శ్రావణ్ గుప్తా పేర్కొన్నారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టుకుం టానని అన్నారు. ఏలూరు పార్లమెంట్ పరిధిలో జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు, జన సైనికులు, మెగా అభిమానులు ఓబిలిశెట్టి శ్రావణ్ గుప్తాకు అభినందనలు తెలియజేశారు.

# రాజకీయ స్వార్థం కోసమే కులాల మధ్య వైసిపి చిచ్చు పెడుతోంది

- కాపు సామాజికవర్గానికి మేలు చేసింది టీడీపీనే.
- వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ముగ్గురు నాయకులదే పెత్తనం.
- కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.
కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందుతున్నా యని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం రావులపాలెం తెలుగు దేశం పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కులాల మధ్య వైష్యమ్యాలు సృష్టించేందుకు వైసీపీ కాపుల మధ్య చిచ్చు పెట్టాలని కుటిల రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన విమర్శించారు. కాపు నాయకుల ఆత్మీయ సమావేశాల పేరుతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై బురదజల్లే ప్రయత్నాలను రాష్ట్ర ప్రజలు, కాపు సామాజిక వర్గం గమనిస్తోందన్నారు. వైసీపీ ఎప్పుడూ రాష్ట్ర అభివృద్ధి పై దృష్టి పెట్టదని, దిగజారుడు రాజకీయాలు మాత్రమే చేస్తుందన్నారు. అందులో భాగంగా ఒక నేరస్తుడిని ముందుకు పెట్టి కాపు నేతలతో సమావేశాలు నిర్వహిస్తూ కూటమి ప్రభుత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై అసత్య ప్రచారం చేస్తోందన్నారు. వైసిపి కాపు నాయకులను రాష్ట్రంలోని కాపు సామాజికవర్గం నమ్మే పరిస్థితి లేదన్నారు. కాపులకు న్యాయం చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీయేనని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాపు రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించారని గుర్తు చేశారు. 2019 ఎన్నికల ప్రచార సమయంలో జగ్గంపేటలో కాపులకు రిజర్వేషన్లు కల్పించడం సాధ్యం కాదని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బహిరంగంగానే చెప్పారని, అప్పుడు వైసీపీలో ఉన్న కాపు నాయకులు ఎవరూ ప్రశ్నించలేదన్నారు. ఇప్పుడు వైసీపీ మళ్లీ అధికారంలోకి రావడం అసాధ్యమని గ్రహించి కాపు నాయకులతో సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఈడబ్ల్యూఎస్ (ఈడబ్ల్యూఎస్ ) 10 శాతం రిజర్వేషన్లలో రాష్ట్రంలో కాపులకు 5 శాతం ప్రయోజనం చంద్రబాబు కల్పించారని అన్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ 5 శాతం రిజర్వేషన్లను నిలిపివేసిందన్నారు. ఇలా అడుగడుగునా కాపులపై వివక్ష చూపించడం వైసీపీకి అలవాటన్నారు. 2019 నుంచి వైసీపీ పాలనలో రాష్ట్రంపై వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, మిథున్ రెడ్డి వంటి నేతలే పెత్తనం చెలాయించారని, నేడు కాపులను ముందుకు పెట్టి రాజకీయ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. కాపుల కోసం మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదన్నారు. వైసీపీ పార్టీ కోసం జీవితాంతం పోరాడిన కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అనారోగ్యంతో వెంటిలేటర్‌పై ఉన్నప్పుడు కూడా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇటీవల ఆయన కుమార్తె క్రాంతి చేసిన వ్యాఖ్యలే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న సమయంలో పవన్ కళ్యాణ్ కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు చేయించడమే కాకుండా, మెగాస్టార్ చిరంజీవిని ఇంటికి పిలిపించుకుని జగన్‌మోహన్ రెడ్డి అవమానకరంగా వ్యవహరించారన్నారు. ఈ విషయాలన్నింటినీ రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, ఇప్పటికే 11 అసెంబ్లీ స్థానాలకు పరిమితమైన వైసీపీ రానున్న రోజుల్లో పూర్తిగా ప్రజల ఆదరణ కోల్పోతుందని హెచ్చరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని, కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధినే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. విద్య, ఉద్యోగాలు, స్వయం ఉపాధి రంగాల్లో కాపు యువతకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రాజకీయ స్వార్థం కోసం కులాల మధ్య చిచ్చుపెట్టి సమాజాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు మానుకోవాలని, కాపు సమాజ ఐక్యత, రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్పష్టం చేశారు.

## పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాంధించిన విద్యార్థులకు ఘనసత్కారం



ప్రజాభూమి ప్రతినిధి - కొత్తపేట
రావులపాలెం మండల స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఎస్సీ విద్యార్థులకు ఘనసత్కారం లభించింది. మండల పరిధి పొడగట్లపల్లి శ్రీ బెజవాడ గోపాలరెడ్డి ఓరియంటల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పల్లి వర్షిత, జాలాది అపర్ణలకు ఎపిఎస్సీ వెల్ఫేర్ అసోషియేషన్ డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ శాఖ ఆధ్వర్యంలో ఘనసన్మానం నిర్వహించారు. మండల ఎస్సీ విద్యార్థుల్లో పల్లి వర్షిత 600 గాను 573, జాలాది అపర్ణ 600 గాను 568 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. ఈసందర్భంగా అమలాపురం అంబేద్కర్ భవనం లో అసోషియేషన్ అధ్యక్షుడు గోసంగి బంగర్రాజు, జిల్లా ఎస్సీ సెల్ గౌరవ అధ్యక్షుడు ఎంఎకె భీమారావు, పంచాయతీ రాజ్ డిఇ పిఎస్ రాజ్ కుమార్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు జివి రమణ, ఎస్టీయు అధ్యక్షుడు కారుపల్లి కళ్యాణ్, ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి బత్తుల రమేష్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత కత్తుల ఆనందరావు చేతులు మీదుగా పురస్కారం లభించింది. విద్యార్థులను విజయానంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కత్తుల ఆనందరావు సమకూర్చిన మెమెంటో, శాలువా, బ్యాగ్, పతకంతో సత్కరించారు. అలాగే కె శేషగిరిరావు ఎస్ఎ జడ్పీ హెచ్ ఎస్ మునిపల్లి, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా శాఖ సమకూర్చిన నగదు బహుమతిని విద్యార్థులకు అందచేసారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు, గ్రామ ప్రజలు, మండల ఎస్సీ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్థిక కార్యదర్శి భూపతి మనోహర్ బాబు, మాజీ వెల్ఫేర్ అధ్యక్షుడు, ఎస్సీ వెల్ఫేర్ అసోషియేషన్ మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాల నుండి పక్కదారి పడుతున్న యూరియా





- నియంత్రించలేకపోతున్న అధికారులు
- రైతన్నకు మొండిచేయి చూపిస్తున్న ఎరువుల షాపులు

ప్రజా భూమి ప్రతినిధి - కూనవరం
మండలంలోని ఎరువులు షాపులో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి గత ఏడాదిలో వ్యవసాయానికి కావలసిన అవసరమైన యూరియాని అనేక దుకాణదారులు పక్కదారి పట్టించడం జరిగింది దీనిపై వ్యవసాయ శాఖ అధికారులు వారికి అనేకసార్లు మందలించడం నోటీసులు ఇవ్వడం జరిగింది కానీ నేడు ఇంకా వ్యవసాయ పనులు మొదలు కానేకాలేదు షాపులో నిర్వహించిన ఎరువుల బస్తాలు నేడు పక్క మండలాలకు పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయి ఇది ఎక్కడో జరిగిన విషయం కాదు మండలంలోని పోచవరం పంచాయతీ పోచవరం కాలనీలో ఉన్న ఒక ఎరువుల దుకాణంలో జరిగిన సంఘటన అర్ధరాత్రి దాటిన తర్వాత ట్రాక్టర్లపై పక్క రాష్ట్రం తెలంగాణకు తరలిపోతున్నాయి ఇది ఏమిటి అని ట్రాక్టర్ డ్రైవర్‌ని అడగగా యూరియా బస్తాలు యూరియా బస్తాలు తీసుకు వెళుతున్నానని వారు సమాధానం ఇచ్చారు ఒక్కసారిగా 200 బస్తాల యూరియాలు తరలించడమంటే అది సామాన్యమైన విషయం కాదు గతంలో ఈ దుకాణం దారుడు పై అనేక సార్లు వ్యవసాయ శాఖ అధికారులు దాడులు నిర్వహించడం జరిగింది గత సంవత్సరం కూడా రైతులకు అందాల్సిన ఎరువులను పక్కదారి పట్టించడంలో మొదటి ప్రాధాన్యత సంచరించుకున్న దుకాణం ఇదే రాత్రికి రాత్రి తరలిపోతున్న ఎరువుల బస్తాలపై స్థానిక వ్యవసాయ అధికారిని ఫోన్ ద్వారా వివరణ అడగగా ఆమె సమాధానం నేను ప్రస్తుతం సెలవులో ఉన్నాని నా స్థానంలో ఎటపాక వ్యవసాయ అధికారిని నియమించారని వారు తెలియజేస్తూ గతంలో కూడా ఈ దుకాణదారుడు అనేకమార్లు రైతుల అందించాల్సిన యూరియా బస్తాలను అక్కదారి పట్టించాడని అనేకమార్లు అక్కడ రైతులు ద్వారా తెలుసుకొని అతని దుకాణ దుకాణంపై దాడులు నిర్వహించడం జరిగింది అలాగే ఆ దుకాణ యజమాని మందలించడం కూడా జరిగింది, ఆయన ప్రవర్తన మారటం లేదని ప్రస్తుతం నేను సెలవులో ఉండటం వల్ల నేను ఏమి చేయలేకపోతున్నాని వారు సమాధానం ఇచ్చారు దుకాణదారుడు కి శరవాణి (ఫోన్) ద్వారా సమాచారం అడగగా నేను ఏమి తప్పు చేయలేదు ఎవరికైతేనే రైతులకే ఇస్తున్నాను అది ఏ రాష్ట్రమైనా ఏ మండలం అయినా ఒకటే కదా అలాగే సొసైటీలో వస్తున్న యూరియా బస్తాలను మా పంచాయతీలోని అలాగే మా పక్క పంచాయతీలోని బడా బాబుగా ఇండ్లలో సుమారు వందల కొద్ది బస్తాలు నిలవ ఉన్నాయని దీనిపై మీరు ఏమీ అడగరు అని ఆయన సమాధానం ఇస్తూ ఆయన దాటేసిన యూరియా బస్తాల గురించి మీరేం చేసుకుంటారో చేసుకోండి అనే విధంగా మాట్లాడుతున్నారు దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ఆ దుకాణదారుడుపై చర్యలు తీసుకొని తరలిపోయిన యూరియా బస్తాలను వెంటనే వెనక్కి తెప్పించి రైతులకు అందించాలని అక్కడి రైతులు కోరుకుంటున్నారు.

# ద్రాక్షారామం అగ్నిప్రమాద బాధితులకు అండగా జనసేన యువనేత నాగేంద్ర



- మార్కెట్ పునర్నిర్మాణానికి రూ.3లక్షల ఆర్థిక సాయం
- దాతృత్వాని నియోజకవర్గ ప్రజలు ప్రశంసలు

ప్రజాభూమిప్రతినిధి - కాజులూరు
డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకున్న భారీ అగ్నిప్రమాద ఘటనపై జనసేన యువనేత, డిఎన్ఎఫ్ వ్యవస్థాపకులు, ఎన్నారై దేగల నాగేంద్ర తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు 48 దుకాణాలు అగ్నికి ఆహుతి కావడంతో పలువురు వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారని తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యారు. అగ్నిప్రమాద బాధిత వ్యాపారులు చిన్న సన్నకారు రైతులుగా భావించి వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో రామచంద్రపురం జనసేన పార్టీ తరపున తన స్వచ్ఛంద సంస్థ అయిన దేగల నాగేంద్ర ఫౌండేషన్ తరపున రూ. 3లక్షల రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించారు. ద్రాక్షారామం మార్కెట్ పునర్నిర్మాణం, బాధిత వ్యాపారుల పునరావాసం కోసం అవసరమైన సహకారం అందించేందుకు కట్టుబడి ఉంటా మని పేర్కొన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్న సమయంలో వారికి అండగా నిలబడాలనే తమ అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు అనుగుణంగా తన బాధ్యతగా భావించి ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ఈ సహాయం తన స్వచ్ఛంద సంస్థ ద్వారా ఇవ్వనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. బాధిత వ్యాపారులు అధైర్య పడకుండా మనో ధైర్యంతో ఉండాలని యువనేత నాగేంద్ర ఈసందర్భంగా పేర్కొన్నా రు. ఇదిఇలా ఉండగా నాగేంద్ర దుబాయ్ లో ఉన్నప్పటి అగ్నిప్రమాదం విషయం తెలుసు కుని తన బాధ్యతగా తన వంతు 3లక్షలు అర్థిక సహాయం ప్రకటించడం పట్ల నియోజ కవర్గంలో జన శ్రేణులతో పాటు ప్రజలు సైతం ఆయన దాతృత్వానికి ప్రశంసలు, అభినందనలు తెలియజేశారు.

# పేదల ఆరోగ్యానికి కొండంత అండ 'సీఎంఆర్ఎఫ్': మంత్రి కందుల దుర్గేష్



- నిడదవోలు క్యాంపు కార్యాలయంలో రూ.71.81 లక్షల విలువైన 125 సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీలు పంపిణీ చేసిన మంత్రి దుర్గేష్
- నియోజకవర్గంలో ఇప్పటివరకు 998 మంది లబ్ధిదారులకు రూ.6.79 కోట్ల లబ్ధి చేకూర్చామని వెల్లడి

ప్రజాభూమి ప్రతినిధి - నిడదవోలు
ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేద ప్రజల ఆరోగ్య భద్రతకు ఒక గొప్ప వరమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శుక్రవారం నిడదవోలులోని క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన 125 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 71,81,116 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను, ఎల్వోసీ పత్రాలను మంత్రి దుర్గేష్ స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. 113 మందికి రూ. 45,38,253 విలువైన చెక్కులు, 12 మందికి రూ. 26,42,863 విలువైన ఎల్వోసీ పత్రాలు అందించామన్నారు. "నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటివరకు సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ, మరియు ప్రత్యేక ఆర్థిక సాయం ద్వారా మొత్తం 998 మంది బాధితులకు రూ. 6,79,62,676 ఆర్థిక లబ్ధి చేకూర్చాం."అని మంత్రి కందుల దుర్గేష్ వివరాలు వెల్లడించారు. ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, పేద ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిరుపేదలకు ప్రతి 15 రోజులకొకసారి సీఎంఆర్ఎఫ్ సాయం అందిస్తుండం గొప్ప విషయమని, ఇది ఒక నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. సకాలంలో నిధులు విడుదల చేసి పేదలను ఆదుకుంటున్నందుకు గాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల కు మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో నిరుపేదలకు సైతం అత్యాధునిక కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందే పేదలపై ఆర్థిక భారం పడకుండా సీఎంఆర్ఎఫ్ ద్వారా పూర్తి సహకారం అందిస్తున్నామని చెప్పారు. బాధితులు శారీరకంగా, ఆర్థికంగా కుంగిపోకుండా కొండంత అండగా నిలవడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు.
ప్రభుత్వానికి లబ్ధిదారుల కృతజ్ఞతలు
కష్టకాలంలో తమకు అండగా నిలిచినందుకు లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబాలను ఆదుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు స్థానిక శాసనసభ్యులు, మంత్రి కందుల దుర్గేష్ లకు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## మత్తు పదార్థాలపై శ్యామ్ ఇనిస్టిట్యూట్
# విద్యార్థులు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ



ప్రజాభూమి ప్రతినిధి- కాకినాడ రూరల్
రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నషా ముక్తభారత్ అభియాన్ లో భాగంగా శుక్రవారం కాకినాడలో గల శ్యామ్ ఇన్స్టిట్యూట్ విద్యార్థులతో ర్యాలీ మత్తుపదార్థాలపై అవగాహన కల్పించాల్పించి, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు విభిన్న మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ ఏవై శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు సేవిచడం విద్యార్థుల యొక్క భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. మత్తు పదార్థాలకు బానిసలై బంగారం లాంటి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని ఆయన తెలిపారు. అలాగే ఈగల్ టీం వారు మత్తు పదార్థాలు అమ్మడం లేదా కొనుగోలు చేయడం సరఫరాకు సంబంధించి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ జి. శ్యామ్ మాట్లాడుతూ.. తమ ఇన్స్టిట్యూట్లో ఎవరైనా విభిన్న ప్రభావంతులు వివిధ రకాల ట్రైనింగ్ తీసుకునేందుకు తమను సంప్రదించిన ఎడల వారికి 50 శాతం రాయితీపై ట్రైనింగ్, ఆన్లైన్ ఆఫ్లైన్ ద్వారా వారికి 50 శాతం రాయితీపై ఉచిత గా ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఈగల్ టీం సీఐ, వెంకటేశ్వరరావు, సీఈఓ శ్రీనివాస్ కోచ్ కాంతారావు, పుష్కర మాత కాన్వెంట్ కమిటీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ నత్త నడకన సాగడంపై ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఆగ్రహం



ప్రజాభూమి ప్రతినిధి - కాకినాడ రూరల్
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ - సర్ ప్రక్రియకు సంబంధించి కాకినాడ రూరల్ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లిబాబు తిమ్మాపురం గ్రామపంచాయతీ పరిధిలోని పోలింగ్ స్టేషన్ 15 నెంబర్ పరిధిలో ఎన్యూమరేషన్ పత్రాలు తీవ్ర జాప్యం జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీఎల్వోలు ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీని ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ 15 నెంబర్ పరిధిలో ఎన్యూమరేషన్ పత్రాల పంపిణి సరిగా జరగకపోవడం గల కారణాలు అడిగి తెలుసుకుని బూత్ స్థాయి అధికారులైన పంచాయతీ సిబ్బందిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా నిర్ణీత గడువులోపు ఫారాలు పంపిణీ చేయక లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫారాలు పంపిణీకి సంబంధించి స్థానిక స్వయం సహాయక సంఘాలు, అంగన్వాడి, ఆశా వర్కర్ల సహాయం తీసుకోవాలని ఆర్డీవో ఆదేశించారు. అనంతరం స్థానిక అవంతి నగర్ లో ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ స్వయంగా ఆయన పర్యవేక్షించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీలో భాగంకావాలని ఆయన ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆర్డీవో వెంట కాకినాడ రూరల్ తహసీ ల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి, డిప్యూటీ తహసీల్దారులు సురేష్, ప్రసాద్, బూతు స్థాయి ఏజెంట్లు పాల్గొన్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన బాల ఇంద్రజాలికుడు రుషిత్


ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు శ్యామ్ జాదూగర్ మనవడు ఆరు సంవత్సరాల బాల ఇంద్ర జాలికుడు రుషిత్ ఎబెక్ లాంగ్వేజ్ లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భారత్ శ్రీలంక లో ఆన్ లైన్ లో ఎబెక్ రీడాథాన్ పేరున గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ కోసం ప్రపంచం లోనే అత్యధిక మంది విద్యార్థులు ఒకేసారి పఠనం, శ్రవణ నైపుణ్య పోటీలలో ప్రత్యేక ప్రతిభ కనబరిచి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించాడు. రుషిత్ ప్రస్తుతం స్థానిక నక్షత్ర స్కూల్ లో ఒకటవ తరగతి చదువు తున్నాడు. గతంలో 22 నెలల వయసులోనే ఇంద్రజాల ప్రద ర్శనలు నిర్వహించి అతి చిన్న ఇంద్రజాలికుడిగా రికార్డులు సృష్టించాడు. అదేవిధంగా అతి చిన్న వయసు నుండి కోవిడ్ మరియు పర్యావరణం పై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే కార్యక్రమాలతో పాటు తన చిన్న బైక్ పై కళ్ళ గంతులు కట్టుకుని బండి నడుపుతూ డ్రగ్స్ వాడకండి మీ జీవితాలను పాడు చేసుకోకండి అంటూ యువతను చైతన్యం చేసే కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రుషిత్ ని పలువురు అభినందించారు

## అమ్మపాలెంలో నేమాస్త్రం తయారీపై రైతులకు ప్రత్యక్ష శిక్షణ

ప్రకృతి వ్యవసాయంలో మూలికా కషాయాల వినియోగంపై అవగాహన



ప్రజా భూమి ప్రతినిధి - పెదవేగి
ఏలూరు జిల్లా పెదవేగి మండలం అమ్మపాలెం గ్రామంలో నిర్వహించిన "రైతన్న మీకోసం" కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులకు చేరువ చేసే దిశగా నేమాస్త్రం తయారీపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ డీపీఎం బి. వెంకటేష్ ఆదేశాలు, డివిజనల్ ఇన్‌చార్జి ఎన్ఎఫ్ఏ నవీనా సూచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎఫ్ఎమ్టి చందు సత్తిబాబు రైతులు, మహిళా రైతులకు నేమాస్త్రం తయారీ విధానం, దాని వినియోగం, ప్రయోజనాలను సవివరంగా వివరించారు. నేమాస్త్రం ఒక సహజసిద్ధమైన మూలికా కషాయంగా పంటలకు హాని చేసే రసం పీల్చే మరియు ఆకులను తినే పురుగుల నియంత్రణలో సమర్థవంతంగా పనిచేస్తుందని, రసాయన మందుల వినియోగాన్ని తగ్గించి పంటలను ఆరోగ్యంగా పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అలాగే వివిధ మూలికలతో తయారుచేసే హెర్బల్ డికాక్షన్లు (మూలికా కషాయాలు) పంటల్లో పురుగులు, తెగుళ్లను సహజ పద్ధతిలో నియంత్రించి, నేలలోని ఉపయోగకర సూక్ష్మజీవులను సంరక్షించడంతో పాటు పర్యావరణాన్ని కాపాడతాయని, తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనాలు అందిస్తూ రైతుల ఆదాయాన్ని పెంచే ప్రకృతి వ్యవసాయంలో ఇవి కీలక సాధనాలని వివరించారు. కార్యక్రమంలో రైతులు, మహిళా రైతులు ఉత్సాహంగా పాల్గొని నేమాస్త్రం తయారీ, వినియోగంపై ప్రత్యక్ష అవగాహన పొందారు.

ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

శనివారం 27 జూన్ 2026

# దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం...

- డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం. ..దేశ యువతను కాపాడుదాం : జిల్లా ఎస్. పి. జగదీష్
- మాదకద్రవ్యాల దుర్వినియోగం చట్టరీత్యా నేరం.. డి ఎల్ సి ఏ సెక్రటరీ జడ్జి రాజశేఖర్
- మత్తు మానండి - జీవితాన్ని గెలవండి డ్రగ్స్ రహిత జిల్లా కోసం కృషి చేద్దాం....డిఆర్ఓ మాలోల
- ఘనంగా అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా అవగాహన కార్యక్రమం..




ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని జిల్లాఎస్.పి.జగదీష్ తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక ఆర్ట్స్ కాలేజి ఎగ్జిబిషన్ మైదానంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేకదినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం మరియు విభిన్న ప్రతిభావంతుల శాఖ , ఈగల్ విభాగం సంయుక్తంగా ప్రజా చైతన్యఅవగాహనకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్.పి. జగదీష్, డిఎల్ఎస్ఎ సెక్రటరీ జడ్జి రాజశేఖర్, జిల్లారెవెన్యూ అధికారి మాలోల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభా కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా ఎస్.పి. జగదీష్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత శక్తి ముఖ్యమైనపాత్రపోషిస్తుందని అందువల్ల మాదక ద్రవ్య రహిత భారత దేశ ప్రచారంలో గరిష్ట సంఖ్యలో యువతచేరడం చాలా ప్రధానమని పేర్కొన్నారు. ముఖ్యంగా మాదకద్రవ్య దుర్వినియోగం , అక్రమ రవాణా యొక్క ఈ సవాల్ ను ఎదుర్కోవడానికి ఈరోజు మనమందరం కలిసి నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ద్వారా అన్ని వర్గాల ప్రజల్లో ఒక మంచి మార్పు రావాలనే సంకల్పంతో ప్రయత్నించడం జరుగు తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేస్తూ దురలవాట్లకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్న నేటి యువతను కాపాడుటకు తమ వంతుగా సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. నేటి యువత తమ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని అలాగే తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చే దిశగా క్రమశిక్షణ, సత్ ప్రవర్తనతో ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టుటకు ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1 9 7 2 కు ఫోన్ చేసి సమాచారం తెలపాలని, సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్. పి. భరోసా కల్పించారు. అంతేగాక మాదకద్రవ్యాల నివారణ కోసం మన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన ఈగల్ ఫోర్స్ వ్యవస్థను




ఏర్పాటు చేసినట్లు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా మాదక ద్రవ్య దుర్వినియోగం మరియు అక్రమ రవాణా పై ప్రత్యేక నిఘా చర్యలు తీసుకొని డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠాలను గుర్తించి చట్టపరమైన కఠినచర్యలుతీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నదని ఇందులో భాగంగానే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎస్.పి. తెలిపారు. డ్రగ్స్ వినియోగించిన వారికి ప్రత్యేకంగాప్రభుత్వం ద్వారా పునరావాస కేంద్రాలు కూడా ఏర్పాటు చేసి వారికి తిరిగి మంచి భవిష్యత్తు కల్పించే దిశగా చర్యలు తీసుకోవడం జరిగిందని ఎస్ . పి.తెలిపారు.ప్రతి సంవత్సరం జూన్ 26న మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు ఎస్.పి. తెలిపారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జడ్జి రాజశేఖర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం చట్టరీత్యానేరమనియువత మత్తు మాని జీవితాన్ని గెలవాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలు వినియోగించిన లేదా విక్రయించిన, నిలువ ఉంచిన రవాణా చేసిన అట్టి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత జీవితం అంధకారంలోకి వెళుతుందని అలాంటి అలవాట్లకు చెడు స్నేహితులకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని తెలిపారు. మన దేశాన్ని డ్రగ్స్ గంజాయి నుంచి విముక్తి చేసే విధంగా ప్రభుత్వాలు దృఢ సంకల్పంతో ఉన్నారని, అందువల్ల మనలో చైతన్యం రావాల్సింది అవసరం ఎంతైనా ఉందన్నారు. సమాజంలో డ్రగ్స్ అనే మహమ్మారి లేకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ సమిష్టిగాఏర్పడిమనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందనిదురావాట్లవ్యసనాలకు దూరంగా ఉండి యువత తమ జీవితాల్లో వెలుగు నింపుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా వారి పిల్లల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారిని సన్మార్గంలో ముందుకు నడిపించాలని సూచించారు.జిల్లా రెవెన్యూ అధికారి మలోలమాట్లాడుతూ డ్రగ్స్ పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగేలా సమాచారాన్ని అందరికీ తెలిసే విధంగా సమాజంలోని ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు. ముఖ్యంగా యువత ఈ మధ్యకాలంలో ఎక్కువ మంది డ్రగ్స్ బారిన పడుతున్నారని పలు సర్వేలు వెల్లడించాయని గుర్తు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గంజాయి డ్రగ్స్ రహిత జిల్లాగా, డ్రగ్స్ రహిత సమాజంగా ఉండాలన్నదే ప్రభుత్వాల ఆలోచనలని తెలిపారు. మనలో చైతన్యం రావాలని ఎన్నో కుటుంబాలు డ్రగ్స్ బారిన పడి వాళ్ళ కుటుంబమే కాకుండా ఇతరుల కుటుంబాలు కూడా డ్రగ్స్ బారిన పడుతున్నాయని తెలిపారు. డ్రగ్స్ వాడడం వలన ఆరోగ్యం కూడా క్షీణిస్తుందని, అంతేగాక డ్రగ్స్ బారిన పడిన వ్యక్తులు అనేక నేరాలకు పాల్పడుతూ చట్టప్రకారం శిక్షారులు గా ఉంటున్నారని తెలిపారు. డ్రగ్స్ మహమ్మారి యావత్ ప్రపంచాన్ని వణికిస్తోందని అందువల్ల మొక్కగా ఉన్నప్పుడే తుంచి వేసే ఉద్దేశంతో విద్యార్థిని విద్యార్థులకు యువతకు, ప్రజలకు అవగాహన కల్పించి డ్రగ్స్ బారిన పడకుండా చూడాలని ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేయడం జరుగుతున్నట్లు తెలిపారు. డ్రగ్స్ బారిన పడిన ఆయాకుటుంబాలు ఆర్థికంగా వెనుక పడడంతో పాటు కొంతమంది విద్యార్థులు తెలిసి తెలియని వయసులో డ్రగ్స్ బారిన పడి జీవితం నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. యువత సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ మంచి అలవాట్ల ను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ విద్యార్థుల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా ద్వారా కలిగే అనర్థాలపై నిర్వహించిన సామాజిక నాటిక ప్రదర్శన ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచినపలు కళాశాలల విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేసి అభినందిస్తూ ప్రోత్సహించారు. ఆ తర్వాత అవగాహన ర్యాలీ ప్రారంభమై ఆర్ట్స్ కళాశాల, క్లాక్ టవర్ మీదుగా డ్రగ్స్ నివారణపై ప్రజలను చైతన్య పరుస్తూ విద్యార్థులు ప్ల కార్డుల తో పలు నినాదాలు చేస్తూ సప్తగిరి చేరుకోగా మాదకద్రవ్యాల ద్రవ్యాల దుర్వినియోగ నివారణ పై మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఏ.ఎస్.పిలు నాగభూషణం, ఇలియాజ్, మహబూబ్ బాషా ,విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి అర్చన, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్,డి ఐ పి ఆర్ ఓ బాలకొండయ్య, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఆర్ ఐ ఓ వెంకటరమణ నాయక్, ఇన్చార్జ్ డిఇఓ శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుముదా ఆన్ సెట్ మేనేజర్ శ్రీనివాసులు, పోలీసు , ఈగల్ విభాగం, మెడికల్ ఎక్సైజ్ శాధికారులు, పలువురు రు జిల్లా అధికారులు ఉపాధ్యాయులు ఆర్ట్స్ మరియు జూనియర్ కాలేజీ, కె ఎస్ ఆర్ స్కూల్, నలంద కాలేజీ విద్యార్థిని విద్యార్థులు పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజలు తదితరులు స్వచ్ఛందంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ గా నాగేంద్ర

### -అభినందనలు తెలిపిన న్యాయవాదులు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ గా న్యాయవాది బి.నాగేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు సంబంధిత అధికారుల నుండి ఆయనకు నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, వీరయ్య, శ్రీనివాసరావు, బాలాజీ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీకి సంబంధించిన కేసుల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం నాగేంద్రను బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్, ఏపీపీ గోపాల్ కృష్ణ, టిడిపి లీగల్ సెల్ అధ్యక్షులు శివశంకర్, న్యాయవాదులు మనోహర్ రెడ్డి, ఆంజనేయులు, అశోక్ తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ గోడ పత్రికల విడుదల



ప్రజాభూమి, హిందూపురం టౌన్

కదిరి పట్టణంలో ఈనెల 28వ తేదీన జరిగే శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణ గోడపత్రికలను శుక్రవారం బలిజ సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ మేరకు విగ్రహావిష్కరణకు హాజరుకావాలని కదిరి బలిజ సంఘం నాయకులు హిందూపురం బలిజ సంఘం నాయకులను ఆహ్వానించారు. తెలుగు జాతి వైభవానికి ప్రతీకగా నిలుస్తున్న శ్రీకృష్ణదేవరాయల స్ఫూర్తిని చిరస్థాయిగా నిలిపే విగ్రహావిష్కరణకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కదిరి బలిజ సంఘం నాయకులు గవ్వల శ్రీనివాసులు, చింతకుంట రమేష్ బాబు, దృడం శ్రీనివాసులు, కుటాల నరేంద్ర, ఆవుల శంకర్, కాపునాడు హిందూపురం నియోజక వర్గ అధ్యక్షులు మహేష్ కుమార్, కాపునాడు పట్టణ అధ్యక్షులు బలిజ విశ్వనాథ్, హిందూపురం బలిజ సంఘం అధ్యక్షులు వెంకటరాముడు, శ్రీ బాలాజీ దేవాలయ అధ్యక్షులు విజయ్ గోపాల్, జనసేన నాయకులు నిమ్మకాయల రాము, మాజీ కౌన్సిలర్ నాగరాజు, తెలుగుదేశం నాయకులు రజని, ఆర్టీసీ జగదీశ్, బలిజ కల్యాణ మండపం కమిటీ సభ్యులు, బాలాజీ దేవాలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రామ్మూర్తికి ఘన సన్మానం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా జి. రామ్మూర్తి ఇటీవల నియమితులైన సందర్భంగా శుక్రవారం హిందూపురం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘన సన్మానం నిర్వహించారు. హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షులు మనోజ్ జూలియట్ (మింటూ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రామ్మూర్తిని గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ పట్ల జి.రామ్మూర్తి చూపుతున్న అంకితభావం, సేవలను గుర్తించి రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించడం ఆనందదాయకమన్నారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఆయన పార్టీ బలోపేతానికి మరింత సమర్థవంతంగా కృషి చేస్తారని, పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రామ్మూర్తి మాట్లాడుతూ, తనపై పార్టీ అధిష్ఠానం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పార్టీ అభివృద్ధి కోసం రాష్ట్ర నాయకత్వం సూచనల మేరకు నిబద్ధతతో పనిచేస్తానని తెలిపారు. పార్టీ శ్రేణులందరినీ సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వేణురెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రామ్మూర్తికి శుభాకాంక్షలు తెలిపారు.

## పుట్లూరు మండల కేంద్రంలో కిరాణా షాపులో చోరీ

### నగదు, సిగరెట్ ప్యాకీలు ఎత్తుకెళ్లిన దొంగలు.



ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండల కేంద్రంలో వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న ప్రజలు దొంగతనాలు అరికట్టడంలో పోలీసులు విఫలమవుతున్నారని ప్రజలు వాపోతున్నారు. వివిధ గ్రామాలలో వరుస చోరీలు జరుగుతూనే ఉన్నాయి తోటల వద్ద కేబుల్ వైర్లు, కిరాణా షాపులో దొంగతనాలు జరుగుతున్నాయి.మండల కేంద్రంలోని కులాయప్పకు చెందిన కిరాణా షాపులో గురువారం రాత్రి పదివేల రూపాయలకు పైన నగదు మరియు సిగరెట్ ప్యాకెట్లు చోరీకి గురయ్యాయి. కుళ్లాయప్ప షాపుకు ముందర కరెంటు పోల్ స్తంభానికి రెండు సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అవి పని చేయకపోవడంతో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ నిరుపయోగంగా మారాయి. ఇలాంటి దొంగతనాలు జరగకుండా పోలీసులు దొంగతనాలు అరికట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.



## హిందూపురంలో భూకబ్జాలు -అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు

### -పేదల నుండి 'అఫ్తా' వసూళ్లు -విలేకరుల సమావేశంలో కూటమి నేతలపై వేణురెడ్డి ధ్వజం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుల అండదండలతో భూకబ్జాలు, నకిలీ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, పేదలపై అక్రమ వసూళ్లు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత గుడ్డంపల్లి వేణు రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. శుక్రవారం హిందూపురం పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కూటమి ప్రభుత్వం, స్థానిక టిడిపి నాయకులు, అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హిందూపురంలో అధికార మార్పు తర్వాత ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం అధికార పార్టీ నాయకుల ప్రయోజనాల కోసం పనిచేస్తోందని వేణురెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ క్యాంపు కార్యాలయం నుండి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులపై తీవ్ర రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి, భూకబ్జాలకు సహకరించేలా వ్యవస్థను ఉపయోగిస్తున్నారని విమర్శించారు. దీనివల్ల నిజమైన భూయజమానులు న్యాయం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతోందన్నారు. చిలమత్తూరు మండలం చాగలేరు గ్రామ పంచాయతీ పరిధిలోని మోతకపల్లి గ్రామానికి చెందిన రైతు అశ్వర్థ నారాయణరెడ్డి కుటుంబానికి చెందిన భూమిని లక్ష్యంగా చేసుకుని నకిలీ వీలునామాలు, దొంగ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి అక్రమంగా రికార్డులు మార్చారని ఆరోపించారు. కుటుంబ సభ్యుల పేరుతో 1-బీ రికార్డులు మార్చి, అనంతరం అధికార పార్టీ నాయకుల అండతో భూమిని విక్రయించే వరకు వ్యవహారం వెళ్లిందని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ నిబంధనల మేరకు రెండు లక్షలు దాటితే నగదు రూపంలో లావాదేవీలు జరగకుండా డిడి, చెక్కుల రూపంలో లావాదేవీలు జరగాల్సి ఉందని, అయితే ఇలా చేయకుండా ఒక కోటికి పైగా నగదు రూపంలో ఎలా చెల్లించారని ప్రశ్నించారు. నగదు చెల్లించే సమయంలో సంబంధిత సబ్ రిజిస్టర్ ఆదాయ పన్ను శాఖ అధికారులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదన్నారు. బాధితులు అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ న్యాయం చేయలేదన్నారు. బాధిత కుటుంబం తమను ఆశ్రయించి న్యాయం కోరిందని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా హిందూపురం పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలు కూడా పెరిగి పోయాయని వేణురెడ్డి ఆరోపించారు. కొట్నూరు గ్రామంలో చెరువు



సమీపంలోని సుమారు రెండున్నర ఎకరాల ప్రభుత్వ భూమిని టిడిపికి చెందిన మాజీ కౌన్సిలర్ మల్లికార్జున ఆక్రమించి బోర్లు వేసి చెట్లు నాటారన్నారు. ఇందిరమ్మ కాలనీ సమీపంలో మరో టిడిపి నాయకులు తిరుమల నాయుడు ఇప్పటికే పొందిన ఇంటి స్థలంతో పాటు అదనంగా ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. కొల్లకుంట వద్ద రహదారి పక్కన ఉన్న విలువైన ప్రభుత్వ స్థలాన్ని కూడా అధికారుల సహకారంతో ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. భూకబ్జాలతో పాటు పేదల జీవనోపాధిపైనా కూటమి నాయకులు భారంగా మారారని వేణు రెడ్డి ఆరోపించారు. హిందూపురం పట్టణంలో గుజిరి ఏరుకుని జీవించే కార్మికులు, చిన్న వ్యాపారులు ఫ్యాక్టరీలకు సరుకు విక్రయించాలంటే కిలోకు రూపాయి చొప్పున "అఫ్తా" చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. డబ్బులు చెల్లించని వారి వాహనాలను అన్ని అనుమతులు ఉన్నప్పటికీ పోలీసులను అడ్డం పెట్టుకొని తనిఖీల పేరుతో వాహనాలను పోలీస్ స్టేషన్లకు తరలిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సామాన్య ప్రజలు వ్యాపారం చేసుకోవాలన్నా, తమ హక్కులను కాపాడుకోవాలన్నా అధికార పార్టీ నేతల అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి హిందూపురంలో నెలకొన్నదని వేణురెడ్డి విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తూ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న వారిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. భూకబ్జాలు, అక్రమ వసూళ్లు వెంటనే నిలిపివేయాలని, బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే బాధిత కుటుంబాలు, చిన్న వ్యాపారులు, గుజిరీ కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇదే సందర్భంగా బాధితుడు వర్షారెడ్డి తన పిత్రార్జితం సంక్రమించిన ఆస్తిని అధికారులను అడ్డం పెట్టుకొని అధికార పార్టీ నాయకులు కబ్జా చేశారని, న్యాయం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ న్యాయం జరగడం లేదన్నారు. తనకు జరిగిన అన్యాయం గురించి పార్టీ కార్యాలయంలో విలేకరులకు వివరించారు.

## దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలి

### -1950 రాష్ట్రపతి ఉత్తర్వు రద్దు చేయాలని డిమాండ్ -కేజీ బాలకృష్ణన్ కమిషన్ నివేదికపై తీవ్ర ఆందోళన

### -ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ 30వ వార్షికోత్సవంలో నాయకులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

దేశంలోని దళిత క్రైస్తవులకు రాజ్యాంగబద్ధ హక్కులు, మత స్వేచ్ఛ పూర్తిస్థాయిలో కల్పించాలని, 1950 రాష్ట్రపతి ఉత్తర్వులోని మూడవ పేరాను వెంటనే రద్దు చేయాలని ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. కేజీ బాలకృష్ణన్ కమిషన్ నివేదిక దళిత క్రైస్తవులకు వ్యతిరేకంగా ఉంటే దేశవ్యాప్తంగా మహా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. పట్టణంలోని సిఅండ్ఐజి మిషన్ చర్చి మిషన్ కాంపౌండ్‌లో శుక్రవారం ఏఐసీఎఫ్ 30వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు మాట్లాడుతూ, 1950 రాష్ట్రపతి ఉత్తర్వులోని మూడవ పేరా కారణంగా షెడ్యూల్డ్ కులాలకు చెందిన వ్యక్తులు ఇతర మతాలను స్వీకరిస్తే వారి ఎస్సీ హోదా కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్-25 ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛ కల్పించినప్పటికీ, దళితులకు మాత్రం అది





పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని విమర్శించారు. 1956లో దళిత సిక్కులకు, 1990లో దళిత బౌద్ధులకు మినహాయింపులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, దళిత క్రైస్తవులు, దళిత ముస్లింల విషయంలో మాత్రం అదే న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో రాజ్యాంగం అమలులోకి వచ్చి 76 సంవత్సరాలు గడిచినా దళితుల సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదని, కుల వివక్ష ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. ఓసీలు, బీసీలు, ఎస్టీలకు ఉన్న మత స్వేచ్ఛ ఎస్సీలకు లేకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. "మతం మారితే కులం మారదు" అనే వాస్తవాన్ని గుర్తించి, మత మార్పిడి చేసిన దళితులకు కూడా రాజ్యాంగ రక్షణ కల్పించాలని కోరారు. కేజీ బాలకృష్ణన్ కమిషన్ తన నివేదికను శాస్త్రీయ ప్రమాణాలతో రూపొందించలేదనే అనుమానాలు ఉన్నాయని నాయకులు పేర్కొన్నారు. వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా నివేదిక రూపొందితే దళిత క్రైస్తవులకు తీవ్ర అన్యాయం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ కమిషన్ నివేదిక దళిత క్రైస్తవులకు వ్యతిరేకంగా ఉంటే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఇటీవల షెడ్యూల్డ్ కులానికి చెందిన పాస్టర్ చింతాడ ఆనంద్ ఎస్సీ హోదా తొలగింపు ఘటనను ఈ సమస్యకు నిదర్శనంగా పేర్కొన్నారు. 1950 రాష్ట్రపతి ఉత్తర్వులోని మూడవ పేరాను వెంటనే రద్దు చేసి, దళిత క్రైస్తవులకు రాజ్యాంగ బద్ధ హక్కులు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐసీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ. నాగేంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ పాస్టర్ రెవరెండ్ డేవిడ్ రవికిరణ్, హిందూపురం పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ ఎన్. డేవిడ్, కార్యదర్శి రెవరెండ్ జయరాజ్, యునైటెడ్ పాస్టర్స్ అండ్ క్రిస్టియన్ లీడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ ఎస్. సూర్యప్రకాశ్, కార్యదర్శి పాల్ తిమోతి, చర్చ్ బోర్డు సభ్యులు సాల్మన్ రాజ్, దేవరాజ్, ఆంజనేయులు, ఆడిటర్లు జాన్ ప్రసాద్, డేవిడ్, రెవరెండ్ దేవరాజ్, యువజన కమిటీ సభ్యులు డానియల్, శ్యాంబాబు, సురేష్, మింటూ, మనోజ్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి నిత్వికది ముమ్మాటికీ హత్యే

- తన కూతురిని చంపిన నిందితురాలు ను ఉరితీయాలి
- బాధితులకు న్యాయం చేస్తాం.. డిఎస్పి
- బాధిత కుటుంబానికి అండగా ధర్నా చేస్తున్న ప్రజలను బెదిరిస్తున్న కానిస్టేబుల్
- పూల అంగళ్ళ వద్ద ధర్నా నిర్వహించిన బాధితులు, గ్రామస్తులు

ప్రజాభూమి,పులివెందుల





ఇరుగు, పొరుగుల మధ్య తగాదతో అభం శుభం తెలియని 4 ఏళ్ల చిన్నారిని ఒక మహిళ హత్య చేసినట్లు పోలీసులు విచారణ లో నిర్ధారించారు . లింగాల మండలం లోపట్నూతల గ్రామానికి చెందిన రామాచారి,వెంకట రామిరెడ్డి ల మధ్య గత సంవత్సర నుంచి చిన్నచిన్న తగాదాలుండేవి. గతంలో రామాచారి 2 ద్విచక్ర వాహనాలను వెంకటరామిరెడ్డి భార్య సాత్విక తో కలిసి తగలబెట్టినట్లు గతంలో రామాచారి పోలీసులు ఫిర్యాదు చేశారు. ప్రతిసారి ఘర్షణ పడుతుండడం తో వారి ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అప్పట్లో లింగాల ఎస్సై జగదీశ్వర్ రెడ్డి ఆదేశించడంతో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు.అయితే గురువారం రామాచారి,సుజనల కుమార్తె నిత్విక (4) డ్రమ్ములోని నీటిలో వడి మృతి అనుమానస్పద స్థితిలో మృతి చెందడంతో రామాచారి వెంకటరామిరెడ్డి పై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోవడంలేదని గ్రామస్తుల సహాయంతో పులివెందుల పార్నపల్లె రింగ్ రోడ్డు వద్ద గురువారం రాత్రి ధర్నా నిర్వహించారు. ఈ సమాచారం తెలుసుకున్న డీఎస్పీ మురళి నాయక్, రూరల్ సీఐ శాంతి లాల్,ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి లు వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి విచారణ వేగవంతం చేశారు. చిన్నారి హత్య మృతి పై వేగవంతంగా దర్యాప్తు చేపట్టారు. లోపట్నూతల గ్రామానికి చేరుకొని సంఘటనా స్థలాన్ని పరిశీలించి సిసి కెమెరాల ఆధారంగా రాత్రి కి రాత్రే వెంకటరామిరెడ్డి భార్య స్వాతిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. రామాచారి కుమార్తె నిత్వికను నీటి డ్రమ్ములో ముంచి హత్య చేసినట్లు తేలడంతో స్వాతిని అరెస్టు చేసి ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు.

**తమ కూతురును చంపిన నిందితురాలని ఉరితీయాలి**

తమ కూతురు నిత్వికను చంపిన నిందితురాలను ఉరితీయాలి అని రామాచారి, సృజనా దంపతులు డిమాండ్ చేశారు. చిన్నారి హత్య కేసులో పోలీసులు జాప్యం చేస్తున్నారని, తమకు పూర్తి సమాచారం ఇవ్వలేదని స్థానిక పూలంగళ్ళ సర్కిల్లో బాధితులు, గ్రామస్తులు ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో తమ ద్విచక్ర వాహనాలను తగలబెట్టి దాదాపు 3 లక్షల రూపాయలు నష్టం చేశారని తమ భర్తపై అక్రమ కేసు బనాయించి పోలీసుల సహాయంతో కొట్టించారని వారు ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ మురళి నాయక్, లింగాల ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి, పులివెందుల ఎస్సై తిమోతిలు సంఘటనా స్థలానికి చేరుకొని చిన్నారిని హత్య చేసిన నిందితురాలు పై హత్య కేసు నమోదు చేశామని ఎఫ్ఐఆర్ ప్రతిని అందజేస్తామని తెలపడంతో ధర్నాను విరమించారు అనంతరం డిఎస్పీ కార్యాలయంలో ఎఫ్ఐఆర్ ప్రతిని బాధిత కుటుంబానికి అందజేశారు.

**బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం.. డి. ఎస్. పి**

లింగాల మండలం లోపట్నూతల గ్రామానికి చెందిన సృజన, రామాచారి దంపతుల కుమార్తె నిత్విక హత్య కేసులో నిస్పాక్షికంగా దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేస్తామని డిఎస్పి హామీ ఇచ్చారు. గతంలో రామాచారి వెంకట్రామిరెడ్డి ల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకోవడంతో వారిపై బైండోవర్ కేసు కూడా నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్, సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టి నిత్విక మృతికి కారణమైన నిందితురాలును కోర్టు ముందు హాజరు పెడతామని ఆయన తెలిపారు.

**కానిస్టేబుల్ తమను బెదిరించారని గ్రామస్తుల ఆరోపణ**

బాధితుల అండగా నిలిచిన గ్రామస్తులపై కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించాడని గ్రామస్తులు ఆరోపించారు. నిత్విక హత్య కేసులో తమకు న్యాయం చేయాలని గురువారం రాత్రి పార్నపల్లె రోడ్డులో ధర్నా నిర్వహిస్తున్న తమపై లింగాల మండలానికి చెందిన ఒక కానిస్టేబుల్ ధర్నా చేస్తున వీడియోలు తమ దగ్గర ఉన్నాయన, మీరు ఎలా తిరుగుతారో చూస్తానని బెదిరించారని ఆయనపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# చిన్నారి విషయంలో రాజకీయాలకు తావులేదు

### -నిత్విక మృతి కేసులో దోషులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవు -మారెడ్డి లతారెడ్డి, మారెడ్డి జోగిరెడ్డి

ప్రజాభూమి,లింగాల



లింగాల మండలం లోపట్నూతల గ్రామానికి చెందిన సృజన, రామాచారి దంపతుల కుమార్తె నిత్విక (4) నీళ్ల డ్రమ్లో మృతిచెందిన ఘటన నేపథ్యంలో శుక్రవారం పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి, తుంగభద్ర ప్రాజెక్టు హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, లింగాల మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి అజ్జుగుట్టు రవితేజ రెడ్డి కూటమి నాయకులతో కలిసి ఆసుపత్రికి చేరుకొని బాధిత తల్లిదండ్రులు సృజన, రామాచారిని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నా రు.ఈ సందర్భంగా మారెడ్డి జోగిరెడ్డి,లతారెడ్డి లు మాట్లాడుతూ రాజకీయాలకు తావు లేకుండాఈ కేసులో పోలీసులు వేగంగా స్పందించి దర్యాప్తును ముమ్మరం చేశారని,అనుమానితులను అదుపులో కి తీసుకుని విచారిస్తున్నారని తెలిపారు. విచారణ లో ఎవరైనా దోషులుగా తేలితే వారు ఎంతటి వారైనా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. చిన్నారుల విషయంలో రాజకీయా లకు తావు లేదన్నారు. బాధిత కుటుంబానికి తప్పకుండా న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని వారన్నారు. దర్యాప్తు పూర్తయ్యాక బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు పోలీసులు తీసుకోవడం జరుగుతుందని వారు తెలిపారు.

# హిందూ సామ్రాజ్య దినోత్సవ వేడుకలు నిర్వహణ

### -శివాజీ చరిత్రను, హిందూ సామ్రాజ్య నిర్మాణంలో వీరుల సేవలను వివరించిన వక్తలు



ప్రజాభూమి, సిద్దవటం: మండలంలోని మాధవరం-1 గ్రామంలో హిందూ సామ్రాజ్య దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ భద్రావతి భావనారాయణ సమేత సీతారాముల ఆలయంలో హిందూ బంధువులు సమావేశమై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వక్త లక్ష్మీ నారాయణ రెడ్డి, ఖండ కార్యవాహక్ పి. వేణుగోపాల రాజు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు ఛత్రపతి శివాజీ మహారాజ్ చరిత్రను, హిందూ సామ్రాజ్య స్థాపనకు ఆయన చేసిన కృషిని వివరించారు. అలాగే హిందూ ధర్మ పరిరక్షణ కోసం పాటుపడిన మహనీయుల సేవలు, వారి త్యాగాలను గుర్తు చేశారు. ప్రస్తుత తరానికి హిందుత్వ విలువలు, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. యువత, ముఖ్యంగా ఆడపిల్లలు పలు సామాజిక అంశాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా మత మార్పిడులకు పాల్పడితే వాటిని అడ్డుకునేందుకు ప్రజలు చైతన్యంతో వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవా ప్రముఖ్ గంగాధర్, సుబ్బారెడ్డి, రమణారెడ్డి తదితర స్వయం సేవకులు పాల్గొన్నారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా కొనసాగింది.

# వృద్ధాశ్రమంలో ఘనంగా కర్నాటి వెంకటరెడ్డి 48 వ జన్మదిన వేడుకలు

### - అభిమానుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు
### - వృద్ధులకు అన్నదానం, స్వీట్ల పంపిణీ

ప్రజాభూమి పోరుమామిళ్ల :



వైఎస్ఆర్ కడప జిల్లా పోరుమామిళ్ల మండల బాలమ్మ సత్రంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమంహో సేవా దృక్పథంతో జరిగింది. రాజకీయ నాయకుడు కర్నాటి వెంకటరెడ్డి 48వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని, స్థానిక బాలమ్మ సత్రం వద్ద ఉన్న వృద్ధుల మధ్య పుట్టినరోజు సంబరాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. సమాజంలో నిరాదరణకు గురవుతున్న వృద్ధులకు అండగా నిలవాలనే సత్సంకల్పంతో,ఎలాంటి ఆడంబరాలకు పోకుండా ఈ సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఆశ్రమంలోని వృద్ధుల ఆశీస్సుల నడుమ కర్నాటి వెంకటరెడ్డి సతీమణి కడప జిల్లా తెలుగుదేశం మాజీ పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు కర్నాటి శ్వేతారెడ్డి జన్మదిన కేక్ కట్ చేశారు. అనంతరం అక్కడి వృద్ధులందరికీ భోజనాలు, స్వీట్లను స్వహస్తాలతో పంపిణీ చేశారు. తమ పుట్టినరోజున ఇలాంటి మానవీయ కార్యక్రమాన్ని చేపట్టడం పట్ల స్థానికులు,వృద్ధులు ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ,దీవెనలు అందజేశారు.ఈ సేవా కార్యక్రమం దేవినేని సుబ్బారెడ్డి, ఎంబడి సుధాకర్, పసుపులేటి సాయి ఆధ్వర్యంలో,వారి పర్యవేక్షణలో విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. పుట్టినరోజు వేడుకలను వృద్ధుల మధ్య జరుపుకుంటూ సమాజ సేవకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు బిజెపి నాయకులు మనోహర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు, కార్యకర్తలు తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంలో, చురుగ్గా పాల్గొంటున్న మైనార్టీ నాయకుడు నవాబ్



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట. రేణిగుంటలో ఓటర్ జాబితా, సవరణపై, సచివాలయం సిబ్బందితో కలిసి, టిడిపి నాయకులు అవగాహన కార్యక్రమం చేపట్టారు, అందులో భాగంగా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా చేపడు తున్న ప్రత్యేక సమగ్ర సర్వే,ఓటరు జాబితా సవరణ (ఎన్,ఐ,ఆర్) మరియు మ్యాపింగ్ ప్రక్రియపై రేణిగుంట పరిధిలోని, బిస్మిల్లా లో మైనార్టీ నాయకుడు నవాబ్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి, ఓటు హక్కు , మార్పులు, చేర్పులు, గురించి తెలియజేశారు, అనంతరం నవాబ్ మాట్లాడుతూ, సచివాలయం సిబ్బందితో, కలిసి, ప్రజలకు ఓటర్ జాబితా (ఎస్ ,ఐ ,ఆర్)., ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాది అని, అందులో ప్రతి అర్హుడి పేరు తప్పనిసరిగా నమోదు కావాలని, అనర్హుల పేర్లు తొలగించబడేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రాబోయే రోజుల్లో ఇంటింటి సర్వే ప్రారంభమవుతుందని, ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని, ఓటు హక్కు ఉన్న,ప్రతి ఓటరు జాబితాలో కొత్తగా పేర్లు చేర్చడం, చిరునామా మార్పులు, పేరు సవరణలు, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఒక్కరూ ఓటు హక్కును , వినియోగించు కొనేందుకు,శ్రద్ధ వహించాలని. కోరారు. ఈ కార్యక్రమంలో , అంబికా పతి యాదవ్, గౌస్, ఏనుమలై రెడ్డి, సచివాలయ సిబ్బంది, బిస్మిల్లా నగర్ ప్రజలు పాల్గొన్నారు.

# బాదుల్లా స్వామి పీర్లను దర్శించుకున్న సీఐ శ్రీరామ్

### -సీఐ శ్రీరామ్ కు ఘనస్వాగతం పలికిన గ్రామ ప్రజలు



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బసిరెడ్డి పల్లె గ్రామంలో బాదుల్లా స్వామి పీర్ల పండగను అంగరంగ వైభవంగా గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ పీర్ల పండగ మహోత్సవ కార్యక్రమానికి లక్ష్మీనారాయణ రెడ్డి, దస్తగిరి వల్లి ల పిలుపుమేరకు పులివెందుల అర్బన్ సీఐ శ్రీరామ్ బసిరెడ్డి పల్లె గ్రామానికి చేరుకుని బాదుల్లా స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ముజావర్లు ఆయనకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామికి సదింపులు చేసిన చక్కర ను ఆయన అందజేశారు.అంతకు ముందు గా లక్ష్మీనారాయణ రెడ్డి, దస్తగిరి వలి లు దుశాల్వాతో పూలహారంతో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీరామ్ మాట్లాడుతూ పీర్ల పండుగను గ్రామ ప్రజలు అందరూ కలిసి ఉత్సాహంగా జరుపుకోవాలని అన్నారు. ఎలాంటి కొట్లాటలకు తావు ఇవ్వకుండా చూడాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారాన్ని ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమాలలో భరత్ నాయుడు జన్మదిన వేడుకలు..

### - విద్యార్థులకు అల్పాహారం, వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాభూమి, సిద్ధవటం:



మండలంలోని మాధవరం-1 గ్రామంలోని మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థకు చెందిన సభ్యుడు తల్లపనేని భాను ప్రకాష్ తనయుడు భరత్ నాయుడు జన్మదినం సందర్భంగా సంస్థ ఆధ్వర్యం లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిం చారు. కడప నగరంలోని సుభాష్ చంద్రబోస్ ఆవాసీయ విద్యాలయంలో ఉన్న 120 మంది పిల్లలకు అల్పాహారం ఏర్పాటు చేశారు. అలాగే పోరుమామిళ్ల సమీపంలోని వివేకానంద సేవాశ్రమంలోని వృద్ధులకు మధ్యాహ్న అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్ మాట్లాడుతూ భరత్ నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. భరత్ మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకుంటూ సమాజ సేవలో ముందుండాలని ఆకాంక్షించారు. మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన టీడీపీ నేతలు



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని భాకరాపేట గ్రామంలో జరిగిన వివాహ వేడుకల్లో నూతన దంపతులు నాగరాజు నాయుడు, లోకేశ్వరిని టీడీపీ నేతలు ముత్యాల తలంబ్రాలతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా దంపతులకు అష్ట ఐశ్వర్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దూదేకుల సంక్షేమ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ వీరభద్రులు, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు దశరథ నాయుడు, నిత్య పూజ కోన చైర్మన్ రాజేంద్రప్రసాద్, మాజీ మార్కెట్ చైర్మన్ మల్లు సంజీవరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ బాలిరెడ్డి, టీడీపీ సీనియర్ నేత రామచంద్రయ్య, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చెంచయ్య నాయుడు, యువనేత తుర్ర ప్రతాప్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ఇరుగులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మూలపల్లి క్రాస్ సమీపంలో వెలసిన గ్రామ దేవత శ్రీ ఇరుగులమ్మ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్ధవటం గ్రామానికి చెందిన గట్టుపల్లి వెంకటసుబ్బయ్య, పద్మజ దంపతుల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన నిర్వహించి పసుపు, కుంకుమలతో అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు అమ్మవారి అనుగ్రహం లభిస్తుందని, వ్యాపార, ఉద్యోగ, ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గట్టుపల్లి శ్రీనివాసులు, మౌనిక, రవితేజ, చైతన్య, జయకిషోర్, సాయి స్వరూప్ తదితర భక్తులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలు వద్దు.. బంగారు భవిష్యత్తు ముద్దు

### - డ్రగ్స్ వాడకం ప్రాణాలకు ముప్పు
### - కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె



డ్రగ్స్ వాడకం ప్రాణాలకు ముప్పుగా మారుతుందని, మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని ప్రజలకు, ముఖ్యంగా యువతకు రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వేంపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ.. 1987 డిసెంబర్ 7న ఐక్యరాజ్యసమితి జూన్ 26ను ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంగా ప్రకటించిందని, 1988 నుంచి ఈ రోజును ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. మాదకద్రవ్యాల రహిత ప్రపంచాన్ని ఏర్పాటు చేయడమే దీని లక్ష్యమన్నారు. దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉంటుందని, అలాంటి యువత మాదకద్రవ్యాలకు బానిసలవడం ఆందోళనకరమన్నారు. హెరాయిన్, కొకైన్, గంజాయి తదితర మాదకద్రవ్యాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. డ్రగ్స్ వినియోగం వల్ల రోగనిరోధక శక్తి, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత తగ్గిపోవడంతో పాటు కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, చదువు, ఉద్యోగాలకు దూరం కావడం వంటి అనేక దుష్పరిణామాలు ఎదురవుతాయని అన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై యువత, విద్యార్థుల్లో అవగాహన కల్పించడం ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వాలు మాదకద్రవ్యాల సాగు, తయారీ, పంపిణీ, అమ్మకం, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుని నిర్మూలించాలని తులసి రెడ్డి కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షుడు కదిరి ప్రసాద్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లెం విజయభాస్కర్ పాల్గొన్నారు.

# చిన్నారిని రిత్వికనుచంపిన వారిని కఠినంగా శిక్షించాలి -విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధి మాధవాచారి

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం రామాచారి, సృజన కుమార్తె నాలుగు సంవత్సరా ల రితికను స్వాతి అనే మహిళ నీటి డ్రమ్ములో ముంచి చంపడం చాలా బాధాకరమని , ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధి మాధవాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్పర్సన్ కమ్మరి పార్వతమ్మ శనివారం ఉదయం9 గంటలకు లోపట్నూతల గ్రామం రానున్నట్లు ఆయన తెలిపారు. నాగవేటి రామాచారి, సృజన కుటుంబ సభ్యులను పరామర్శించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం రిత్వికకు నివాళులు అర్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కావున రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్స్ , రాష్ట్ర సంఘ నాయకులు, జిల్లా సంఘ నాయకు లు, నియోజకవర్గ సంఘ నాయకులు, సోదరీమ ణులు అందరం కలిసి వారి కుటుంబానికి అండగా నిలుద్దాం మనోధైర్యాన్ని కల్పిద్దాం అని ఆయన అన్నారు. ఇలాంటి పరిస్థితులలో వారికి మనందరం చేయి చేయి కలుపుదాం మన కమ్యూనిటీకి అండగా నిలబడదాం అని ఆయన పిలుపునిచ్చారు. కావున సంఘ నాయకులు అందరూ తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 8
శనివారం 27 జూన్ 2026

# వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లో నెరవేరిన భక్తుల చిరకాల కోరిక.



ప్రజా భూమి ప్రతినిధి తిరుమల

కలియుగ వైకుంఠమైన తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వచ్చే లక్షలాది మంది భక్తులకు మరింత మెరుగైన, సత్వర వైద్య సేవలు అందించేలా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఒక కీలకమైన అడుగు వేసింది.వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2లో నూతనంగా ఆధునీకరించిన డిస్పెన్సరీని అధికారులు గురువారం నాడు ప్రారంభించారు. క్యూ లైన్లలో నిరీక్షించే భక్తులకు అత్యవసర వైద్య సేవలను మరింత వేగవంతంగా అందించాలనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని అత్యాధుని క వసతులతో పునర్నిర్మించారు. శ్రీవారి దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు క్యూ కాంప్లెక్స్‌లలో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. అటువంటి సమయంలో వాతావరణ మార్పుల వల్ల కానీ, అలసట వల్ల కానీ ఎవరైనా అకస్మాత్తుగా అనారోగ్యానికి గురైతే వెంటనే స్పందించేందుకు ఈ కేంద్రం సహాయపడుతుంది. ఈ ఆధునిక డిస్పెన్సరీలో తక్షణ నిర్ధారణ కోసం ఈసీజీ యంత్రాల సదుపాయంతో పాటు, ఆక్సిజన్ సపోర్ట్ సిస్టమ్స్, ఇతర అత్యవసర వైద్య పరికరాలను అందుబాటులో ఉంచారు. భక్తుల సేవల కోసం ఈ నూతన ఆసుపత్రి విభాగంలో ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకున్నారు. ఇక్కడ నిరంతరం సేవలందించేందుకు నలుగురు అనుభవజ్ఞులైన వైద్యులను, 16 మంది పారామెడికల్ సిబ్బందిని నియమించారు. వీరు షిఫ్టుల వారీగా రోజుకు 24 గంటల పాటు భక్తులకు అందుబాటులో ఉంటారు. ప్రాథమిక చికిత్సతో నయం కాని తీవ్రమైన కేసుల కోసం, రోగులను వెంటనే తిరుమలలోని ప్రధాన అశ్విని ఆసుపత్రికి తరలించేందుకు వీలుగా ప్రత్యేకంగా ఒక అంబులెన్స్ సేవను కూడా 24 గంటల పాటు సిద్ధంగా ఉంచారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కుసుమకుమారి, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుహార్ లత, అశ్విని హస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ పద్మజ సహా ఇతర పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ పరిధిలో ఈ డిస్పెన్సరీని ఆధునీకరించడం వల్ల అత్యవసర సమయాల్లో వైద్యం కోసం దూరం వెళ్లాల్సిన అవసరం లేకుండా త్వరితగతిన చికిత్స అందించవచ్చని తెలిపారు. శ్రీవారి భక్తులకు ప్రాణ రక్షణ కవచం.సాధారణంగా వైకుంఠం క్యూ కాంప్లెక్సులలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు గాలి సరిపోకపోవడం లేదా రక్తపోటు హెచ్చుతగ్గుల వల్ల వృద్ధులు మరియు చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. గుండె సంబంధిత రుగ్మతలు ఉన్నవారికి ఇలాంటి ఇరుకైన ప్రదేశాలలో వైద్య సేవలు అత్యంత కీలకంగా మారుతాయి. అందుకే, గుండెపోటు వంటి సంకేతాలు ఉన్నవారికి వెంటనే ఈసీజీ తీయడం, అవసరమైతే ఆక్సిజన్ అందించడం లాంటి ప్రాథమిక చికిత్సలు ఇక్కడే వేగంగా చేయడం ద్వారా అమూల్యమైన ప్రాణాలను కాపాడే వీలుంటుంది. తిరుమల యాత్రను సుఖమయం మరియు సురక్షితం చేయడానికి టీటీడీ యాజమాన్యం నిరంతరం తగిన జాగ్రత్తలు తీసుకుంటుంది. భక్తులు ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకునేలా వైద్య సదుపాయాలను మెరుగుపరచడం ఎంతో ప్రశంసనీయం. ఈ క్రమంలోనే క్యూ కాంప్లెక్స్ పరిసరాల్లోనే అత్యాధునిక ఆసుపత్రి విభాగాన్ని నెలకొల్పడం స్థానిక భక్తులతో పాటు దేశవ్యాప్తంగా వచ్చే యాత్రికులకు పెద్ద ఉపశమనంగా మారుతుందని చెప్పవచ్చు.

## తొండమనాడు వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన విదేశీ పర్యాటకులు



ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం తొండమనాడులోని పురాతన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని విదేశీ పర్యాటకులు సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు.చైనాకు చెందిన మిస్టర్ చెన్, మిస్టర్ లు, కెన్యాకు చెందిన అశోక్ రెడ్డి ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ విశిష్టత, చారిత్రక ప్రాధాన్యం గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విదేశీ పర్యాటకులు మాట్లాడుతూ భారతదేశ ఆధ్యాత్మిక సంస్కృతి తమను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు. ఆలయంలో నెలకొన్న ప్రశాంత వాతావరణం తమకు మానసిక ప్రశాంతతను అందించిందని, ఇలాంటి ఆధ్యాత్మిక క్షేత్రాలను సందర్శించడం గొప్ప అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజులకండ్రిగ గ్రామానికి చెందిన మణిరాజు, కిషోర్‌లు విదేశీ అతిథులకు ఆలయ తీర్థప్రసాదాలు అందజేసి స్వాగతం పలికారు.విదేశీ పర్యాటకుల ఆలయ సందర్శన స్థానిక భక్తుల్లో ఆనందాన్ని కలిగించింది.

## పైపైన మరమ్మతులు.. పెను ప్రమాదానికి అధికారులే కారణమా?



ప్రజా భూమి ప్రతినిధి సులూరుపేట

సూళ్లూరుపేట మండలం నాదెండ్లవారి కండ్రిగ గ్రామంలో కాళంగి నదికి వెళ్లే కల్వర్ట్ వద్ద ఉన్న పాత లాకు గేట్లు పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతాయోనన్న భయాందోళన నెలకొంది.



దాదాపు 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ గేట్లు గోడలు పగుళ్లతో బలహీనపడినా, వాటిని పూర్తిగా పునర్నిర్మించకుండా పైపైన సిమెంట్ పూత వేసి వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. భారీ వర్షాలు, అధిక నీటి ప్రవాహం సమయంలో ఈ నిర్మాణం కూలిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తుగా శాశ్వత చర్యలు తీసుకుని కొత్త లాకు గేట్లు నిర్మించాలని స్థానికులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యం కొనసాగితే ప్రజలకు, సాగునీటి వ్యవస్థకు తీవ్ర నష్టం తప్పదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు - ఎమ్మెల్యే పులివర్తి నాని గారి విజ్ఞప్తి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్

గత కొద్ది రోజులుగా 9121628604 సెల్ నెంబర్ నుండి నిరుద్యోగులకు ఫోన్లు చేసి నాని పర్సనల్ అసిస్టెంట్ అని చెప్పి, ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి వారి వద్ద నుండి నిరుద్యోగులకు సంబంధించిన సర్టిఫికెట్లు, డబ్బులు తీసుకుంటున్నట్లు మాకు ఇప్పుడే సమాచారం అందింది. ఇప్పటికే సంబంధిత వ్యక్తి పై పోలీసులకు ఫిర్యాదు చేసాము. అజ్ఞాత వ్యక్తి ఎవరో తెలియదు అటువంటి వారిని మీరు దయచేసి నమ్మకండి. ఎవరికైనా ఇక పై ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే ఎమ్మెల్యే కార్యాలయానికి తెలియజేయవలసినదిగా కోరడమైనది.

## మహాత్మా జ్యోతిరావ్ పూలే సంగీత నృత్య నాటకం



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

బి.సి. సంఘర్షణ సమితి మరియు సింధూర కల్చరల్ అసోసియేషన్ (ఒంగోలు) వారి ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావ్ పూలే జీవిత పోరాటంపై జరుగుతున్న అద్భుతమైన సంగీత నృత్య నాటకానికి ముత్యాలరెడ్డి పల్లి బృంద సభ్యులందరినీ సాదరంగా ఆహ్వానిస్తున్నాము. 40 మంది కళాకారులతో ప్రదర్శించబడే ఈ దృశ్యకావ్యాన్ని తిలకించడానికి అందరూ తప్పక విచ్చేయగలరు.
కార్యక్రమ వివరాలు : వేదిక ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియం, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయము, తిరుపతి. తేదీ: జూలై 5, 2026 సమయం,సాయంత్రం 6:30 గంటలకు.దయచేసి అందరూ పాల్గొని ఈ ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరుకుంటున్నాము

## తిరుపతి కళాకారులకు పుట్టినిల్లు: నవీన్ కుమార్ రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో "రాయలసీమ రంగస్థలి" ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న "శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్" నృత్య పోటీలను బీజేపీ నేత నవీన్ కుమార్ రెడ్డి శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో మహతి ఆడిటోరియంలో ఆధ్యాత్మిక, పౌరాణిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేస్తున్న రాయలసీమ రంగస్థలి నిర్వాహకులను అభినందించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన చిన్నారులు అద్భుత నృత్య ప్రదర్శనలతో కళాభిమానులను ఆకట్టుకుంటున్నారని పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారి ఆశీస్సులతో చిన్నారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలకు టీటీడీ ఉన్నతాధికారులు, ధర్మకర్తల మండలి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మూడు రోజుల పాటు జరిగే శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్‌లో నగర ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కళాకారులను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి వ్యవస్థాపక కార్యదర్శి కే.ఎన్. రాజా, చైర్మన్ గుండాల గోపీనాథ్, గౌరవ కార్యదర్శి కస్పా పద్మనాభం, డాక్టర్ సోము ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.







# తిరుమలలో అత్యాధునిక ల్యాబ్ రెడీ.. జస్ట్ 48 గంటల్లోనే రిపోర్ట్, ఏ తప్పు జరిగినా తెలిసిపోతుంది.



ప్రజా భూమి ప్రతినిధి తిరుమల

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ఫుడ్ అండ్ వాటర్ అనాలిసిస్ ల్యాబ్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చింది. ఇకపై తిరుమల శ్రీవారి భక్తులకు అందించే అన్నప్రసాదాలు, తాగునీరు సురక్షితంగా, నాణ్యతతో ఉంటాయి. తిరుమలలో స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీ, టీటీడీలు కలిసి ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్ఎస్ఏఐ (భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ) ల్యాబ్ అందుబాటులోకి తీసుకొచ్చారు. తిరుమలలోని ల్యాబ్‌ను టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి సందర్శించి, తొలి అనాలిసిస్ రిపోర్ట్‌ను పరిశీలించారు. శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తుల ఆరోగ్య భద్రతకు టీటీడీ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు వెంకయ్య చౌదరి.ఈ ఏడాది మార్చి 21న ముఖ్యమంత్రి చంద్రబాబు ఫుడ్ అండ్ వాటర్ అనాలిసిస్ ల్యాబ్ ప్రారంభించారని.. అయితే రెండున్నర నెలల్లోనే అన్ని ప్రమాణాలను పూర్తి చేసి, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీ) మేరకు పరీక్షలు నిర్వహించి తొలి రిపోర్ట్ సిద్ధమైందన్నారు టీటీడీ అడిషనల్ ఈవో. ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌లో 50కి పైగా అత్యాధునిక పరికరాలు ఉన్నాయని.. 30 మంది సైంటిస్టులు, సాంకేతిక నిపుణులు, ల్యాబ్ టెక్నీషియన్లు సేవలందిస్తున్నారన్నారు. త్వరలో ప్రభుత్వ అనుమతి మేరకు 20 మంది శాశ్వత ఉద్యోగులను నియమిస్తామన్నారు. గతంలో తాగునీటిని పరీక్షల నివేదిక రావడానికి 10-15 రోజులు పట్టేదని.. ప్రస్తుతం తాగునీటిలో బ్యాక్టీరియాపై ప్రాథమిక నివేదిక 48 గంటల్లోనే వస్తుందన్నారు. సమగ్ర నివేదిక ఏడు రోజుల్లో అందుబాటులోకి వస్తుందంటున్నారు.'ప్రతిరోజూ తిరుమలలోని వివిధ వంటశాలలు, అన్నప్రసాద కేంద్రాలు, ఫుడ్ కౌంటర్లు, హోటళ్లు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, మార్కెటింగ్ విభాగంలోని ముడి సరుకుల నుంచి సుమారు 40 ఆహార నమూనాలు, అలాగే జలప్రసాదం, వాటర్ లైన్ల నుంచి 20 నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహిస్తాము. ఇంతకుముందు నీటి నమూనాల పరీక్షల కోసం ఇతర ప్రాంతాలకు పంపించాల్సి వచ్చేది.. ప్రస్తుతం తిరుమలలోనే ఏర్పాటు చేసిన మైక్రోబయాలజీ ల్యాబ్ ద్వారా వేగవంతంగా, ఖచ్చితమైన ఫలితాలు పొందుతున్నాము' అన్నారు.

### తిరుచానూరు వార్షిక తెప్పోత్సవాలు

తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ వార్షిక తెప్పోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ కృష్ణస్వామివారు పద్మసరోవరంలోని సుందరంగా అలంకరించిన తెప్పపై మూడు ప్రదక్షిణలు చేస్తూ భక్తులకు దివ్య మంగళ దర్శనం ప్రసాదించారు. ఉదయం సుప్రభాతంతో ప్రారంభమైన నిత్యకైంకర్యాల అనంతరం మధ్యాహ్నం శ్రీ కృష్ణస్వామివారి ముఖ మండపంలో స్వామివారికి విశేష అభిషేకం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, సుగంధ ద్రవ్యాలతో నిర్వహించిన ఈ పవిత్ర అభిషేకం భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తింది.సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేశారు. అనంతరం సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.15 గంటల వరకు జరిగిన తెప్పోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పద్మసరోవరంలో విద్యుద్దీపాల వెలుగుల్లో సాగిన ఈ దివ్య విహారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. తెప్పోత్సవం అనంతరం శ్రీ కృష్ణస్వామివారు ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగి భక్తులను కరుణాకటాక్షాలతో అనుగ్రహించారు. తెప్పోత్సవాలలో భాగంగా ఆలయ నాలుగు మాడవీధుల్లో నిర్వహించిన భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గోవింద నామస్మరణలతో పాటు సాగిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉత్సవాలకు మరింత శోభను చేకూర్చాయి.

## చిన్నశేష వాహనంపై వేణుగోపాలస్వామి అలంకారంలో భక్తులను కటాక్షించిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి

ప్రజా భూమి ప్రతినిధి, వడమాల పేట

తిరుమల తిరుపతి అనుబంధ ఆలయమైన అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం ఉదయం స్వామివారు ఐదు తలల చిన్నశేష వాహనంపై వేణుగోపాలస్వామి అలంకారంలో దివ్య మంగళ దర్శనం ప్రసాదించి భక్తులను అనుగ్రహించారు.



పంచభూతాలకు ప్రతీకగా చిన్నశేష వాహనం



చిన్నశేష వాహనం శ్రీవారి వ్యక్తరూపమైన పంచభౌతిక ప్రకృతికి ప్రతీకగా భావిస్తారు. పంచశిరస్సులతో కూడిన చిన్నశేషునిపై స్వామివారిని దర్శించడం ద్వారా భక్తులకు సర్వశుభాలు, ఐశ్వర్యం, ఆధ్యాత్మిక పురోగతి కలుగుతాయని ఆగమ, పురాణాలు పేర్కొంటున్నాయి.ఈ వాహనసేవలో ఆలయ ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణ, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

## రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

గురువారం మధ్యాహ్న సమయంలో రేణిగుంట పట్టణం, ఖాదర్ బాషా సర్కిల్ వద్ద సుమారు 45 నుండి 50 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి స్పృహ తప్పి పడి ఉండగా, స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం, తిరుపతి ప్రభుత్వ రుయా ఆసుపత్రి,కి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారంరోజు (26-06-2026) గుర్తుతెలియని,వ్యక్తి మృతి చెందాడు. మృతుని వయస్సు,సుమారు 45--50 సంవత్సరాలు ఎత్తు: సుమారు 5 అడుగులు 4 అంగుళాలుశరీరాకృతి, సన్నగా చర్మవర్ణం, చామన చాయ, జుట్టు, నల్లగా, కొంత బట్టతల మీసం, గడ్డం: నెరిసిన మీసం మరియు చిన్న గడ్డందుస్తులు,లేత రంగు గీతలతో కూడిన పూర్తి చేతుల షర్టు ధరించి ఉన్నాడు. ఈ వ్యక్తి వివరాలు తెలిసిన వారు లేదా ఇతని బంధువులు ఎవరైనా ఉన్నట్లయితే, వెంటనే రేణిగుంట పోలీస్ స్టేషన్ ను సంప్రదించి సమాచారం,అందించవలసిందిగా కోరారు.

## విద్యుత్ అధికారుల వల్ల రైతుల భూమలన్నీ బీడు

### సిపిఐ మించల శివ కుమార్ డిమాండ్



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి రూరల్

మండలంలో ఉండు వేలవేడు పంచాయతీ లోయుండు గంగలపూడి గ్రామంలో చిన్న సన్న కారు రైతులు బడా బాబు పెట్టుకున్న తగిలం చెట్లు పై పోతున్న విద్యుత్తు లైన్లో వల్ల బడా బాబు నష్టపోతారని సామాన్య మధ్యతరగతి కుటుంబాలు రైతులు పంట పెట్టుకొని విధంగా ట్రాన్స్ఫార్మర్లు నుండి విద్యుత్తు సర్ప సరఫరా చేయలేదని సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మించల శివకుమార్ సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ఉన్నది పేదలక బడా బాబులక ఒక్క బడా బాబు నుంచి సుమారు 30 కుటుంబాల రైతులు మంటలు పెట్టుకునే భూములన్ని బీడు భూములుగా మారిందని మండిపడ్డారు సంబంధిత అధికారులు వల్ల గ్రామస్తులందరూ పస్తులతో చేసిన అప్పులతో బాధపడుతుంటే బడా బాబులకే కొమ్ము కాస్తున్నారని తప్ప ఇతరుల రైతుల సమస్యలను పట్టించుకోలేదని ఇది ఎంతవరకు సమంజసమని అన్నారు అధికారుల వల్ల సన్న కారు రైతులంతా పుష్కలంగా పంట పెట్టుకునే భూములన్ని బీడుగా మారాయని మండిపడ్డారు జిల్లా జాయింట్ కలెక్టర్ స్పందించి గంగలపూడి గ్రామానికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే గుర్తు బయట పడుతుందని కోరారు ఇకనైనా విద్యుత్ అధికారులు స్పందించి బడా బాబు పెట్టుకున్నటువంటి తగిలం చెట్లు తొలగించి రైతులకు విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో రైతులందరిని సమీకరించి ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏడి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు

## ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యం: డాక్టర్ పనబాక లక్ష్మి




ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు డాక్టర్ పనబాక లక్ష్మి అన్నారు. తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీమతి మన్నార్ సుగుణమ్మ నివాసంలో గురువారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలను ప్రత్యక్షంగా కలిసి వారి సమస్యలు, అభ్యర్థనలు, వినతులను శ్రద్ధగా ఆలకించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం కోసం పని చేయడం ప్రభుత్వ బాధ్యత అని డాక్టర్ పనబాక లక్ష్మి పేర్కొన్నారు. ప్రజా సేవే పరమావధిగా తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతోందని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కృషి చేస్తామని ఆమె స్పష్టం చేశారు.ప్రజా దర్బార్ కార్యక్రమానికి స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు పలువురు ప్రజలు హాజరయ్యారు.

## సొంత నిధులతో స్మశానవాటికకు మహర్దశ

### - దాతృత్వం చాటుకున్న చెంగల్ రాయమ్ శెట్టి



ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.

సాధనవరి పాలెం, వరదయ్యపాలెం మండలం, తిరుపతి జిల్లా గ్రామంలోని స్మశానవాటిక దుస్థితిని చూసి చలించిన స్థానిక ప్రముఖులు, దాత లిశ్రీ చెంగల్ రాయమ్ శెట్టి. తన సొంత నిధులతో స్మశానాన్ని పూర్తిగా శుభ్రం చేయించి, బోరు వేయించి గ్రామస్తుల మన్ననలు అందుకున్నారు.సాధనవరి పాలెం గ్రామ శివారులో ఉన్న స్మశానవాటిక గత కొన్నేళ్లుగా పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయి, దహన సంస్కారాలకు వచ్చేవారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం, వేసవిలో కనీసం మంచినీటి సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.ఈ విషయాన్ని గమనించిన చెంగల్ రాయమ్ శెట్టి. వెంటనే స్పందించారు. ఎవరి సహాయం కోసం ఎదురుచూడకుండా తన సొంత ఖర్చులతో జేసీబీ పెట్టి పిచ్చిమొక్కలు తొలగించి, చదును చేయించారు. అంతేకాకుండా దహన సంస్కారాల సమయంలో నీటి అవసరం దృష్ట్యా స్మశానంలోనే ఒక బోరు వేయించి , నీటి సౌకర్యం కల్పించారు."ఊరిలో మంచి పని చేసేవాళ్లు తక్కువ.చెంగల్ రాయమ్ శెట్టి. చేసిన ఈ పని చాలా గొప్పది. స్మశానంలో బోరు వచ్చేసరికి ఇక నీళ్ల బాధ తప్పింది. ఆయనకు మా కృతజ్ఞతలు" అని గ్రామ పెద్దలు, యువకులు హర్షం వ్యక్తం చేశారు.

## తిరుమల మొదటి ఘాట్రోడ్డులో ప్రమాదం



ప్రజా భూమి ప్రతినిధి తిరుమల

తిరుమల మొదటి ఘాట్రోడ్డులో శుక్రవారం కారు ప్రమాదానికి గురైంది. మహారాష్ట్రకు చెందిన భక్తులు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి డివైడరు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రులకు చికిత్స అందించారు. అనంతరం వారిని మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించారు.

# దొంగ ఓట్లపై గతంలో ప్రాణాలకు తెగించి పోరాటం చేశాం: పులివర్తి సుధా రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్
గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దొంగ ఓట్ల నమోదుపై ప్రాణాలకు తెగించి పోరాటం చేశామని, ఇప్పుడు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ద్వారా వాటిని పూర్తిగా తొలగించేందుకు మంచి అవకాశం వచ్చిందని పులివర్తి సుధా రెడ్డి అన్నారు. చంద్రగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. తిరుపతి రూరల్ మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్త తమ వార్డులు, వీధుల్లో ప్రత్యేక చొరవ తీసుకుని దొంగ ఓట్ల తొలగింపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని తిరుపతి రూరల్ మండలంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని సూచించారు. మేజర్ తుమ్మలగుంట, ఉమ్మడి మంగళం పంచాయతీ, పేరూరు, అవిలాల, తిరుచానూరు ప్రాంతాల్లో అధిక సంఖ్యలో దొంగ ఓట్లు నమోదైనట్లు గుర్తించామని తెలిపారు. ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా ఉండేందుకు ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు, ఈ-మెయిల్స్, సందేశాల ద్వారా సమస్యలను నిరంతరం వారి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి ఓటరు తన పేరు ఓటర్ల జాబితాలో సక్రమంగా నమోదై ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న ఇంటింటి ఓటర్ల పరిశీలన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి ఓటర్ల జాబితా ప్రక్షాళనకు తోడ్పడాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అందుబాటులో లేని ఓటర్లు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత తప్పనిసరిగా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. చిరునామా మార్పులు, పేరు సవరణలు లేదా ఇతర వివరాల్లో మార్పులు ఉంటే నిర్దేశిత గడువులోపు సరిచేసుకోవాలని పేర్కొన్నారు. దొంగ ఓట్లు, ద్వంద్వ నమోదులు, అర్హత లేని ఓటర్ల నమోదు వంటి అక్రమాలకు చంద్రగిరి నియోజకవర్గంలో తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# శ్రీ వకుళామాత సన్నిధిలో "అక్షర గోవిందం"కు శ్రీకారం..!

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:
చిన్నారుల్లో సనాతన ధర్మ సంప్రదాయాలపై ఆసక్తి పెంపొందించి, వారి విద్యారంభం, జీవితారంభం దైవానుగ్రహంతో శుభప్రదంగా సాగాలనే సంకల్పంతో టిటిడి జూలై 3 నుండి తిరుపతిలోని శ్రీ వకుళామాత ఆలయంలో నూతనంగా "అక్షర గోవిందం" మరియు అన్నప్రాశన కార్యక్రమాలను ప్రారంభించనుంది.శ్రీ వేంకటేశ్వరస్వామి -- శ్రీ వకుళామాత ఆశీస్సులతో అక్షరాభ్యాసం..జూలై 03వ తేదీ మధ్యాహ్నం 12.00 నుండి 12.30 గంటల వరకు వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆశీస్సులతో, శ్రీ వకుళామాత సన్నిధిలో చిన్నారులకు సంప్రదాయబద్ధంగా అక్షరాభ్యాసం నిర్వహిస్తారు. కార్యక్రమం అనంతరం ఆశీర్వచనం, ప్రసాదం, ప్రత్యేక "అక్షర గోవిందం కిట్" అందజేస్తారు.

3 నుండి 5 సంవత్సరాల చిన్నారులకు అవకాశం..

### జూలై 3 నుండి చిన్నారులకు అక్షరాభ్యాసం -- అన్నప్రాశన సేవలు..



ఈ కార్యక్రమంలో 3 నుండి 5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులు పాల్గొనవచ్చు. అక్షర గోవిందం కిట్‌లో రాతపలక, బలపాలు, అక్షింతలు, పసుపు, కుంకుమ, శ్రీవారి కంకణం, ఫటిక బెల్లం, శ్రీ వకుళామాత, శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ పద్మావతి అమ్మవారు, శ్రీ సరస్వతీదేవి చిత్రపటాలు, గోవింద నామాలు, శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం, పెద్దబాలశిక్ష తదితర పూజా, విద్యా సామగ్రిని ఉచితంగా అందజేస్తారు.

వేదోక్తంగా అన్నప్రాశన సేవ..
అదేవిధంగా ఆలయ అర్చకుల పర్యవేక్షణలో వేదమంత్రోచ్ఛారణల మధ్య చిన్నారులకు తొలి అన్నప్రాశనను ఆగమోక్తంగా నిర్వహించి, శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ వకుళామాతల ఆశీస్సులను అందజేస్తారు.

ముందస్తు నమోదు తప్పనిసరి..
జూలై 4 నుండి మంగళవారం మినహా అన్ని రోజుల్లో వకుళమాత ఆలయ అర్చకులు నిర్ణయించిన శుభ ముహూర్తంలో ఆలయంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతిరోజూ బ్యాచ్‌కు 25 మంది చిన్నారులు చొప్పున రెండు బ్యాచ్‌లలో మొత్తం 50 మందికి మాత్రమే అవకాశం కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు గంట ముందస్తుగా ఆలయ ప్రాంగణంలో నమోదు చేసుకోవాలి. చిన్నారులు తల్లిదండ్రులు లేదా సంరక్షకులతో కలిసి సంప్రదాయ వస్త్రధారణలో హాజరుకావాలని టిటిడి సూచించింది.

అక్షర గోవిందం సేవలను సద్వినియోగం చేసుకోవాలి : టిటిడి
శ్రీ వకుళామాత, శ్రీ వేంకటేశ్వరస్వామివారి దివ్య అనుగ్రహంతో తమ పిల్లల విద్యారంభం, అన్నప్రాశనను పవిత్రంగా నిర్వహించుకునేందుకు ఈ ప్రత్యేక సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని టిటిడి కోరుతోంది.

## ఎండిపుత్తూరు, చెల్లూరు గ్రామాల్లో మోటార్ స్టార్టర్ల చోరీకలకలం - కన్నీటి పర్యంతమైన రైతులు





ప్రజాభూమి ప్రతినిధి ఏర్పేడు
తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని ఏర్పేడు మండలం ఎండి పుత్తూరు/చెల్లూరు,గ్రామాల పరిధిలో రైతుల పొలాల్లో అమర్చిన విద్యుత్ మోటార్ స్టార్టర్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకే రాత్రి 11 నుండి 15 స్టార్టర్లు వరకు చోరీకి గురైనట్లు బాధిత రైతులు తెలిపారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం, ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు స్టార్టర్ బాక్సులు ఖాళీగా ఉండడం, విడిభాగాలు పొలంలో చెల్లాచెదురుగా పడి ఉండడం చూసి కన్నీరు పెట్టుకున్నారు. పంటలకు నీరందించే సమయంలో ఈ చోరీ జరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఒక స్టార్టర్ విలువ రూ.5600లెక్కన కొనుగోలు చేశామని ఆవేదన వ్యక్తం చేశారు.

"ఇప్పటికే పెట్టుబడి ఖర్చులు పెరిగి అప్పుల్లో కూరుకుపోయాం. పంటకు నీరుపారే సమయంలో స్టార్టర్లు ఎత్తుకెళ్లారని పొలం ఎండిపోతే ఏం చేయాలి" అని బాధిత రైతులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఈ ఘటనపై బాధిత రైతులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు రైతులు చరవాణి ద్వారా ఫిర్యాదు చేశారు. ఒకే రాత్రి రెండు గ్రామాల్లో 11కి పైగా స్టార్టర్లు చోరీ కావడంతో ఇది వ్యవస్థీకృత ముఠా పనే అయి ఉంటుందని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.వ్యవసాయ మోటార్లకు అమర్చే స్టార్టర్ల చోరీలు ఇటీవల పెరిగిపోయాయని, రాత్రి వేళల్లో పోలీసు గస్తీ పెంచాలని, నిందితులను త్వరగా పట్టుకుని కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు. అలాగే ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ.. రూ.5 లక్షల ప్రమాద బీమా అందజేస్తామని యుగంధర్ పొన్న హామీ



ప్రజా భూమి ప్రతినిధి
గంగాధర నెల్లూరు
గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలోని రెండు కుటుంబాలను పరామర్శించిన జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ పొన్న, మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్వేటినగరం మండలం కేఎం పురం గ్రామపంచాయతీ పరిధిలోని కేఎం పురం గ్రామానికి చెందిన బాలాజీ రెడ్డి, గంగాధర నెల్లూరు మండలం కలిజవేడు పంచాయతీ పరిధిలోని కే నాసంపల్లి గ్రామానికి చెందిన బాలాజీ మృతదేహాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ తరఫున ప్రమాద బీమా పథకం కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని త్వరలోనే అందజేస్తామని యుగంధర్ పొన్న తెలిపారు. బాధిత కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్వేటినగరం మండల బూత్ కన్వీనర్ సురేష్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు మాదాసి వెంకటేష్, కార్వేటినగరం మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రుద్ర, గంగాధర నెల్లూరు మండల అధ్యక్షుడు సురేష్ రెడ్డి, మండల నాయకులు కిషోర్, మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్, జనసైనికులు పాల్గొన్నారు.

# ఈ రోజే మహా ప్రదోష పూజలు



ప్రజా భూమి ప్రతినిధి నాగలాపురం
నాగలాపురం మండలం సురుటుపల్లి శ్రీ పల్లి కొండేశ్వర స్వామి ఆలయంలో శనివారం - శని త్రయోదశి మహా ప్రదోషకాల పూజలు జరుగుతాయి. సాయంత్రం నాలుగు గంటల నుంచి 6 గంటల వరకు ఇక్కడి ఆస్థాన నందీశ్వరునికి, శ్రీ వాల్మీకేశ్వర స్వామికి, శ్రీ మరగదాంబికా అమ్మవారికి ఏకకాల అభిషేకాలు వైభవంగా నిర్వహిస్తారు అనంతరం మహా హారతి, స్వామి అమ్మవార్ల ప్రాకార ఉత్సవాలు జరుగుతాయి ఈ ఏడాది చివరి శని ప్రదోష కాల పూజలు ఇవే. ఈ అభిషేకాలను తిలకిస్తే సంతాన ప్రాప్తిని, ఆయురారోగ్యాలను, ఐశ్వర్యాన్ని పొందవచ్చునని, తెలియని దోషాలు ఉంటే కూడా దూరమవుతాయని ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేయన్ తెలిపారు సమీప రాష్ట్రాల నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి విచ్చేస్తారు ఈ నేపథ్యంలో ప్రదోషకాల పూజలను ప్రతి ఒక్క భక్తుడు తిలకించే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరిగిందని ఆలయ ఈవో లత వెల్లడించారు.

ఉభయదాత - శ్రీ సిటీ ఎండి : శని త్రయోదశి - శనివారం జరిగే ఈ మహా ప్రదోషకాల పూజలకు ఉభయ దాతగా సిటీ ఎండి డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి - మమత ఉన్నారని ఆలయ ఈవో లత పేర్కొన్నారు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు శ్రీ సిటీ భద్రతా సిబ్బంది కూడా బందోబస్తుకు వినియోగిస్తున్నట్లు ఈవో వెల్లడించారు.

## వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గురు నాగరాజ్ మృతి పట్ల కాటంరెడ్డి పవిత్ర రెడ్డి తీవ్ర సంతాపం



ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్
శ్రీకాళహస్తి పట్టణంలోని 15వ వార్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ గురు నాగరాజ్ ఆకస్మిక మృతి చెందడం పట్ల మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె కాటంరెడ్డి పవిత్ర రెడ్డి బియ్యపు తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. గురు నాగరాజ్ నివాసానికి వెళ్లిన పవిత్ర రెడ్డి , ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, శోకసముద్రంలో ఉన్న వారి కుమారుడు జీవన్ కుమార్ ను మరియు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,గురు నాగరాజ్ అకాల మరణం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యంగా శ్రీకాళహస్తి నియోజకవర్గానికి తీరని లోటు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి ఆయన అందించిన సేవలు ఎనలేనివి. నిరంతరం ప్రజల్లో ఉంటూ, వార్డు అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఆయన కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది అని పేర్కొన్నారు. నివాళులర్పించిన వారిలో కోళ్లూరు హరినాయుడు,పటాన్ ఫరీద్,అస్లాం, కంట ఉదయ్ కుమార్,మున్నా రాయల్, జూమ్లేష,ఆవుల శ్రీను,మొదుముడి రవి,దివ్య కాంత్ తదితరులు ఉన్నారు.

## ఎస్సైగా పదోన్నతి పొందిన రమణయ్యకు ఘన సన్మానం



ప్రజా భూమి ప్రతినిధి సూళ్లూరుపేట
సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహించిన రమణయ్యకు ఎస్ఐగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా సీఐ కార్యాలయంలో అధికారులు ఆయనను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. రమణయ్య క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ సహచరులకు ఆదర్శంగా నిలిచారని అధికారులు కొనియాడారు. పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేయగా, భవిష్యత్తులోనూ మరింత బాధ్యతాయుతంగా పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకువస్తానని రమణయ్య కృతజ్ఞతలు తెలిపారు.

## చంద్రగిరి రాజకీయాల్లో కలకలం.. ఎమ్మెల్యే నానిపై బీజేపీ నేత పురుషోత్తం నాయుడు ఆరోపణలు



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
చంద్రగిరి నియోజకవర్గ రాజకీయాల్లో కొత్త వివాదం తెరపైకి వచ్చింది. చంద్రగిరి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడసాని పురుషోత్తం నాయుడు, ఎమ్మెల్యే పులివర్తి నానిపై తీవ్ర ఆరోపణలు చేశారు.మీడియాతో మాట్లాడుతూ, తిరుపతి రూరల్ పరిధిలో ఆరు లైన్ల జాతీయ రహదారి నిర్మాణ పనులకు తనకు కాంట్రాక్ట్ లభించిందని తెలిపారు. 2025 ఫిబ్రవరిలో పనులు ప్రారంభించినప్పటి నుంచి పలువురు టీడీపీ నాయకుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్నానని ఆరోపించారు.రోడ్డు నిర్మాణానికి అవసరమైన గ్రావెల్ అనుమతుల విషయంలో తీవ్ర అవరోధాలు ఎదురయ్యాయని, దీంతో పనులు నిలిపివేయాల్సి వచ్చిందని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే సూచన మేరకు కొందరు స్థానిక నాయకులను కలిసినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా నెలవారీగా డబ్బులు ఇవ్వాలని తనపై ఒత్తిడి తీసుకువచ్చారని, ఇప్పటికే లక్షల రూపాయలు చెల్లించినప్పటికీ తన పనులకు ఆటంకాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం కూడా గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఈ అంశాన్ని రాష్ట్ర స్థాయి కూటమి నాయకులు, మంత్రులు, ఇతర ఉన్నత నాయకుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సరైన స్పందన రాలేదని ఆయన పేర్కొన్నారు. అధికార యంత్రాంగాన్ని ప్రభావితం చేస్తూ తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యే నానిపై ఆరోపణలు చేశారు. చంద్రగిరి నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలపై "సేవ్ చంద్రగిరి" పేరుతో ఉద్యమం చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని పురుషోత్తం నాయుడు అన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం కోసం ఎంత దూరమైనా వెళ్తానని స్పష్టం చేశారు.

## ఫ్రైడే డ్రై డే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన



ప్రజా భూమి ప్రతినిధి చిట్వేల్
తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని చిట్వేల్ మండలంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. చిట్వేల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ శివప్రసాద్ గౌడ్, డాక్టర్ సల్మా ఆదేశాల మేరకు చిట్వేల్ పట్టణ పరిధిలోని అన్ని సచివాలయాలు, వార్డుల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో అబేట్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. ఈ ద్రావణం మురికి నీటిలో ఉండే దోమల లార్వాలను నిర్మూలించడంలో ఉపయోగపడుతుందని ఆరోగ్య సిబ్బంది తెలిపారు. అలాగే ఇళ్లలో నిల్వ ఉంచిన నీటిని వారానికి ఒకసారి పూర్తిగా ఖాళీ చేసి, కనీసం అరగంటపాటు ఆరనిచ్చిన తర్వాత తిరిగి నీరు నింపుకోవాలని సూచించారు. ఇలా చేయడం వల్ల దోమల పెరుగుదలను నివారించవచ్చని వివరించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని పాటించడం ద్వారా దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ వంటి వ్యాధులను అరికట్టవచ్చని ఏఎన్ఎంలు మరియారాణి, గౌరి చిట్వేల్ నాలుగో వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు మరియారాణి, గౌరి, ఆశా కార్యకర్తలు శివకుమారి, మునిరాజ పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా న్యూమిస్మాటిక్, ఫిలాటెలిక్ ఎక్స్‌పోలో పాల్గొన్న తుడా చైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
తపన సొసైటీ ఆధ్వర్యంలో తిరుపతిలోని బాలాజీ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఆల్ ఇండియా న్యూమిస్మాటిక్ & ఫిలాటెలిక్ ఎక్స్‌పో కార్యక్రమంలో తుడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్, తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎక్స్‌పోలో ప్రదర్శించిన అరుదైన నాణేలు, తపాలా బిళ్లలు (స్టాంపులు), చారిత్రక నాణేల సేకరణలను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. ఇటువంటి ప్రదర్శనలు భారతదేశ చరిత్ర, సంస్కృతి, వారసత్వాన్ని భావితరాలకు పరిచయం చేయడంతో పాటు న్యూమిస్మాటిక్స్, ఫిలాటెలీ వంటి సేకరణల పట్ల యువతలో ఆసక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం తపన సొసైటీ ప్రతినిధులు, నిర్వాహకులు, సభ్యులను అభినందిస్తూ ఎక్స్‌పోను విజయవంతంగా నిర్వహించినందుకు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, బీజేపీ తిరుపతి అధ్యక్షుడు సమాంచి శ్రీనివాస్, కూటమి నాయకులు, స్థానిక ప్రముఖులు, కళాభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలి: నేదురుమల్లి



ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు
వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి శుక్రవారం వాకాడులోని తన నివాసంలో పార్టీ నాయకులు,కార్యకర్తలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వాకాడు, కోట, చిట్టమూరు మండలాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలపర్చేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నేదురుమల్లి సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి అన్ని రంగాల్లో వేగంగా సాగాలంటే వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని ప్రజలు ఆశిస్తున్నారని తెలిపారు. పార్టీ అధినేత ఆశయాలకు అనుగుణంగా ప్రతి నాయకుడు, కార్యకర్త కట్టుబాటుతో పనిచేయాలని పిలుపునిచ్చారు.పార్టీ బలోపేతమే లక్ష్యంగా గ్రామ స్థాయి నుంచి కార్యాచరణను వేగవంతం చేయాలని, ప్రజలకు మరింత చేరువ కావాలని సమావేశంలో నిర్ణయించారు.

## గిరిజన నాయకుడు చందమామల కోటయ్యకు అండగా జనసేన నాయకుడు నరేంద్ర దండి

### - మానవత్వాన్ని చాటుతూ ప్రమాద బాధితుడిని పరామర్శించి, త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్ష



ప్రజాభూమి ప్రతినిధి :తొట్టంబేడు
ఆంధ్రప్రదేశ్ యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షులు, గిరిజన ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద మామల కోటయ్య తొట్టంబేడు మండలం రాజీవ్‌నగర్ సమీపంలో జరిగిన హిట్ అండ్ రన్ ప్రమాదంలో గాయపడిన విషయం అత్యంత బాధాకరం. ప్రమాదానికి కారణమైన నాలుగు చక్రాల వాహన డ్రైవర్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ, గాయపడిన వ్యక్తిని కనీసం పలకరించకుండా అక్కడి నుంచి వెళ్లిపోవడం అత్యంత శోచనీయం. ఇటువంటి అమానవీయ ఘటనలు సమాజంలో చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే నా సహచర నాయకులతో కలిసి కోటయ్య ని రాజీవ్ నగర్ లోని వారి నివాసంలో పరామర్శించి, ఆయనతో మరియు కుటుంబ సభ్యులతో సుదీర్ఘంగా మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నాను. ప్రస్తుతం ఆయన క్రమంగా కోలుకుంటుండటం కొంత ఉపశమనాన్ని కలిగించింది. ప్రజా సేవలో నిరంతరం ప్రజల కోసం అంకితభావంతో పనిచేస్తున్న కోటయ్య సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా కొనసాగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. ఈ పరామర్శ కార్యక్రమంలో జనసేన పార్టీ శ్రీకాళహస్తి నాయకులు లక్ష్మణ్, నవీన్, సుబ్బు, రాజేష్, జయశంకర్ తదితరులు పాల్గొని తమ నైతిక మద్దతు తెలియజేసి, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



# తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో సంక్షేమ వసతులకు డీజీపీ శంకుస్థాపన

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్తా, శాంతిభద్రతల విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మధుసూదన్ రెడ్డి తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో పోలీస్ సంక్షేమానికి సంబంధించిన పలు మౌలిక వసతుల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. పోలీస్ వెల్ఫేర్ క్యాంటీన్, ప్రధాన ప్రవేశ ద్వారం (గ్రాండ్ గేట్), కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ సతీమణి కూడా పాల్గొన్నారు. అనంతరం జిల్లా పోలీసింగ్, శాంతిభద్రతలు, నేర నియంత్రణ, ప్రజా భద్రత, పోలీస్ సంక్షేమం తదితర అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు జిల్లాలో అమలవుతున్న పరిపాలనా చర్యలు, పోలీసింగ్ విధానాలు, శాంతిభద్రతల పరిరక్షణకు





చేపడుతున్న చర్యలపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణ, ప్రజలకు అందిస్తున్న పోలీస్ సేవలు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా జరుగుతున్న పర్యవేక్షణ, సీసీ కెమెరాల వినియోగం, పటిష్ట నైట్ బీట్ వ్యవస్థ, ఇంటిగ్రేటెడ్ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై డీజీపీ క్షుణ్ణంగా సమీక్షించారు. ప్రజా భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు జిల్లాలో డ్రోన్ సాంకేతికతను నేర నియంత్రణ, జనసమ్మర్ద నిర్వహణ, ప్రత్యేక ఆపరేషన్లలో వినియోగిస్తున్న విధానాన్ని వివరించారు. అలాగే మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా ప్రతి సబ్ డివిజన్ పరిధిలో సర్కిల్ వారీగా డ్రగ్స్, గంజాయి నిరోధక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు, డ్రగ్ టెస్టింగ్ నిర్వహిస్తూ యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌తో కలిసి నిర్వహించిన రహదారి భద్రత బస్సు యాత్ర, ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్స్ గుర్తింపు, ప్రమాదాల నివారణకు చేపట్టిన చర్యలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాల వివరాలను కూడా డీజీపీకి వివరించారు. మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ శక్తి టీమ్ ద్వారా తక్షణ స్పందన, అవగాహన కార్యక్రమాలు, భద్రతా చర్యలు సమర్థవంతంగా అమలవుతున్నాయని ఎస్పీ తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన సైబర్ & సోషల్ మీడియా మానిటరింగ్ వ్యవస్థ చురుకుగా పనిచేస్తోందని డీజీపీ ప్రశంసించారు. అలాగే యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా నిరంతర డ్రగ్ టెస్టింగ్, ప్రత్యేక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న జిల్లా పోలీస్ శాఖ చర్యలను అభినందించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, సాంకేతిక ఆధారిత ఆధునిక పోలీసింగ్, పోలీస్ సంక్షేమం, ప్రజా సేవల మెరుగుదల దిశగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ చేపడుతున్న కార్యక్రమాలను డీజీపీ అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

# గేట్ వాల్వ్ వద్ద నీటి లీకేజీ.. వెంటనే మరమ్మతులు చేపట్టాలి



ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలంలోని నెలవాయి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్‌కు అమర్చిన గేట్ వాల్వ్ సమీపంలో నీటి లీకేజీ ఏర్పడి నిరంతరం నీరు వృథాగా పోతోంది. పైపులైన్ ప్రారంభ దశలోనే ఈ సమస్య తలెత్తడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీని వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టకపోతే నీటి ఒత్తిడి కారణంగా పైపులు పగిలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో ప్రభుత్వ నిధులతో నిర్మించిన పైపులైన్ దెబ్బతినడంతో పాటు తాగునీటి సరఫరాకు కూడా అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి లీకేజీని అరికట్టి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలొద్దు కాంగ్రెస్ పార్టీ

ప్రజా భూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి టౌన్

తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు ఆధ్వర్యంలో నేడు తిరుపతి ప్రెస్ క్లబ్ నందు నీట్ పరీక్షల అవకతవకలపై మీడియా సమావేశం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ తరఫున నీట్ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నీట్ పరీక్షల విషయంలో వరుసగా వెలుగులోకి వస్తున్న అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ నిరసన వ్యక్తం చేస్తూ భావి భారత భవిష్యత్ పౌరులు అయినటువంటి విద్యార్థుల భవిష్యత్తును నేటి ప్రభుత్వాలు అంధకారం చేస్తున్నాయని పరీక్షల నిర్వహణలో చోటు చేసుకున్నటువంటి లోపం వల్ల వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని, భవిష్యత్తులో పరీక్షల నిర్వహణ మరింత కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు పంట శ్రీనివాసులు రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, తిరుపతి నగర అధ్యక్షులు గౌడ పేరు చిట్టిబాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త ఐరాల లోకేష్ రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బల్ల హరి, సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త వెంకటాచలపతి. జిల్లా అధ్యక్షులు శివ బాలాజీ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు జ్యోతిశ్వర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిరంజీవి, పూల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేసిన టీడీపీ నాయకుడు విజయ శేఖర్ రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

మండల కేంద్రమైన వాకాడులో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు నిర్వహిస్తున్న కూలీలకు టిడిపి సీనియర్ నాయకుడు సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి మజ్జిగ పంపిణీ చేసి తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. గత కొద్దిరోజులుగా మండలంలో ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఉపాధి పనుల్లో నిమగ్నమైన కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి చల్లటి మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ గాయం రమ్య మాట్లాడుతూ, వాకాడులో కాలువ శుభ్రపరిచే పనులను ఈరోజు సుమారు 150 మంది కూలీలు చేపట్టినట్లు తెలిపారు. మండుటెండల్లో పనిచేస్తున్న కూలీలకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. మజ్జిగ అందుకున్న కూలీలు ఆనందం వ్యక్తం చేస్తూ, ఎండ వేడిమి నుంచి కొంత ఉపశమనం కలిగిందని తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు కూలీలకు ఎంతో ఊరటనిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు



# లైన్స్ క్లబ్ ఆఫ్ రేణిగుంట అధ్యక్షుడు,,,జూలియన్ రాజు,కు ఉద్భావ అవార్డు బహుకరణ.

ప్రజా భూమి ప్రతినిధిరేణిగుంట

బెంగళూరు ఇందిరా నగర్ క్లబ్‌లో శుక్రవారం లైన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 317ఇ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ రేణిగుంట జంక్షన్ అధ్యక్షుడు జూలియన్ రాజు చేసిన సేవలను గుర్తించి ఉద్భావ అవార్డును డిస్టిక్ గవర్నర్ లైన్ అశ్వత్నారాయణ స్వామి చేతులమీదుగా, ఉద్భవ అవార్డును, బహూకరించారు. ఈ సందర్భంగా జూలియన్ రాజు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ రేణిగుంట జంక్షన్ కార్యవర్గ సభ్యులు అందరూ కలిసి చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి నేడు అవార్డును అందించారని అన్నారు. రేణిగుంటలో చేసిన సేవా కార్యక్రమాలకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రేణిగుంట లైన్స్ క్లబ్ తరపున అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. మునుముందు కూడా లైన్స్ క్లబ్ ఆఫ్ రేణిగుంట జంక్షన్ ఆధ్వర్యంలో పేదలకు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



# కార్మికులకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలి: సీఐటీయూ



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి


రాష్ట్రంలోని కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని, జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించే కనీస వేతనాల క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. గురువారం తిరుపతిలో జరిగిన సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఏప్కాస్ ఉద్యోగులు తక్కువ వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని, పెరుగుతున్న ధరల కారణంగా కార్మిక కుటుంబాలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని ఆయన అన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ, ఉద్యోగ భద్రత వంటి హక్కులు సక్రమంగా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వాసి నాగరాజు మాట్లాడుతూ కనీస వేతనాల అమలు లేకపోవడం, కాంట్రాక్టీకరణ పెరగడం వల్ల కార్మికుల సమస్యలు తీవ్రమవుతున్నాయని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జూలై నెలలో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపట్టి కనీస వేతనం, ఉద్యోగ భద్రత, కార్మిక హక్కుల సాధన కోసం ఉద్యమ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వందేమాతరం రచయిత బంకిం చంద్ర చటర్జీ జయంతి నేడు

## భారత స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన మహానుభావుడు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

భారత స్వాతంత్ర్య సమరయోధుల హృదయాల్లో దేశభక్తి జ్వాలను రగిలించిన "వందేమాతరం" గీత రచయిత బంకిం చంద్ర చటర్జీ జయంతి నేడు. 1838 జూన్ 26న పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా కాంతల్‌పారా గ్రామంలో జన్మించిన బంకిం చంద్రుడు భారతీయ సాహిత్య రంగంలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నారు. హుగ్లీలో ప్రాథమిక విద్యను పూర్తి చేసిన ఆయన, కలకత్తా విశ్వవిద్యాలయం ప్రెసిడెన్సీ కళాశాలలో ఉన్నత విద్య అభ్యసించారు. అనంతరం సివిల్ సర్వీస్ పరీక్షలో ఉత్తీర్ణులై డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఆ పదవిని చేపట్టిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందారు. ఉద్యోగంలో కొనసాగుతూనే సాహిత్య రచనలు ప్రారంభించిన బంకిం చంద్రుడు తొలుత ఆంగ్లంలో రచనలు చేశారు. అనంతరం మాతృభాష బెంగాలీలో రచనలు ప్రారంభించి, 1864లో "దుర్గేష్ నందిని" నవలను వెలువరించారు. తరువాత "కపాలకుండలా", "మృణాలిని" వంటి రచనలతో సాహిత్యాభిమానులను ఆకట్టుకున్నారు. 1882లో వెలువడిన "ఆనంద్ మఠ్" నవల ఆయనకు చిరస్థాయి కీర్తి తెచ్చిపెట్టింది. ఈ నవలలో భాగంగానే "వందేమాతరం" గీతం చోటు చేసుకుంది. మాతృభూమిని దేవతగా భావించి దేశసేవకు అంకితమైన యువకుల కథను ఈ నవల



ప్రతిబింబించింది. వందేమాతరం గీతం స్వాతంత్ర్య ఉద్యమానికి నినాదంగా మారి దేశవ్యాప్తంగా కోట్లాది మందిలో దేశభక్తిని రగిలించింది. బ్రిటిష్ పాలకులు ఈ గీతం ప్రభావాన్ని చూసి "ఆనంద్ మఠ్" నవలతో పాటు వందేమాతరం గానంపై కూడా నిషేధం విధించారు. అయినప్పటికీ విప్లవకారులు ఉరికంబం ఎక్కే క్షణాల్లో సైతం "వందేమాతరం" నినాదం చేస్తూ దేశభక్తిని చాటుకున్నారు. దేశభక్తి, ధర్మ పరిరక్షణ, జాతీయ చైతన్యాన్ని తన రచనల ప్రధాన అంశాలుగా చేసుకున్న బంకిం చంద్ర చటర్జీ బెంగాలీ సాహిత్యంలో నూతన శైలికి నాంది పలికారు. 1894 ఏప్రిల్ 8న ఆయన కన్నుమూసినా, ఆయన రచించిన "వందేమాతరం" గీతం భారత జాతి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు జనసేన అంకితం - సార్ కార్యక్రమంలో అక్కుర్తిలో విశేష స్పందన

## జనసేన బిఎల్ఏ సుబ్రహ్మణ్యం- జనసైనికుల సేవలను ప్రశంసించిన జనసేన నాయకుడు నరేంద్ర దండి

ప్రజాభూమి ప్రతినిధి: శ్రీ కాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామంలో, జనసేన నాయకుడు నరేంద్ర దండి మార్గదర్శకత్వంలో సార్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఓటరు జాబితాను మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సచివాలయ సిబ్బంది ( బి ఎల్ ఓ, పురుషోత్తం)తో సమన్వయం చేస్తూ, ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో చోటు దక్కేలా, అనర్హ నమోదులు తొలగేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా సర్వే చేపట్టారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ఖచ్చితమైన ఓటరు జాబితా అత్యంత కీలకమనే సంకల్పంతో జనసేన కార్యకర్తలు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా ముందుండి నిర్వహించిన సుబ్రహ్మణ్యం (సుబ్బు) ని, అలాగే అక్కుర్తి గ్రామానికి చెందిన ప్రతి ఒక్క జనసేన నాయకుడు, జనసైనికుడిని నరేంద్ర దండి ప్రత్యేకంగా అభినందించారు. స్వచ్ఛమైన ఓటరు జాబితా -- బలమైన ప్రజాస్వామ్యానికి పునాది" అనే భావనతో, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం జనసేన పార్టీ క్షేత్రస్థాయిలో నిరంతరం ప్రజలతో కలిసి పనిచేస్తూనే ఉంటుందని నరేంద్ర దండి తెలిపారు.



# వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గురు నాగరాజ్ మృతి పట్ల బియ్యపు ఆకర్ష్ రెడ్డి తీవ్ర సంతాపం

## పార్థివదేహానికి నివాళులర్పించి, పాడే మోసిన ఆకర్ష్ రెడ్డి

## కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన యువనేత

ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి పట్టణంలోని 15వ వార్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ గురు నాగరాజ్ ఆకస్మిక మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమారుడు బియ్యపు ఆకర్ష్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని,సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ రోజు గురు నాగరాజ్ నివాసానికి వెళ్లిన ఆకర్ష్ రెడ్డి గారు, ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, నాగరాజ్ కుమారుడు జీవన్ కుమార్ ను మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం జరిగిన అంత్యక్రియల ముగింపు యాత్రలో ఆకర్ష్ రెడ్డి స్వయంగా పాల్గొని, పాడే మోసి తన అచంచలమైన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ అంత్యక్రియల కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోళ్లూరు హరినాయుడు, పఠాన్ ఫరీద్, సాగిరాబి, షర్మిల ఠాగూర్, అస్లాం, శ్రీవారి సురేష్, పసల కృష్ణయ్య, మొగరాల గణేష్, మున్నా రాయల్, జస్వంత్, దివ్య కాంత్ మరియు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు



# భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో అఖండ జ్యోతి శ్రీకాళహస్తికి చేరిక

ప్రజా భూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి టౌన్

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో ప్రశాంతి నిలయం నుంచి బయలుదేరిన అఖండ జ్యోతి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ, శుక్రవారం సాయంత్రం శ్రీకాళహస్తికి చేరుకుంది. బహదూర్‌పేట భజన మందిరం వద్ద





నుంచి ప్రారంభమైన అఖండ జ్యోతి ఊరేగింపు ఉప్పు వీధి, నాయుడు బిల్డింగ్స్ ప్రధాన వీధి, ముత్యాలమ్మ గుడి వీధి, నగరి వీధి, బజార్ వీధి, తేరు వీధి, నెహ్రూ వీధి మార్గాల గుండా ప్రయాణించి, చివరగా శ్రీ సత్యసాయి మందిరానికి చేరుకోనుంది. శుక్రవారం రాత్రి అఖండ జ్యోతి శ్రీకాళహస్తిలోని శ్రీ సత్యసాయి మందిరంలో భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేయబడుతుంది. భక్తులు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు

# పుత్తూరులో నూతన డీఎస్పీ కార్యాలయం ప్రారంభం

## ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర డీజీపీ, నగరి - సత్యవేడు ఎమ్మెల్యేలు

ప్రజా భూమి ప్రతినిధి పుత్తూరు

తిరుపతి జిల్లా నగరి నియోజకవర్గంలోని పుత్తూరులో నూతనంగా నిర్మించిన డీఎస్పీ కార్యాలయాన్ని రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు హోమం, వేదమంత్రోచ్చారణలు, మేళతాళాల నడుమ నూతన డీఎస్పీ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ అధికారులు అతిథులకు స్వాగతం పలికి కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు. అనంతరం నూతన కార్యాలయ భవనాన్ని సందర్శించిన అతిథులు, పోలీస్ శాఖకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉన్నతస్థాయి పోలీస్ అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్వే పరిశీలన

ప్రజాభూమి ప్రతినిధిరామచంద్రపురం

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 ) కార్యక్రమాన్ని బూత్ లెవెల్ ఆఫీసర్లు సమర్థవంతంగా నిర్వహించాలని తహశీల్దార్ యు మధుసూదన్ రావు అన్నారు. శుక్రవారం మండలంలోని రాయల చెరువు పేట, బలిజపల్లి గ్రామాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి ఎల్ వో లు సర్ సర్వేపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 2002 ఓటర్ల జాబితాను 2025 ఓటర్ల జాబితాతో అనుసంధానం చేసి ఇంటింటి సర్వే నిర్వహించి మరణించిన, నకిలీ ఓట్లు, డూప్లికేట్ ఓట్లను తొలగించాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్( ఎస్ ఐ ఆర్ 2026) నిర్వహణలో బూత్ లెవెల్ ఆఫీసర్లు ఎన్నికల సంఘం ఇచ్చిన నియమ నిబంధనలు పాటిస్తూ తప్పులు తడకలు లేని ఓటర్ల జాబితా తయారు చేయాలన్నారు. బిఎల్వోలు ప్రతి ఓటరుకు ఎన్యూమినేషన్ ఫారం అందజేయాలన్నారు. ఓటర్లు ఎన్నిమిరేషన్ ఫారంలో సమాచారాన్ని నింపి రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు అతికించి తిరిగి బిఎల్ఓ కి అందజేయాలన్నారు. 18 సంవత్సరాల వయసు నిండిన కొత్తవారికి ఓటు హక్కు కల్పించడంలో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, కుప్ప త్యాగరాజులు, దిలీప్ రాయల్, నూనె రాజేష్, బి ఎల్ వో లు జి రాజశేఖర్, గంగయ్య, ప్రజలు పాల్గొన్నారు.



# శ్రీకాళహస్తి--తడ రోడ్డుపై తవ్వకాల తిప్పలు.. ప్రమాదాల బాటలో ప్రయాణం

## రాత్రివేళ ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్న గుంతలు

ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండల పరిధిలోని శ్రీకాళహస్తి--తడ ప్రధాన రహదారిపై జరుగుతున్న నిరంతర తవ్వకాల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలం నుంచి శ్రీ సిటీ, తడ, శ్రీకాళహస్తి ప్రాంతాలకు నిత్యం





వందలాది వాహనాలు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే రహదారిపై తవ్వకాలు చేసి వాటిని సక్రమంగా పూడ్చకపోవడంతో అనేక చోట్ల గుంతలు ఏర్పడి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో తగిన హెచ్చరిక బోర్డులు, ప్రతిబింబించే సూచికలు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు విద్యార్థులు, ఉద్యోగులు ఈ రహదారిపై ప్రయాణించేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి తవ్వకాల పనులను వేగవంతంగా పూర్తి చేసి, రహదారిని మరమ్మతులు చేసి వాహనదారులకు ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

# బీసీల సంక్షేమం ఎన్డీయే కూటమితోనే సాధ్యం

## -తెలుగుదేశం పార్టీ,శ్రీకాళహస్తి నియోజకవర్గం



ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి టౌన్
గడచిన నాలుగు దశాబ్దాలుగా వెనుకబడిన వర్గాలకు అండగా నిలబడి, వారి అభ్యున్నతికి ప్రత్యేకంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న తెలుగుదేశం పార్టీ మరియు ఎన్డీయే కూటమితోనే బీసీలకు మేలు జరుగుతుందని శ్రీకాళహస్తి నియోజకవర్గ, తెలుగుదేశం పార్టీ నాయకులు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విధ్వంసకర వైసిపి పాలన అంతమై, వికాసం వైపు అడుగులు వేస్తూ ముందుకు వెళుతున్న చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మరో 10 మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఇందులో బాలికల కోసం 5 గురుకులాలు, బాలుర కోసం 5 గురుకులాలను 2026--27 విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించేలా చర్యలు చేపట్టారని తెలిపారు.బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న ఉద్దేశంతో ఎన్డీయే కూటమి ప్రభుత్వం మరో ముందడుగు వేసిందని కొనియాడారు. వడ్డెర సోదరులు వారి కుల వృత్తిని ఆధారంగా చేసుకొని జీవనోపాధి పొందేందుకు ప్రభుత్వ మైనింగ్ లీజులు ఇవ్వాల్సిందిగా యువగళం పాదయాత్ర సమయంలో వడ్డెర సోదరులు మంత్రి లోకేష్ కు విన్నవించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి లోకేష్ చొరవతో వడ్డెర సొసైటీలకు ప్రాధాన్యత కల్పిస్తూ క్వారీ లీజుల కేటాయింపు పై ప్రభుత్వం ఉత్తర్వులివ్వడం ద్వారా ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు లోకేష్ కు వడ్డెర సోదరులు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాకతో బీసీలకు మంచిరోజులు ప్రారంభమయ్యాయని, దానికి కొనసాగింపుగానే బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని తెలిపారు. అధికారంలోకి రాగానే స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, గీత కార్మికులకు మద్యంషాపులు, బార్లలో 10 శాతం మేర కేటాయింపు, వడ్డెరలకు క్వారీల కేటాయింపుల్లో 33 శాతం మేర రిజర్వేషన్లతో పాటు 50 శాతం మేర సినరేజీ ఫీజు, ప్రీమియంలో మినహాయింపు ఇచ్చిన ఘనత చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వానిది అని కొనియాడారు. చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు ఆర్థిక సాయం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచడం, మత్స్యకారుల వినతి మేరకు జీవో 217 రద్దు చేయడం జరిగింది. అలాగే నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ ను 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచడం, దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు గౌరవ వేతనం రూ.20 వేల నుంచి రూ.25 వేలకు పెంపుదల చేయడం జరిగిందని తెలిపారు. 93 వేల మంది నేతన్నలకు 200 యూనిట్లు,11 వేల మంది మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు.వాల్మీకి మహర్షి,వడ్డే ఓబన్న,మొల్ల, సర్దార్ గౌతు లచ్చన్న,భక్త కనకదాస జయంతులను రాష్ట్ర పండుగగా నిర్వహించామన్నారు. సుమారు రూ.1000 కోట్లతో ఆదరణ 3.0 పథకాన్ని అమలుకు సన్నాహాలు చేస్తూనే, ఆదరణ 3.0 పథకం కింద శాశ్వత ఉపాధి కల్పించనున్నారని, ఇందుకోసం ఆధునిక పరికరాలు అందజేయబోతున్నదని తెలిపారు. అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాముల స్మృతి వనం మాదిరిగా బీసీల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే స్మృతివనం కూడా ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు విశ్వబ్రాహ్మణ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ డా.జి.దశరథాచారి,వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు,తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ భాస్కర్ ముదిరాజ్,నాయకులు డి.వి.నారాయణ,వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# హంసవాహనంపై సరస్వతీ స్వరూపంలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి

## -అప్పలాయగుంట బ్రహ్మోత్సవాల్లో జ్ఞానభక్తి వైభవం





ప్రజా భూమి ప్రతినిధి వడమాల పేట
తిరుమల తిరుపతి అనుబంధ ఆలయమైన అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు రెండో రోజు శుక్రవారం రాత్రి అపూర్వ ఆధ్యాత్మిక శోభతో కొనసాగాయి. శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారు సరస్వతీ అలంకారంలో హంసవాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాలు, గోవింద నామస్మరణల మధ్య వాహనసేవ అత్యంత వైభవంగా సాగింది.

**వీణ ధరించి సరస్వతీ అలంకారంలో దివ్య దర్శనం**

వీణను ధరించి సరస్వతీ అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారు భక్తులను విశేషంగా అనుగ్రహించారు. హంస మంచి, చెడులను గుర్తించి మంచిదానినే స్వీకరించే జ్ఞానానికి ప్రతీక. సరస్వతీదేవి వాహనమైన హంసపై విహరించిన స్వామివారు భక్తులు నిర్మలమైన మనస్సుతో, మంచి ఆలోచనలతో జీవించాలని, అలాంటి వారి హృదయాల్లో తాను ఎల్లప్పుడూ కొలువై ఉంటాననే దివ్య సందేశాన్ని అందించారు.

భక్తి, సంగీతం, వేదఘోషల నడుమ దివ్యోత్సవం వేదఘోషలు, మంగళవాయిద్యాలు, భజన మండళ్ల గానామృతం, కోలాటాల మధ్య సాగిన హంసవాహన సేవ భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తింది. స్వామివారి దివ్యరూపాన్ని దర్శించిన భక్తులు గోవింద నామస్మరణతో మాడవీధులను మారుమోగించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శ్రీ హరీంద్రనాథ్, ఎస్.ఈ. నరసింహామూర్తి, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్లు శ్రీవాణి, సురేష్, టెంపుల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు, శ్రీవారి సేవకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# కూటమి లక్ష్యం "డ్రగ్స్-ఫ్రీ ఆంధ్ర"

## -ఏపీ మాదిగ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి



ప్రజాభూమి ప్రతినిధి,మంగళగిరి:
ఈరోజు మన కళ్లముందే యువతరం దారి తప్పి, చెడు మార్గాల్లో నడుస్తోందంటే దానికి ప్రధాన కారణం ఈ మాదకద్రవ్యాల వినియోగమేనని ఏపీ మాదిగ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా 5.6 శాతం మంది డ్రగ్స్ బారిన పడుతుంటే, మన భారతదేశంలో దాదాపు 190 మిలియన్ల (19 కోట్లు) ప్రజలు ఈ మత్తు కూపంలో కూరుకుపోయారు. ఒకప్పుడు బంగారు భవిష్యత్తు ఉన్న విద్యార్థులు, యువత ఈరోజు చదువులు వదిలేసి, ఉద్యోగాలు కోల్పోయి, కుటుంబాలను రోడ్డున పడేసి సమాజంలో నిర్భాగ్యులుగా మారుతున్నారు. మత్తుకు అలవాటు పడిన యువత, ఆ డ్రగ్స్ కొనడం కోసం డబ్బుల కొరతతో చివరకు దొంగతనాలు, దారుణమైన హత్యలు చేయడానికి కూడా వెనుకాడటం లేదు. మొదట యువతకు ఈ డ్రగ్స్ అలవాటు చేసి, ఆ తర్వాత వాళ్లనే బానిసలుగా మార్చి.. చివరకు వాళ్ల చేతే డ్రగ్స్ అమ్మించే ఒక ముఠా లాగా వాడుకుంటున్నారు. గంజాయి, కొకైన్, హెరాయిన్, ఓపియాయిడ్స్ వంటి నార్కోటిక్ డ్రగ్స్ వాడటం వల్ల మనుషుల సెంట్రల్ నెర్వస్ సిస్టమ్ తీవ్రంగా ప్రభావితం అవుతుంది. ఇవి తీసుకోగానే తాత్కాలికంగా బాధలు మర్చిపోయినట్లు అనిపించడం, ముఖం, మెడ ఎర్రబడటం సడన్‌గా బీపీ, హార్ట్ రేట్ పెరిగిపోవడం జరుగుతుంది. డిప్రెషన్‌లో ఉన్నవాళ్లు ఈ డ్రగ్స్ తీసుకోగానే థాట్ ప్రాసెసింగ్ మారిపోయి, లేనివి ఉన్నట్లు ఊహించుకునే వింత భ్రాంతి లోకి వెళ్తారు. ఒక రకమైన 'యూఫోరియా' లేదా స్వర్గంలో ఉన్నామనే వింత అనుభూతికి లోనై, దీనికి శాశ్వతంగా అడిక్ట్ అయిపోతున్నారు. దీని నుంచి బయటపడటం అంత సులువు కాదు. మేము 'డ్రగ్స్ వద్దు బ్రో' అని మొత్తుకుంటుంటే, గత వైసీపీ ప్రభుత్వం మాత్రం 'డ్రగ్స్ తీసుకో బ్రో' అన్నట్లు వింత పోకడలకు పోయింది. వైజాగ్ స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్, వైసీపీ కీలక నేత పులిగం కొండారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలు, స్కూళ్లు, ఉద్యోగులను టార్గెట్ చేసి డ్రగ్స్ అమ్మాడు. వైసీపీ పెద్దల పార్టీలకు డ్రగ్స్ సప్లై చేసి పదవులు పొందాడు. అడ్డంగా దొరికినా, ఈగల్ టీమ్ పట్టుకున్నా జగన్మోహన్ రెడ్డి గారు ఆ కొండారెడ్డిని నెత్తి మీద పెట్టుకున్నారు తప్ప కనీసం సస్పెండ్ కూడా చేయలేదు. యువత సర్వనాశనమైపోయినా పర్లేదు, తమ వాళ్లకు లాభం వస్తే చాలనే నిర్లక్ష్య వైఖరిని జగన్ గారు చూపించారు. గత ఐదు సంవత్సరాల తుగ్లక్ పాలనలో 'అన్నపూర్ణ'గా విరాజిల్లిన ఆంధ్రప్రదేశ్‌ను, గంజాయి ఆంధ్రప్రదేశ్'గా మార్చేశారు. దేశ రాజధాని ఢిల్లీని తలదన్నేలా మన రాష్ట్రాన్ని గంజాయికి దేశ రాజధానిగా మార్చి.. స్కూళ్లు, కాలేజీలు, చివరకు బడ్డీ కొట్లను కూడా వదలకుండా ఆన్‌లైన్ ద్వారా విదేశాలకు సైతం డ్రగ్స్ సరఫరా చేసి ఏరులై పారించారని మండిపడ్డారు.

ఈ మత్తు మహమ్మారి నుండి మన యువత భవితను, రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఒక పవిత్రమైన యుద్ధాన్ని ప్రారంభించింది. గంజాయి సాగు, అక్రమ రవాణాను మూలాల నుండి నిర్మూలించడానికి ప్రత్యేక మంత్రుల ఉపసంఘాన్ని ఏర్పాటు చేశాం. డ్రగ్స్ ముఠాల వేట కోసం ప్రత్యేకంగా 'నార్కోటిక్ పోలీస్ డిపార్ట్‌మెంట్'ను రంగంలోకి దించాం. వైజాగ్, పాడేరు, అమరావతి కేంద్రాలుగా స్టేట్ టాస్క్ ఫోర్స్ విభాగాలను నియమించడం జరిగింది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ప్రత్యేక 'ఈగల్ కమిటీలు' నిరంతరం నిఘా పెడుతుండగా, స్మగ్లర్లకు త్వరితగతిన శిక్షలు పడేలా 5 నగరాల్లో స్పెషల్ కోర్టులను ఏర్పాటు చేశాం. గంజాయి సాగుదారులు, స్మగ్లర్లు, వినియోగదారులు అనే తేడా లేకుండా ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 9,500 మందిని జైలుకు పంపాం. అత్యంత కఠినమైన చీణూా (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టెన్సెస్ యాక్ట్, 1985), ౹ా౫ు చట్టాల కింద 75 మంది అరెస్ట్ చేయడం జరిగింది. డ్రగ్స్ సరఫరా చేస్తున్న 17 మంది పెద్ద తిమింగలాల ఆర్థిక లావాదేవీలను బట్టబయలు చేసి, వారి ?10.5 కోట్ల విలువైన ఆస్తులను ప్రభుత్వం సీజ్ చేసింది. రాష్ట్రంలో గంజాయి నెట్‌వర్క్ ఉన్న 858 హాట్ స్పాట్స్‌ను గుర్తించి, అందులో 850 ప్రాంతాలకు సక్సెస్‌ఫుల్‌గా జియో ట్యాగింగ్ పూర్తి చేశాం. డ్రోన్ల సహాయంతో గంజాయి తోటలను గుర్తించి పెద్ద ఎత్తున ధ్వంసం చేస్తున్నాం. ఒడిస్సా సరిహద్దుల నుండి రాష్ట్రంలోకి ప్రవేశించే రైళ్లను వారానికి కనీసం మూడు సార్లు అడుగడుగునా తనిఖీలు చేస్తున్నాం. అల్లూరి సీతారామరాజు జిల్లా నుండి గంజాయి తరలిస్తున్న వందలాది వాహనాలను సరిహద్దుల్లోనే సీజ్ చేశాం. గంజాయి సాగు చేసే గిరిజనులను కేవలం శిక్షించడమే కాకుండా, 'పరివర్తన' అనే సంస్థ ద్వారా వారికి కౌన్సిలింగ్ ఇచ్చి, ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించేలా ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించింది. ఆపరేషన్ చైతన్యం' ద్వారా అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి సాగును పూర్తిగా నిలిపివేసి, ప్రత్యామ్నాయంగా సీతాఫలం, జీడిమామిడి, అవకాడో, డ్రాగన్ ఫ్రూట్స్ వంటి 4 లక్షల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశాం. దీని ద్వారా 325 గిరిజన కుటుంబాలు గంజాయి సాగుకు పూర్తిగా స్వస్తి చెప్పి, గౌరవప్రదమైన జీవన విధానంలోకి వచ్చాయి. గిరిజనుల ఆర్థిక ఇబ్బందులను తొలగించడానికి జాతీయ ఉపాధి హామీ పథకం కింద వారికి పుష్కలంగా పనిదినాలు కల్పించి ప్రభుత్వం అండగా నిలబడింది. యువతను, విద్యార్థులను టార్గెట్ చేస్తున్న మత్తు రాక్షసుడి నుండి క్యాంపస్‌లను రక్షించడానికి విద్యాశాఖ, పోలీస్ శాఖ సంయుక్తంగా కదలడం జరిగింది. రాష్ట్రంలోని 5,000 స్కూళ్లు మరియు కాలేజీలలో 40,000 కి పైగా 'ఈగల్ క్లబ్స్' ఏర్పాటు చేశాం. విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాలు, జీవితాలు ఎలా రోడ్డున పడతాయో వివరిస్తూ ఇప్పటివరకు 8,400 అవగాహన సదస్సులు నిర్వహించాం. ప్రతి విద్యాసంస్థను 'సేఫ్ క్యాంపస్ జోన్'గా మార్చి, విద్యార్థులలో చైతన్యం తెస్తూ.. "డ్రగ్స్ వద్దు బ్రో" అనే నినాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం. ఆపరేషన్ వజ్రప్రహార్ అనే ఈ స్పెషల్ డ్రైవ్ కింద ప్రభుత్వం ఏకంగా 800 సెర్చ్ ఆపరేషన్లు, దాదాపు 2 లక్షల తనిఖీలు నిర్వహించింది. దీని ద్వారా 67 కేజీల గంజాయి, 10 కేజీల గంజాయి విత్తనాలతో పాటు అక్రమ రవాణాకు వాడుతున్న 10,000 వాహనాలను సీజ్ చేసి స్మగ్లర్ల నడుం విరిచింది. ఆపరేషన్ గరుడ (మెడికల్ షాపులపై నిఘా) చాలామంది మెడికల్ షాపుల్లో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా దొరికే ఓపియాడ్ డ్రగ్స్ కు అలవాటు పడుతున్నారు. కేవలం డబ్బు కక్కుర్తితో, నిబంధనలకు విరుద్ధంగా ఇలాంటి మత్తు మందులు అమ్మే ఫార్మాసిస్టులు, మెడికల్ షాపుల లైసెన్సులను పూర్తిగా రద్దు చేయడమే ఈ 'ఆపరేషన్ గరుడ' ముఖ్య ఉద్దేశం. నార్కోటిక్ పోలీస్ డిపార్ట్‌మెంట్, రైల్వే శాఖ సంయుక్తంగా డ్రోన్ టెక్నాలజీని వాడుతూ గంజాయి రవాణాపై డేగ కన్ను వేసింది. ఈ తనిఖీల్లో 54 మంది ముఠా సభ్యులను పట్టుకొని, వారి నుండి 367 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. పోలీసుల కళ్లుకప్పడానికి సరికొత్తగా తెచ్చిన 2,500 గంజాయి చాక్లెట్లను సైతం పట్టుకోవడం నిజంగా అభినందనీయం. డ్రగ్స్ హఠాత్తుగా ఆపేస్తే చేతులు వణకడం (ౡతీవఎశతీం), కళ్లు తిరగడం, గ్లూకోజ్ లెవెల్స్ పడిపోవడం, బీపీ-హార్ట్ రేట్ పడిపోవడం లాంటి విత్‌డ్రాయల్ సింప్టమ్స్ వస్తాయని, అందుకే దీనికి శాస్త్రీయమైన చికిత్స అవసరమని ఆమె చెప్పారు. మత్తు నుండి విముక్తి పొందాలనుకునే వారి కోసం రాష్ట్రవ్యాప్తంగా 56 డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. బాధితుడు, వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో చేర్చుకునేందుకు 3 అంతర్జాతీయ స్థాయి పునరావాస కేంద్రాలను నిర్మించాం. ఇక్కడ సైకియాట్రిస్టుల పర్యవేక్షణలో, ఇన్నోవేటివ్ మెడిసిన్స్, కౌన్సిలింగ్ ద్వారా క్రమక్రమంగా వ్యసనాన్ని దూరం చేస్తారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022 నుండి దాదాపు 10 నుండి 15 ఎకరాల విస్తీర్ణంలో గంజాయి సాగును ఇబ్బడిముబ్బడిగా పెంచేశారు. కాలేజీలు, స్కూళ్లు మాత్రమే కాదు... చివరకు పార్టీలు, పబ్బులు, పెళ్ళిళ్లు అనే తేడా లేకుండా ప్రతిచోటా గంజాయిని ఏరులై పారించారు. ఆ నల్లటి రోజులను, ఆ గంజాయి తోటలను ఇప్పుడు మన కూటమి ప్రభుత్వం పూర్తిగా ధ్వంసం చేస్తూ వస్తోంది. మత్తు మహమ్మారిపై సాగుతున్న ఈ యుద్ధం కేవలం ఒక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిదో, మంత్రి లోకేష్ గారిదో, లేదా ఎవరో ఒక సెలబ్రిటీదో కాదు. ఇది మీ పోరాటం... నా పోరాటం... మనందరి పోరాటం! రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ నడుం బిగిస్తేనే మన ఆంధ్రప్రదేశ్‌ను ఈ గంజాయి మత్తు నుండి పూర్తిగా బయటపడేయగలం. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో 'గంజాయి' అనే మాటే ఎక్కడా వినపడకూడదు. రాజకీయ ముసుగు వేసుకుని, వెనకపెద్దల అండ చూసుకుని ఈ మత్తు దందాలు చేస్తామంటే కూటమి ప్రభుత్వంలో సాగదు. ఎంతటి వాడైనా సరే... ఆ మత్తుగాడిని, వాడి వెనకున్న ముఠాను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. కుకటివేళ్లతో సహా పెకిలించి జైల్లో పెడతాం. గంజాయి అనే మాటే ఆంధ్రప్రదేశ్‌లో వినపడకూడదు. ఎవరైనా వ్యసనం నుండి బయటపడాలన్నా, లేదా మీ ప్రాంతంలో గంజాయి అమ్మే వారి సమాచారం అందించాలన్నా ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ 1972, 8977781972 వాట్సాప్ నెంబర్లకు సంప్రదించాలని ఆమె పిలుపునిచ్చారు.

గత ఐదేళ్ల వైసీపీ తుగ్లక్ పాలనలో గంజాయికి కేరాఫ్ అడ్రస్‌గా మారి, పూర్తిగా దోపిడీకి గురైన ఉత్తరాంధ్రాను నేడు కూటమి ప్రభుత్వం దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన పెట్టుబడుల రాజధానిగా మారుస్తోందని ఉండవల్లి శ్రీదేవి కొనియాడారు. మూడు రాజధానుల ముసుగులో ఉత్తరాంధ్రాలో గత పాలకులు చేసిన రియల్ ఎస్టేట్ దందాలను, దోపిడీని ఆమె తీవ్రంగా ఎండగట్టారు. ప్రకృతి రమణీయతకు నిలయమైన విశాఖ రుషికొండను గత పాలకులు బోడిగుండు కొట్టించి, ఏకంగా ?500 కోట్ల ప్రజాధనాన్ని తమ విలాసాల కోసం బూడిదలో పోసిన పన్నీరులా వృధా చేశారు. ఉత్తరాంధ్ర ప్రజల సెంటిమెంట్ అయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడటం చేతకాని గత ప్రభుత్వం, దానికి సంబంధించిన వేలాది ఎకరాల విలువైన భూములను ఏ విధంగా కొట్టేయాలో అని ఇష్టమొచ్చినట్లు స్కెచ్‌లు వేసింది. వైజాగ్ ఐటీ సెజ్ నుండి ఏకంగా 14 ప్రముఖ ఐటీ కంపెనీలను భయపెట్టి పంపించేసి, ఉత్తరాంధ్ర యువత ఉద్యోగ అవకాశాలను దెబ్బతీశారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ విస్తీర్ణాన్ని కావాలనే 500 ఎకరాలు తగ్గించి, ఆ భూముల్లో వైసీపీ పెద్దలు ఏ రకంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలనుకున్నారో ఇక్కడి ప్రజలందరికీ బాగా తెలుసు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారంతా కలిసి మన ఏపీని డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఉండవల్లి శ్రీదేవి అన్నారు.

# 17న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ-ఆహ్వాన పత్రికల విడుదల



ప్రజాభూమి, హిందూపురం టౌన్
హిందూ సామ్రాజ్య స్థాపకులు, ధర్మ పరిరక్షకులు, పరాక్రమానికి ప్రతీకగా నిలిచిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ జూలై 17వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కార్యాలయంలో విడుదల చేశారు. ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, నియోజకవర్గ సమన్వయకర్త పావులూరి శ్రీనివాసరావు తదితరులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. అనంతరం వారి చేతుల మీదుగా ఆహ్వాన పత్రికలను అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ మహారాజ్ భారత చరిత్రలో చిరస్మరణీయ మహానాయకుడని కొనియాడారు. దేశభక్తి, ధైర్యసాహసాలు, స్వరాజ్య సాధన కోసం చేసిన పోరాటం నేటి యువతకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. అలాంటి మహనీయుని విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. నిర్వాహకులు మాట్లాడుతూ, జూలై 17న జరిగే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, వివిధ సామాజిక, సాంస్కృతిక, హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు, శివాజీ మహారాజ్ అభిమానులు, యువత, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ మహోత్సవం ద్వారా ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయాలు, దేశభక్తి, స్వాభిమానం, ధర్మ పరిరక్షణ వంటి విలువలను భావితరాలకు చాటిచెప్పే అవకాశం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఆదర్శ్ కుమార్, జనసేన ఇంచార్జ్ ఉమేష్ , టీడీపీ లీగల్ సెల్ శివ శంకర్, టీడీపీ నాయకులు చంద్రమోహన్, ప్రణయ్ సిండే, గణేష్ , రాహుల్ , చరణ్ , బాలాజీ, శివాజీ సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# 20 ఏళ్ల సమస్యకు పరిష్కారం దొరికింది

## -చిల్లకూరు మణి, భాస్కర్ ముదిరాజ్

ప్రజాభూమి ప్రతినిధి: తొట్టంబేడు



తొట్టంబేడు గ్రామ హరిజనవాడ ప్రజలకు ఎట్టకేలకు ఊరట. ఇళ్లపై నుంచి వెళ్తున్న 11 కెవి విద్యుత్ లైన్ వల్ల 20 ఏళ్లుగా ప్రమాద భయంతో బతుకుతున్నారు. గతంలో ఈ లైన్ కారణంగా ప్రాణనష్టం కూడా జరిగింది. ఇళ్లపై నుంచి వెళుతున్న 11 కెవి లైన్ చాలా ప్రమాదకరంగా మారింది. తొలగించాలని స్థానికులు ఎప్పటినుంచో విన్నవిస్తున్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చొరవ తీసుకున్నారు. అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.శనివారం విద్యుత్ శాఖ అధికారులు జెసిబి, ట్రాక్టర్ సహాయంతో ఆ ప్రమాదకర లైన్‌ను పూర్తిగా తొలగించారు.మండల పార్టీ అధ్యక్షుడు రావెళ్ల మునిరాజు నాయుడు, ప్రధాన కార్యదర్శి చిల్లకూరు మనీతో పాటు తంగెళ్లపాలెం సింగిల్ విండో సహకార బ్యాంకు చైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, చందు, తదితర నాయకులు, అధికారులు పనులను దగ్గరుండి పర్యవేక్షించారు.20 ఏళ్ల నిరీక్షణకు తెరపడడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని, ఇకపై విద్యుత్ ప్రమాద భయం తప్పిందని ఆనందం వ్యక్తం చేశారు.

# రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణ ఆపాల్సిందే

## : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి,నెల్లూరు:
దాదాపు పూర్తయిన రామాయపట్నం పోర్టును డిజైన్ బిల్డ్ ఫైనాన్స్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్ఓటీ) విధానం కింద ప్రైవేటుపరం చేసే నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తక్షణం వెనక్కి తీసుకోవాలని నెల్లూరు జిల్లా వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి డిమాడ్ చేశారు. నెల్లూరులోని పార్టీ కార్యాయలంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సమీకరిస్తూ 2024 ఫిబ్రవరిలోనే గత వైయస్సార్‌సీపీ ప్రభుత్వం జీవో నెంబర్ 6ని రిలీజ్ చేసినట్టు వివరించారు. మొత్తం ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 4,929 కోట్లు అసవరం కాగా, అందులో రూ. 3928 కోట్లు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా సమీకరించుకునేలా వెసులుబాటు కల్పించామని చెబుతూ రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ. 991 కోట్లు మాత్రమే వెచ్చించాల్సి ఉంటుందని వివరించారు. ఆ డబ్బు కూడా రాష్ట్ర ప్రభుత్వం పెట్టలేకపోతుందా అని ప్రశ్నించారు. గడిచిన రెండేళ్లలో రామాయపట్నం పోర్టు కోసం ఎంత నిధులు ఖర్చు చేశారు? ఎంత పనులు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. డీబీఎఫ్ఓటీ కింద పోర్టు దక్కించుకున్న సంస్థకు ఏయే నిబంధనలు విధించారు? ఎన్ని ఉద్యోగాలిస్తారు? మత్స్యకారులు, తీరప్రాంత ప్రజల ప్రయోజనాలు కాపడటానికి ఏం చర్యలు తీసుకున్నారో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఏయే షరతులతో ప?రైవేటుపరం చేస్తున్నారు? దాని వల్ల వల్ల ప్రభుత్వానికి వచ్చే ప్రయోజనం ఏంటి? గత వైయస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పూర్తి చేయడం వల్ల జరిగే నష్టం ఏంటి? తదితర ప్రశ్నలన్నింటికీ ముందుగా ప్రభుత్వం సమాధానం చెప్పి తీరాల్సిందేని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ చేసే ముందు ప్రజాభిప్రాయ సేకరణ చేశారా అని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణం వెనక్కి తీసుకోకపోతే మత్స్యకారులు, తీర ప్రాంత ప్రజల తరఫున వైయస్సార్‌సీపీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి హెచ్చరించారు. అంతేకానీ ప్రజల ప్రయోజనాలు పట్టించుకోవడం లేదు. బందరు పోర్టు నిర్మాణం విషయమే చూస్తే కాంట్రాక్టు విలువ భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. గతేడాది మార్చిలో రూ. 402 కోట్లకు పనులు కేటాయిస్తే, ఇప్పుడు మళ్లీ మరో రూ. 390 కోట్ల పనులు అప్పగిస్తూ కాంట్రాక్టు సంస్థకు నజరానా ప్రకటించారు. వైయస్సార్‌సీపీ హయాంలో తొలిదశలోనే రూ. 2,113 కోట్లతో 5 ఫిషింగ్ హార్బర్‌లు నిర్మాణం చేయాలని ప్రతిపాదనలు చేస్తే, కూటమి ప్రభుత్వం వాటిని 4కి కుదించింది. ప్రాజెక్టు వ్యయం కూడా రూ. 632 కోట్లకు తగ్గించింది. బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్‌ను ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌గా మార్చేసిం మత్స్యకారుల ఆశల మీద నీళ్లు చల్లుతున్నారు. ఫిషింగ్ హార్బర్‌లను నౌకా కేంద్రాలుగా మార్చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గకపోతే ప్రజలు, మత్స్యకారులతో కలిసి తీర ప్రాంత ప్రజల ప్రయోజనాల కోసం పెద్ద ఎత్తున వైయస్సార్‌సీపీ ఉద్యమిస్తుందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి హెచ్చరించారు.

# ప్రజాభూమి

జనరల్

శనివారం, జూన్ 27, 2026






## మార్కాపురం జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన

### వెలిగొండ ప్రాజెక్టు పరిశీలన... లబ్ధిదారులతో భేటీ
### గిద్దలూరులో సంజీవని కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:-

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లాలో పర్యటించనున్నారు. ఒకే రోజున యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. జూలై నెలకు మొదటి ఫేజ్ పూర్తి చేయాలనే లక్ష్యంతో శరవేగంగా సాగుతోన్న వెలిగొండ ప్రాజెక్టు పనుల పరిశీలనతో పాటు గిద్దలూరు నియోజకవర్గంలో సంజీవని కార్యక్రమంలో పాల్గొంటారు.

**వెలిగొండ లబ్ధిదారులతో సమావేశం**

మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు వెలిగొండ ప్రాజెక్టు ఎంతో కీలకం. ఇది పూర్తైతే 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 జిల్లాల్లోని 30 మండలాల్లో 15.25 లక్షల మందికి తాగునీటి కష్టాలు తీరతాయి. అంతేకాదు దశాబ్దాలుగా నెలకొన్న ఫ్లోరైడ్ సమస్యకూ ముగింపు పలుకుతుంది. రెండు దశలుగా సాగుతోన్న ఈ ప్రాజెక్టులో.... స్టేజ్–Iలో 1,19,000 ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు, స్టేజ్–IIలో 3,28,300 ఎకరాలకు సాగునీరు, 11.25 లక్షల మందికి తాగునీరు అందుతుంది. స్టేజ్–I కోసం ఇప్పటికే ప్రభుత్వం రూ.5,000 కోట్లకు పైగా ఖర్చు చేసింది. దాదాపు 19 కి.మీ. మేర టన్నెల్–I తవ్వకం, ఎగ్జిట్ ఛానల్ & లింక్ ఛానల్ పనులు పూర్తయ్యాయి. ఫీడర్ కాలువ, తీగలేరు, గొట్టిపడియ ప్రధాన కాలువ సిద్ధమయ్యాయి. రెండు హెడ్ రెగ్యులేటర్లు, టన్నెల్ లైనింగ్, అప్రోచ్ ఛానల్, తూర్పు ప్రధాన కాలువ పనులు చివరి దశకు వచ్చాయి. ఆర్ అండ్ ఆర్ కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.190 కోట్లను ఖర్చు చేసింది. మొత్తం 11 గ్రామాల్లోని నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయి. ఈ మేరకు రేపు ప్రాజెక్టును సందర్శించిన అనంతరం లబ్ధిదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అవుతారు.


**సంజీవనితో మెరుగైన సేవలు**

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ప్రభుత్వం సంజీవని ప్రాజెక్ట్ తీసుకొచ్చింది. అందరికీ ఆరోగ్య సేవలు, ఆరోగ్య భద్రత చేకూర్చాలన్నది ఈ కార్యక్రమం లక్ష్యం. నాణ్యమైన, అందుబాటు ధరల్లో, సకాలంలో వైద్య సేవలు అందించే సమగ్ర డిజిటల్ ఆరోగ్య వేదిక ఈ సంజీవని. పీహెచ్‌సీల నుంచి జిల్లా ఆసుపత్రి వరకు, ఆరోగ్య ఉప కేంద్రం నుంచి సూపర్ స్పెషాలిటీ సేవల వరకు మొత్తం ఆరోగ్య వ్యవస్థను ఒకే డిజిటల్ వేదికపై అనుసంధానం చేయనున్నారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్, మాతృ-శిశు ఆరోగ్య సేవలు, 108 ఎమర్జెన్సీ, 104 మొబైల్ మెడికల్ యూనిట్లు, ఈ-ఔషధి వంటి అన్నింటినీ ఒకే డిజిటల్ ప్లాట్‌ఫామ్ కిందకు తెస్తోంది. గతేడాది జూలై 3న కుప్పంలో, ఈ ఏడాది మార్చి 15న చిత్తూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా 'సంజీవని' ప్రభుత్వం ప్రారంభించింది. దీనిలో గొప్ప ఫలితాలు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి అమలు చేయనుంది. సంజీవని ద్వారా డాక్టర్‌తో అపాయింట్మెంట్ బుక్ చేసుకునే సదుపాయం, వైద్యం తర్వాత డాక్టర్ స్వయంగా ఆరోగ్యంపై ఫాలోఅప్ చేయడం, వర్చువల్ కనెక్ట్ ద్వారా ఎక్స్‌పర్ట్స్ ఉన్న ప్రాంతం నుంచి కూడా వైద్యం అందించడం, సంజీవని కార్డు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డ్స్ మోనిటర్ చేయడం, సంజీవని వెల్‌నెస్ యాప్ ద్వారా మీ ఆరోగ్య సూచనలు పొందవచ్చు. డిజిటల్ హెల్త్ రికార్డ్స్‌తో ఒక ఏఐ డాక్టర్‌ను ఇవ్వడమే సంజీవని ముఖ్య ఉద్దేశం

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

ఉదయం 10:45 గంటలకు దోర్నాల మండలం, గంటవానిపల్లెకు చేరుకుంటారు. 11 నుంచి మధ్యాహ్నం 12:20 గంటల వరకూ వెలిగొండ ప్రాజెక్టు సందర్శనతో పాటు, అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం లబ్ధిదారులతో ముఖాముఖి అవుతారు. వెలిగొండ ప్రాజెక్టు పర్యటన ముగించుకుని 12:35 గిద్దలూరు నియోజకవర్గం కృష్ణంసెట్టిపల్లికి బయలుదేరుతారు. మధ్యాహ్నం 01.10 నుంచి 01.40 వరకు కృష్ణంసెట్టిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంజీవని పథకం లబ్ధిదారులు, వైద్య సిబ్బందితో సమావేశం అవుతారు. 01:45 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. 03.35 గంటలకు టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 06.15 గంటలకు అమరావతి చేరుకుంటారు.

## అనారోగ్యంతో ఉన్న దాసరి నారాయణ రెడ్డిని పరామర్శించిన డీవీ శశికాంత్ రెడ్డి



ప్రజాభూమి తొండూరు అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న దాసరి నారాయణ రెడ్డిని వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు డీవీ శశికాంత్ రెడ్డి శుక్రవారం దినేష్ నర్సింగ్ హోమ్ (గంగిరెడ్డి హాస్పిటల్)లో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని, అందుతున్న వైద్య సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డీవీ శశికాంత్ రెడ్డి మాట్లాడుతూ, దాసరి నారాయణ రెడ్డి త్వరగా కోలుకుని మునుపటిలాగే ప్రజల మధ్య చురుకుగా ఉండాలని ఆకాంక్షించారు. అవసరమైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించడంతో పాటు, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, అవసరమైన సహాయం అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని భరోసా ఇచ్చారు.దాసరి నారాయణ రెడ్డి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ ఆయన త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శతో కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. డీవీ శశికాంత్ రెడ్డి చేసిన పరామర్శ మానవత్వానికి నిదర్శనంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.



### గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పాత్ర కీలకం



**మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, కైకలూరు నియోజకవర్గం శాసనసభ్యుడు కామినేని శ్రీనివాసరావుతో కలసి పిహెచ్సి ప్రారంభోత్సవం చేసిన మాజీ ఉపరాష్ట్రపతి**



ఆత్కూరులో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన





ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా గ్రామీణ ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించడంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పాత్ర అత్యంత కీలకమని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు.గన్నవరం నియోజకవర్గంలోని ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలో రూ. 1.54 కోట్ల ప్రభుత్వ, సిఎస్ఆర్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్) నిధులతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, కైకలూరు నియోజకవర్గం శాసనసభ్యుడు కామినేని శ్రీనివాసరావుతో కలసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసూతి సేవలు, శిశు సంరక్షణ, రోగ నిరోధక టీకాలు, అత్యవసర వైద్య సేవలు, ప్రాథమిక చికిత్స, అవసరమైన ల్యాబొరేటరీలు, ఆధునిక వైద్య పరికరాలు, మందులు వంటి అన్ని సౌకర్యాలు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య సమస్యలను వెంటనే గుర్తించి అవసరమైతే ఉన్నత వైద్య కేంద్రాలకు రోగులను పంపించేలా ఆరోగ్య కేంద్రాలు పనిచేయాలని చెప్పారు.గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, కూలీలు, పేదలు, ఇతర వృత్తులపై ఆధారపడిన ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం కూడా ఆరోగ్య కేంద్రాల ప్రధాన బాధ్యతగా ఉండాలని మాజీ ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న అనేక వ్యాధులకు ప్రధాన కారణం మారుతున్న జీవనశైలేనని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.పూర్వం ప్రజలు ఉదయాన్నే లేచి శారీరక శ్రమతో కూడిన జీవనం గడిపేవారని, ప్రకృతిని ఆరాధిస్తూ చెట్లు, చెరువులు, నీటి వనరులను సంరక్షించేవారని గుర్తు చేశారు. ప్రకృతికి దగ్గరగా ఉండే జీవన విధానం వల్ల ఆరోగ్య సమస్యలు తక్కువగా ఉండేవని, నేటి తరానికి కూడా అలాంటి ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరమని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, చెట్ల సంరక్షణ, నీటి వనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. దేశంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన పాలన అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తగిన నిధులు కేటాయిస్తోందని అన్నారు. ప్రజలకు ఉచిత పథకాల కంటే గ్రామాల్లో రహదారులు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, నిరంతర విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సుమారు 800 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్న రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను అభినందించారు. ఆధునిక సౌకర్యాలతో ప్రారంభమైన ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా ఆత్కూరు గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి ద్వివేది, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ యుగంధర్, ఆర్ అండ్ బి ఈఈ లోకేశ్వరరావు, ఉంగుటూరు ఎంపీడీవో సత్యకుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జితేంద్ర, గన్నవరం నియోజకవర్గ ప్రత్యేక అధికారి షేక్ షాహిద్ బాబు, గ్రామ పెద్ద అడుసుమిల్లి రామబ్రహ్మం, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## డ్రగ్స్ మాఫియాపై డేగ కన్ను..

**మాదకద్రవ్యాలు వ్యక్తి, కుటుంబం, సమాజాన్ని చిన్నాభిన్నం చేస్తాయి**
**యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి**
**డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి**
**దేశానికే ఆదర్శంగా విప్లవాత్మక ఈగల్ ఏపీ**
**జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**





ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ: మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబాలను, సమాజాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో ఏర్పాటు చేసిన "ఈగల్ ఏపీ" దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు.అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి (ఓల్డ్ జీజీహెచ్) వద్ద రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఈగల్ ఏపీ, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, వాకథాన్ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాల్గొన్న వారందరూ "డ్రగ్స్ వద్దు బ్రో" అంటూ నినాదాలు చేస్తూ, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం చేస్తున్న పోరాటంలో భాగస్వాములు అవుతామని ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం "ఈగల్ ఏపీ" ద్వారా మాదక ద్రవ్యాల సరఫరా, రవాణా, విక్రయాలపై డేగ కళ్లతో నిఘా ఉంచుతూ మాఫియాపై కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాడిని చేరుకునేందుకు దృష్టి సారించాలని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల ఆర్థిక, సామాజిక, ఆరోగ్య పరమైన తీవ్ర దుష్పరిణామాలు తలెత్తుతాయని పేర్కొన్నారు. డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. యువత పెడదారి పట్టకుండా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యక్రమాలకు స్వచ్ఛంద సంస్థలు కూడా సహకరిస్తున్నాయని, "నషా ముక్త్ భారత్ అభియాన్"లో భాగస్వాములవుతున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈగల్ ఏపీ ఐజీ రవికృష్ణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 40 వేలకుపైగా ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఆపరేషన్ చైతన్య ద్వారా రాష్ట్రంలో 'జీరో గంజాయి సాగు' లక్ష్యాన్ని సాధించామని పేర్కొన్నారు. తమ ప్రాంతాల్లో గంజాయి లేదా మాదకద్రవ్యాల కార్యకలాపాలు గుర్తిస్తే ప్రజలు 1972 ఈగల్ నంబర్ కు సమాచారం అందించాలని కోరారు. డ్రోన్ నిఘా ద్వారా హాట్‌స్పాట్ ప్రాంతాల్లో మంచి ఫలితాలు సాధించినట్లు వెల్లడించారు. ఈగల్ ఏపీ కార్యక్రమానికి సహకరిస్తున్న ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ యూనిట్ చైర్మన్ డా. జి.సమరం, జిల్లా యువజన సంక్షేమ అధికారి డాక్టర్ కొల్లేటి రమేష్, ఎన్ఎస్ఎస్, ఎన్ సీ సీ అధికారులు, విద్యార్థులు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## 75.12 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ



**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ: ప్రజాస్వామ్య వ్యవస్థ స్ఫూర్తికి అనుగుణంగా జిల్లాలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను నిష్పక్షపాతంగా, సజావుగా జరుగుతోందని.. ఇంటింటి సర్వేలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.జిల్లాలో సుశిక్షితులైన 1,792 మంది బీఎల్‌వోలు ఉన్నారని.. వీరిద్వారా ఇంటింటిని సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తున్నట్లు, నింపిన ఫారాలను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 12,87,186 (75.12 శాతం) ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడం జరిగిందన్నారు. తిరువూరులో 1,91,891 (91.94 శాతం), విజయవాడ పశ్చిమ 1,64,660 (64.08 శాతం), విజయవాడ సెంట్రల్ 1,61,219 (58.03 శాతం), విజయవాడ తూర్పు 1,52,136 (56.4 శాతం), మైలవరం 2,33,979 (82.05 శాతం), నందిగామ 1,92,895 (92.97 శాతం), జగ్గయ్యపేట 1,90,406 (91.74 శాతం) మేర ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు వివరించారు. అదేవిధంగా జిల్లా మొత్తంమీద 1,39,977 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయినట్లు తెలిపారు. బీఎల్‌వోలు, అధికారులు ఈసీఐ నియమనిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించాలని, ఎలాంటి ప్రభావాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా నిబద్ధతతో సర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. అర్హులను ఓటరు జాబితాలో ఉండేలా చేయడంతోపాటు అనర్హులు, మృతులు, శాశ్వతంగా వలసవెళ్లిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉండటం వంటి వారి ఓట్లను తొలగించి స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా లక్ష్యంగా చేపట్టిన ఈ సర్ ప్రక్రియలో ప్రజలు చైతన్యవంతంగా పాల్గొనాలని.. ఎన్యూమరేషన్ ఫారాలను నింపి సంబంధిత బూత్‌స్థాయి అధికారులకు త్వరితగతిన అందజేసి, ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at Y.S.R. and published at D.No.30-251, WARD NO.4, BUDDAYAPALLE VILLAGE, CHINNACHOWK editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1220.cell:9502116677.

# అంతుపట్టని పవన్ కళ్యాణ్ అంతర్గత వ్యూహం

- 15 సంవత్సరాలు గడువు రహస్య ఒప్పందమా
- జాతీయ రాజకీయాల్లో పాల్గొనడంపైనా చర్చ
- మింగుడు పడని లోకేష్ సీఎం నినాదం
- 100 సీట్లు కోసం కాపు సంఘాల అల్టిమేటంకు సన్నద్ధం ?



**ప్రజాభూమి ప్రతినిధి - పాలకొల్లు**

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భవిష్యత్తు అంతర్గత వ్యూహం అంతు పట్ట లేకుండా ఉంది. ఏపీ రాష్ట్రంలో 2024 కు ముందు ప్రజా వ్యతిరేక ప్రభుత్వం వైసీపీ అని, ప్రజలు ఇబ్బందులుకు గురవుతున్నారని తాను సీఎం అవ్వడం ప్రధానం కాదని ప్రజలను వైసిపి ప్రభుత్వం నుంచి రక్షించడానికి కూటమి ప్రభుత్వంలో చేరానని పవన్ కళ్యాణ్ చెప్పిన, చెబుతున్న విషయం విదితమే. అయితే పవన్ కళ్యాణ్ అసలు భవిష్యత్ అంతర్గత ప్రణాళిక ఏంటనేది తెలియకపోవడంతో అటు కాపు సంఘాల నేతలు, ఇటు జనసేన శ్రేణులు డోలయనంలో కొట్టుమిట్టాడుతున్నాయి. పవన్ కళ్యాణ్ భవిష్యత్తు ప్రణాళిక చిదంబర రహస్యం తెలియకపోవడంతో ఈ రెండు వర్గాలు తలలు పట్టుకునే పరిస్థితి నెలకొంది. వారే కాకుండా టిడిపి, బిజెపి శ్రేణులు కూడా అంతర్మాదనం లో పడ్డాయని సమాచారం.

**15 సంవత్సరాలు గడువు ఇద్దరి మధ్య రహస్య ఒప్పందమా**

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రతిసారి సీఎంగా చంద్రబాబు 15 సంవత్సరాల పాటు ఉండాలని చెబుతుండడంతో కాపు సంఘాలు, జన సేన శ్రేణులు లో తీవ్ర చర్చ నీయాంశంగా మారింది. 15 సంవత్సరాల తర్వాత పవన్ కళ్యాణ్‌కి సీఎంగా అవకాశం కల్పిస్తానని వారిద్దరి మధ్య జరిగిన ఒప్పందమా? ఏమిటి అనేది కాపు సంఘాలు నేతలు, జనసేన శ్రేణులు తీవ్ర చర్చకు వేసినట్లు తెలిసింది. అందుకే ప్రతిసారి 15 సంవత్సరాలు అనే మాట పవన్ కళ్యాణ్ అంటున్నారు ఏమోనని అనుమానాలు ఉన్నాయని పలువురు అంటున్నారు.

**జాతీయ, రాజకీయాల్లో పాల్గొనడం పైన చర్చ**

పవన్ కళ్యాణ్ ఇటీవల కాలంలో జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పడంపై కూడా కాపు సంఘాలు జనసేన శ్రేణులులో చర్చకు తెరలేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అమిత్ షా స్థాయి నేతలతో నిత్యం టచ్ లో ఉండడం కూడా మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. పవన్ కళ్యాణ్ జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి కేంద్ర మంత్రి గా అయి పోతారా లేదా రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటారా అనేది కూడా కాపు, జనసేన శ్రేణులు మధ్య సంఘాలు చర్చకి తెరలేసినట్టు సమాచారం.

**మింగుడు పడని లోకేష్ సీఎం నినాదం**

టిడిపి వర్గాల్లో పలువురు అత్యుత్సాహకులు నెక్స్ట్ సీఎం లోకేష్ అని పదేపదే ప్రకటించడంతో ఏపీ లోని కాపు సంఘ నేతలు, జనసేన శ్రేణులుకు మింగుడు పడని పరిస్థితి నెలకొంది. జైల్లో ఉన్న చంద్రబాబును తీసుకొచ్చి సీఎం అవ్వడానికి కారకుడైన పవన్ కళ్యాణ్ కి నెక్స్ట్ సీఎం అవకాశం ఇస్తారా, లేక లోకేష్ కి ఇస్తారా అంటూ కాపు సంఘాలు, జనసేన శ్రేణులు మండిపడుతున్నట్లు సమాచారం. సీఎం తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కాబట్టి పవన్ కి ఇచ్చిన తర్వాత లోకేష్ కి ఇవ్వాలి కానీ ముందే లోకేష్ కి ఇవ్వాలని కోరడమేమిటిని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

**100 సీట్లు కోసం వత్తిడి కై సిద్ధం**

రాబోయే 2029 ఎన్నికల్లో 100 సీట్లు కూటమి పార్టీ నుండి జనసేన పార్టీ కి తీసుకునే విధంగా పవన్ కళ్యాణ్ పై తీవ్ర ఒత్తిడి తెచ్చేందుకు కాపు సంఘాల ప్రతినిధులు, జనసేన శ్రేణులు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇలా చేస్తే తమిళనాడులో విజయ్ సాధించిన విజయం మాదిరిగా పవన్ కళ్యాణ్ సీఎం అవ్వడానికి ఉంటాయని దీనికోసం ఆరు నూరైనా కూటమి పార్టీని ఒప్పించాలని ఈ రెండు వర్గాలు అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయానికి పవన్ కళ్యాణ్ ఒప్పుకోకపోతే అవసరమైతే పవన్ కళ్యాణ్ తో తెగతెంపులు చేసుకోవడానికైనా వెనుకాడబోమని ఈసారి పవన్ కళ్యాణ్ కు చెప్పాలని యోచనలో కాపు సంఘాలు నేతలు, జనసేన శ్రేణులు గట్టిగా నిర్ణయించుకున్నట్లు సమాచారం. అయితే భవిష్యత్తులో రాజకీయ సమీకరణలు ఎలా మారతాయి అనేది వేచి చూడాల్సిందే మరి.

# భస్మీపటలం -ఉలిక్కిపడ్డ ద్రాక్షారామం

- ద్రాక్షారామం సంత మార్కెట్లో బారి అగ్నిప్రమాదం
- 48 దుకాణాలు అగ్నికి ఆహుతి బారీగా ఆస్తి నష్టం
- అదర్యపడొద్దు బాధితులను ఆదుకుంటాం : మంత్రి సుభాష్
- ప్రభుత్వ, స్వచ్ఛందం సంస్థలు సహకారంతో నష్టాన్ని బర్తీ చేస్తాం



**ప్రజాభూమి ప్రతినిధి - రామచంద్రపురం**

ఒక్కసారిగా భారీ ఎత్తున ఎగసిపడిన అగ్ని జ్వాలలు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో ద్రాక్షారామం ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. ఆపై సుమారు 48 వివిద రకాల షాపులు కొద్ది నిమిషాల వ్యవధిలోనే అగ్నికి ఆహుతి భస్మీ పటలమై బూడిద మాత్రం మిగిలింది. ఇది అంతా గురువారం రాత్రి 12 గంటల సమయంలో జరిగిపోయింది. దీంతో బాధితుల ఆవేదనకు అంతు లేని పరిస్థితి నెలకొంది. ఈమేరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్ర పురం నియోజకవర్గం ద్రాక్షారామంలో గల సంత మార్కెట్ లో బారి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న మంత్రి సుభాష్ హుటా హుటిన సంఘటనా స్థలానికి చేరుకునిపరిస్థితిని గమనించి దిగ్భ్రాంతికి గురైయ్యారు.ప్రమాదం ఘటనా స్థలానికి ద్రాక్షారామ పోలీసు సిబ్బంది, రామచంద్రపురం అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేయడానికి ప్రయాత్నించినప్పటికి సుమారు అప్పటికే సుమారు 48 దుకాణాలు అగ్నికి ఆహూతయ్యాయి. దీంతో కోట్ల రూపాయలు నష్టం వాటిల్లుతుందని అంచనాకాగా మంత్రి సుభాష్ బాధిత దుకాణదారులను కలిసి అధైర్యపడవద్దు అని, మళ్ళీతిరిగి మార్కెట్ ను, మీ వ్యాపారాలను పునః నిర్మించుకునేల చేస్తానని భరోసా ఇచ్చి బాధితులకు ధైర్యం చెప్పారు. తక్షన సాయంగా వెంటనే 20 లక్షల రూపాయలు ప్రకటించారు. అలాగే అగ్ని ప్రమాదాని గురైన షాపులులకు 60 నుండి 70 శాతం నష్టాన్ని భర్తీ చేసేలా ప్రభుత్వం నుండి స్వచ్ఛంద సంస్థల నుండి సహాయం కోరి బాధితులను ఆదుకుంటానని ధైర్యం చెప్పారు. అయితే ప్రమాదం ఎలా చోటు చేసుకుంది అనే విషయం తెలుసుకునేందుకు సంబంధిత శాఖ అధికారులు నిమగ్నమ య్యారు. ఎదిఏమైనా తమ కళ్ళముందు తమ షాపులు అగ్నికి ఆహూతైన దృష్యాలు బాదితులు మాత్రం జీర్ణించుకోలేక పోతున్నారు.



**ఎస్పీ, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో మంత్రి సుభాష్ సంఘటన స్థలాన్ని పరిశీలిన**

అగ్ని ప్రమాదంలో కాలిపోయిన షాపులను మంత్రి సుభాష్ తో పాటు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ వై ఖోం నైదియా దేవి, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా , ఆర్డీవో సరళావతి లు పరిశీలించారు. సుమారు మూడు కోట్ల మేర ఆశ నష్టం ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ డిజాస్టర్ మేనేజ్మెంట్ ద్వారా బాధితులు అందరికీ ప్రభుత్వం తరపున సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ అగ్ని ప్రమాదం చాలా దురదృష్టకరమని విచారం వ్యక్తం చేస్తూ పోలీస్ శాఖ ద్వారా 50 వేల ఆర్థిక సాయం ప్రకటించారు. షార్ట్ సర్క్యూట్ ద్వారా ప్రమాదం జరిగిందని చెబుతున్నప్పటికీ, ఈ ప్రమాదం ఎలా జరిగింది అనే కోణంలో కూడా విచారణ చేస్తున్నామన్నారు.

## సర్ పై ప్రజలకు బిజెపి అవగాహన




**ప్రజాభూమి ప్రతినిధి - నూజివీడు**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో బి.ఎల్.ఏ 2 లుగా ఎంపిక చేసిన బిజెపి శ్రేణులు విధిగా పాల్గోనాలని నూజివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కుంపటి అరుణ విజ్ఞప్తి చేశారు. నూజివీడు మండల బిజెపి అధ్యక్షుడు నక్కా నాగ శివ అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో అరుణ పాల్గొని సర్ పై దిశా నిర్దేశం చేశారు.కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటింటి సర్వేలో బిజెపి శ్రేణులు ఆ బాధ్యతను తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. మార్పులు, చేర్పులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పారదర్శకంగా జాబితా రూపొందేందుకు సహకరించాలని సూచించారు. బి ఎల్ ఏ 2 లుగా నియమితులైన పార్టీ నాయకులకు ఐ.డి కార్డులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లెపూడి రాజశేఖర్, మాటూరి రవికాంత్,భావరాజు పుల్లారావు, మరీది శ్రీకాంత్,లావు కుటుంబరావు చౌదరి, నెక్కలపు కృష్ణారావు,కుంపటి రంగారావు తదితరులు పాల్గొన్నారు.



**హనుమంతుల గూడెం గ్రామంలో మున్సిపాలిటీ లో పనిచేస్తున్న వాళ్లకి గత ఏడు నెలల నుంచి జీతాలు ఇవ్వనందున వాళ్లు చాలా ఇబ్బంది పడుతున్నారు**

## తెలంగాణ సరిహద్దు లింగగూడెంలో అక్రమ ఇసుక నిల్వలు



**ప్రజాభూమి ప్రతినిధి - ఏలూరు జిల్లా**

ఏలూరు జిల్లా సరిహద్దు ప్రాంతమైన లింగ గూడెం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను తెలంగాణ రాష్ట్రానికి తరలించేందుకు దళారులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. గ్రామ శివార్లలో ముందుగానే ఇసుకను దంపులుగా నిల్వ ఉంచి, రాత్రి వేళల్లో భారీ వాహనాల ద్వారా తెలంగాణ వైపు తరలించేందుకు సిద్ధం చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో గతంలోనూ ఇలాంటి అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు పలు నివేదికలు వెలుగులోకి వచ్చాయి. ఆంధ్ర-తెలంగాణ సరిహద్దు మార్గాల ద్వారా ఇసుకను నిల్వ చేసి అనంతరం రహస్యంగా తరలిస్తున్న ఘటనలు నమోదయ్యాయి. స్థానిక ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఇసుక మాఫియా రెచ్చిపోతోందని, అక్రమంగా నిల్వ చేసిన ఇసుక దంపులపై వెంటనే రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖలు సంయుక్తంగా దాడులు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా ఇసుక నిల్వ చేయడం, రవాణా చేయడంపై అధికారులు పలు ప్రాంతాల్లో వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. లింగ గూడెం ప్రాంతంలో ఉన్న ఇసుక దంపులపై సంబంధిత శాఖలు దృష్టి సారించి వాస్తవ పరిస్థితులను వెలికితీయాలని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ఉపాధి హామీ శ్రామికులమంతా ఒకే కుటుంబం - మంత్రి నిమ్మల



**ప్రజాభూమి ప్రతినిధి - పాలకొల్లు**

ఉపాధి హామీ శ్రామికులు, మనమంతా ఒకే కుటుంబమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పేదల సేవే లక్ష్యంగా పాలకొల్లు మండలం ఆగర్తిపాలెం సొంత గ్రామంలో ఉపాధి హామీ శ్రామికుల శ్రమను గుర్తించి వారికి గౌరవం కలిగేలా కుటుంబ సమేతంగా ప్రత్యేక భోజనాలు ఏర్పాటు చేశారు. వేసవిలో మండుటెండలో కష్టపడి పనిచేసిన శ్రామికులకు ప్రతిరోజు చల్లటి మజ్జిగ అందించాలని మంత్రి రామా నాయుడు ఇచ్చిన పిలుపును అందుకొని దాతల సహకారంతో దాదాపు రెండు నెలలకు పైగా అందజేశారు. పని ముగింపు సందర్భంగా అన్ని గ్రామాల్లో పిక్నిక్ మాదిరిగా అందరికీ భోజనాలు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఏర్పాటు చేసిన భోజనాలు కార్యక్రమంలో మంత్రి నిమ్మల ఆయన సతీమణి సూర్య కుమారి, కుమార్తె శ్రీజాలతో కలిసి పాల్గొని వారితో కలిసి స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా శ్రామికులతో కలసి కొంత సేపు సమయం గడిపిన మంత్రి యోగక్షే మాలను అడిగి తెలుసుకున్నారు. లక్కీ డ్రా ద్వారా, మహిళా శ్రామికులకు చీరలు పంపిణీ చేసి ఆనందాన్ని పంచారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంత రంగా అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెడుతోందని మంత్రి తెలిపారు. రెండు సంవత్సరాల పాలన పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. విష రాజకీయాలు చేస్తున్న ప్రతిపక్షాల ఫేక్ ప్రచారాన్ని ప్రజలు నమ్మడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేస్తూ మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లను పెంచి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రూ.3 వేల నుంచి రూ.6 వేల, రూ.10 వేల, రూ.15 వేల వరకు అందిస్తున్నామని వివరించారు. మహిళలకు సంవత్సరానికి మూడు వంటగ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. మంచి పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఎంఈఓ జి.వీరాస్వామి, వేంకటేశ్వరరావు, మేడిది జాన్ డేవిడ్ రాజు, గిడుగు కిరణ్, ఉంగరాల నరసింహ రావు, కావాలి నాయుడు, కోర వాసు, సోడ దాసి శేఖర్, రాయి ప్రసాద్, నిమ్మల శ్రీధర్, ఇనుకొండ వెంకటేష్, ఉంగరాల సూర్య నారాయణ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం దారుణం



**ప్రజాభూమి ప్రతినిధి - నూజివీడు**

నూజివీడు పట్టణంలోని తిరువూరు రోడ్డు లో ఉన్న పెద్ద చెరువు వద్ద ఎత్తిపోతల పథకం శంకుస్థాపన శిలాఫలకాన్ని కొందరు దుండగలు ధ్వంసం చేశారని ఏలూరు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పరిమిసాగర్ ఆరోపించారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ 1992లో ఆనాటి ముఖ్యమంత్రి విజయ భాస్కర్ రెడ్డి, నాటి మంత్రి పాలడుగు వెంకట్రావులు పెద్ద చెరువు ఆయకట్టుకు ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసేందుకు కృషి చేసినట్లు తెలిపారు. ఆనాటి శిలాఫలకాలను ధ్వంసం చేయడం దారుణమైన చర్య అన్నారు. ఈ చర్యకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## అగ్నిప్రమాద బాధితులకు అండగా మంత్రి సుభాష్ ఆపన్నహస్తం

- సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా రూ.20 లక్షల ఆర్థిక సాయం
- మరో రూ.60 లక్షల సహాయానికి దాతల హామీ



**ప్రజా భూమి ప్రతినిధి - రామచంద్రపురం**

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన ప్రజాసేవ అనే నమ్మకాన్ని మరోసారి కార్యరూపంలో చూపించారు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్. ద్రాక్షారామం మార్కెట్ లో గురువారం రాత్రి సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో 48 దుకాణాలు పూర్తిగా దగ్ధమై జీవనాధారాన్ని కోల్పోయిన బాధిత కుటుంబాలకు మంత్రి సుభాష్ మానవతా దృక్పథంతో అండగా నిలిచారు. బాధితుల ఆవేదనను ప్రత్యక్షంగా విన్న మంత్రి, "కష్టంలో ఉన్న కుటుంబాలను ఒంటరిగా వదిలిపెట్టం బాధితుల కన్నీళ్లు తుడవడం మనందరి బాధ్యత" అని భరోసా ఇచ్చారు. మాటలతోనే కాకుండా చేతలతోనూ అండగా నిలుస్తూ, తన తండ్రి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ వ్యవస్థాపకులు వాసంశెట్టి సత్యం ద్వారా రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించారు. ఇతర దాతలు, సేవాభావం కలిగిన ప్రముఖులతో స్వయంగా మాట్లాడి కేవలం గంట వ్యవధిలోనే మొత్తం రూ.60 లక్షల ఆర్థిక సహాయానికి హామీలు వచ్చేలా చొరవ చూపా రు. బాధిత కుటుంబాలు తిరిగి తమ జీవితాలను నిలబెట్టుకునేందుకు అవసరమైన ప్రతి సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ, ప్రజలు సంతోషంగా ఉన్నప్పుడు వారి ఆనందంలో భాగం కావడం ఒక బాధ్యత అయితే ఆపదలో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడం అంతకంటే గొప్ప బాధ్యత. మనిషికి మనిషే తోడు అనే భావనతో ప్రతి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం. ప్రభుత్వం, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్, దాతల సహకారంతో ఎవ్వరూ నిరాశలో ఉండకుండా చూస్తాం అని పేర్కొన్నారు. **మార్కెట్ ను పరిశీలించిన మంత్రి సుభాష్,జాయింట్ కలెక్టర్, ఎస్పీ :** అగ్ని ప్రమాదంలో కాలిపోయిన షాపులను మంత్రి సుభాష్ తో పాటు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ వై ఖోం నైదియా దేవి, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా , ఆర్డీవో సరళావతి లు పరిశీలించారు. సుమారు మూడు కోట్ల మేర ఆశ నష్టం ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ డిజాస్టర్ మేనేజ్మెంట్ ద్వారా బాధితులు అందరికీ ప్రభుత్వం తరపున సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ అగ్ని ప్రమాదం చాలా దురదృష్టకరమని విచారం వ్యక్తం చేస్తూ పోలీస్ శాఖ ద్వారా 50 వేల ఆర్థిక సాయం ప్రకటించారు. షార్ట్ సర్క్యూట్ ద్వారా ప్రమాదం జరిగిందని చెబుతున్నప్పటికీ, ఈ ప్రమాదం ఎలా జరిగింది అనే కోణంలో కూడా విచారణ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి అధ్యక్షులు గుత్తుల సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి శాంతి కల్యాణోత్సవం



**ప్రజాభూమి ప్రతినిధి - ఆగిరిపల్లి**

శ్రీ శోభనాచల గట్టుపై వెలసిన శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామివారి శాంతి కల్యాణోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధల మధ్య నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించి, అనంతరం శాంతి కల్యాణం వైభవంగా జరిపారు. తదుపరి శ్రీ నరసింహ సుదర్శన హోమం నిర్వహించగా, ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణ భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ శాంతి కల్యాణానికి విజయవాడకు చెందిన ఉభయదాతలు సత్య శ్రీహరి శర్మ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ సాయి తెలిపారు.

## పాశం నాగబాబుకి కీలక బాధ్యతలు



**ప్రజాభూమి ప్రతినిధి - నూజివీడు**

జనసేన పార్టీ ఏలూరు పార్లమెంటు నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీలో ఏలూరు పార్లమెంట్ సాధకుల ప్రతినిధి కమిటీ సభ్యుడుగా పార్టీ ఆవిర్భావం నుండి కష్టపడుతూ వైసీపీ హయాంలో కేసులు ఎదుర్కొని ,కూటమి గెలుపులో కీలక పాత్ర పోషించి నేడు కూటమి ప్రభుత్వంలో అనేక మందికి అండగా నిలిచిన నూజివీడు నియోజకవర్గ జనసేన నాయకులు పాశం నాగబాబు కు అభినందనలు తెలియచేసిన మంత్ర కొలుసు పార్థసారథి నియోజకవర్గ జనసేన,కూటమి నేతలు రాబోయే రోజుల్లో మరిన్ని పదవులు చేపట్టాలని అలానే తనకు అవకాశం కల్పించిన జనసేన అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , పార్టీ అధిష్ఠానానికి ,స్థానిక నాయకులకు ఈ సందర్భంగా పాసం ధన్యవాదాలు తెలియచేశారు.

## ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి



**ప్రజా భూమి ప్రతినిధి - ఆగిరిపల్లి**

పుట్టిన శిశువుల నుంచి ఐదేళ్లలోపు వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆగిరిపల్లి, ఈదర, సగ్గూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు డాక్టర్ టీనా, డాక్టర్ నరేంద్ర కృష్ణ, డాక్టర్ జ్ఞానసందీప్, డాక్టర్ మంజులాదేవి, డాక్టర్ సంధ్యప్రియ తెలిపారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను సమీపంలోని పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని వారు కోరారు. ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 14 పోలియో బూత్‌లు, ఒక మొబైల్ బూత్, ఈదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 7 పోలియో బూత్‌లు, ఒక మొబైల్ బూత్, అలాగే సగ్గూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 10 పోలియో బూత్‌లు, ఒక మొబైల్ బూత్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయనున్నట్లు వైద్యులు వెల్లడించారు.

ప్రజాభూమి

జనరల్ 14

శనివారం 27, జూన్ 2026

# మానవ ఆరోగ్య సంరక్షణలో క్లినికల్ ఫార్మసిస్టులదే కీలక పాత్ర

- డాక్టర్ ఎం నిరంజన్ బాబు
- సెవెన్ హిల్స్ ఫార్మసీలో ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలు



**ప్రజాభూమి ప్రతినిధి – రామచంద్రాపురం**
సమాజంలోని మానవుల ఆరోగ్య సంరక్షణలో క్లినికల్ ఫార్మసిస్టుల పాత్రే కీలకమని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం నిరంజన్ బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రామాపురం సమీపం లోని సెవెన్ హిల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రాంగణంలో ఫార్మ్.డి చివరి సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 'సుజెన్ లైఫ్ సైన్సెస్' మేనేజింగ్ డైరెక్టర్ సి. దామోదర్ రెడ్డి, శ్రీ పద్మావతి మెడికల్ కాలేజ్ ఫర్ ఉమెన్ ప్రిన్సిపాల్ కె. నాగరాజు ఫార్మకాలజీ విభాగాధిపతి ఉమామహేశ్వర రావులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యార్థులు వారి భావి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. నైతిక విలువలతో ఉద్యోగ ప్రయాణం సాగించాలని సి. దామోదర్ రెడ్డి కోరారు. ఫార్మ్.డి విద్యార్థులకు ఫార్మసీరంగంలో అపార ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఫార్మసీరంగంలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించి పరిశోధనలుచేసి నూతన ఆవిష్కరణలు చేయాలని ఉమామహేశ్వర రావు కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం ముఖ్య అతిథులకు శాలువులతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్న రాజు, బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## యోగాతో ఆరోగ్యం.. సేవా కార్యక్రమాలతో సమాజాభివృద్ధి

### ఎమ్మెల్యే బడేటి చంటి



**ప్రజాభూమి – ఏలూరు**
శరీర దృఢత్వానికి యోగాసనాలు, సమాజ అభ్యున్నతికి సేవా కార్యక్ర మాలు ఎంతో ప్రయోజనకరమని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవి తంలో భాగంగా చేసుకోవడంతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఏలూరు కోటదిబ్బ జూనియర్ కళాశాల మైదానంలో ఫ్లాష్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా 10 మంది యోగా గురువులను సన్మానించి, వారి సేవలను అభినందించారు. మరింత మంది ప్రజలకు యోగా ప్రయోజనాలు చేరేలా కృషి చేయాలని యోగా గురువులను కోరారు.అనంతరం రూ.50 లక్షల వ్యయంతో అధునాతన అంబులెన్స్ కొనుగోలు కోసం విరాళాల సేకరణ నిమిత్తం ఏర్పాటు చేసిన మొబైల్ శిబిరాన్ని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభిం చారు. ఐదు వేల కుటుంబాలను ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్న ఫ్లాష్ సంస్థ సంకల్పాన్ని ఆయన అభినందించారు.ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్ర మాలు నిర్వహించాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో ఫ్లాష్ సంస్థ అధినేత యర్రంశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్ కలవకొల్లు సాంబ, ఫ్లాష్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఏడు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు



**ప్రజాభూమి ప్రతినిధి – నూజివీడు**
నూజివీడు మండలంలోని హనుమంతుని గూడెం గ్రామంలో గడచిన ఏడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రీన్ అంబాసిడర్ భూక్య నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ గ్రామంలో నిత్యం ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి రిక్షా ద్వారా తీసుకు వెళుతున్నట్లు తెలిపారు. వ్యవస్థ ప్రారంభం నాటి నుండి విధులు నిర్వర్తి స్తున్నానని గడచిన ఏడు నెలలుగా వేతనాలు అందించకపోతే నిరుపేద కుటుంబానికి చెందిన తాము ఎలా జీవించాలంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సకాలంలో బకాయిపడిన వేతనాలు చెల్లించి, నిరుపేదకుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు.

## గ్రామంలో సిసి కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

### ఎస్ఐ క్రాంతి కుమార్



**ప్రజాభూమి ప్రతినిధి – జీలుగుమిల్లి**
గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడా నికి గ్రామస్తులు సహకరించాలని జీలుగు మిల్లి ఎస్ఐ క్రాంతి కుమార్ కోరారు. స్వర్ణ వారి గూడెం గ్రామంలో గ్రామ ప్రజలకు సీసీ కెమెరాలు లేక ఆవశ్యకత తెలియపరచి గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంకు ముందుకు వచ్చే విధంగా వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: ఎక్సైజ్ అధికారులు



**ప్రజా భూమి ప్రతినిధి – ఆగిరిపల్లి**
ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతి రేక దినోత్సవం సందర్భంగా నూజివీడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణా మాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని అధికా రులు సూచించారు. యువత మత్తు పదార్థా లకు బానిస కాకుండా విద్య, క్రీడలపై దృష్టి పెట్టాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పె క్టర్ ఎ. మస్తానయ్య, ఏలూరు ఎన్‌ఫోర్స్ మెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.ఎస్.డి.భోగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమం లో శాఖ సిబ్బంది, స్థానికప్రజలు పాల్గొన్నారు.

## మహా ధర్నాను విజయవంతం చేయండి : సిపిఐ



**ప్రజాభూమి – కుక్కునూరు**
ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30న విజయవాడలో జరిగే మహాధర్నాను విజయ వంతం చేయాలని సిపిఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం సోడే నాగేష్ అధ్యక్షతన మండల కార్యవర్గ సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి శ్రమించి పండించిన పంటకు గిట్టబాటు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతుకు సబ్సిడీపై ఎరువులు విత్తనాలు తో పాటు వ్యవసాయ సామగ్రి రుణాలను అందించి పండించిన పంటకు మద్దతు ధర ప్రకటించి దళారులు ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సకాలంలో రైతుల పంటకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని కోరారు. కాగా కాంటూర్ తో సంబంధం లేకుండా పోలవరం ప్రాజెక్టు ముప్పులో ఉన్న కుకునూరు మండలాన్ని యూనిట్గా తీసుకొని పరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరిగిన కరెంటు పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించి ప్రజలకు విముక్తి కల్పించాలని ఆయన అన్నారు. మహా ధర్నాకు మండలం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకాశ్యామల, కే బాబురావు ,ఎం రమణయ్య, వీ పాపారావు తదితరులు పాల్గొన్నారు

## సోషల్ మీడియాలో మహిళలపై అసభ్యంగా అసత్య పోస్టులు పెట్టే వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకోండి.. టిడిపి మహిళల వేదన

**పాలకొల్లు సిఐకు వినతి పత్రం అందజేత**



**ప్రజాభూమి ప్రతినిధి – పాలకొల్లు**
సమాజంలో కుటుంబ బాధ్యతలతో గౌరవంగా మేలుగుతున్న మహిళలపై సోషల్ మీడియాలో అసభ్యంగా, అవమానకరంగా అసత్య పోస్టు లు పెట్టే వైసిపి వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టిడిపి మహిళలు కోరారు. ఈ మేరకు శుక్రవారం పాలకొల్లు పట్టణ పోలీస్ స్టేషన్కు పలువురు మహిళలు వెళ్లి పట్టణ సీఐ కే రజిని కుమార్ కు లిఖిత పూర్వకంగా వినతి పత్రం ఇచ్చారు. ఇటీవల వైసీపీ కార్యకర్త ప్రసాదుల రాము అనే వ్యక్తి సోషల్ మీడియాలో టిడిపికి చెందిన నాయకుడు ముప్పిరి సత్యనారాయణ, అతని భార్య లక్ష్మి తులసిపై అసభ్యంగా పెట్టిన పోస్టును, కుల పరంగా ద్వేషిస్తూ దౌర్జన్యం చేసిన సంఘటనను ప్రస్తావిస్తూ ఇటువంటివారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సత్యనారాయణ భార్య లక్ష్మీ తులసి ఆవేదన వ్యక్తం చేసి న్యాయం చేయమని కోరారు. దీనిపై సీఐ రజనీ కుమార్ మాట్లాడుతూ మహిళలను అగౌరవంగా, అవమానకరంగా అసత్య పోస్టులు పెట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సందర్భంగా టిడిపి మహిళా నాయకురాలు దబ్బా ఎస్తేరు రాణి , బత్తుల నిర్మల కుమారి, పెండ్యాల భవాని, బీరా వెంకటరమణ, ఎర్రంశెట్టి భవాని, దేవ గానుగుల వరలక్ష్మి, అంబల్ల లక్ష్మీ జ్యోతి, సంగుల విజయలక్ష్మి, మొరాల విజయ , సరిదే మాధవి, కడలి వెంకటరమణ తదితరులు వినతిపత్రం ఇచ్చారు. వీరంతా మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా తెలుగు దేశం పార్టీ మహిళా నాయకురాలు లపై, కార్యకర్తలపై అలాగే పార్టీలో చురుకుగా పని చేస్తున్న పార్టీ నాయకుల భార్యలు, వారి ఆడ పిల్లలపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు సోషల్ మీడియాలో చాలా జుగుప్సాకరమైన, అనుచిత వ్యాఖ్యానాలు చేస్తూ పోస్టులు పెడుతున్నారని ఈ పోస్టులలో చేసే వ్యాఖ్యల వలన మహిళల మనోభావాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన మహిళలు తీవ్రమైన మానసిక క్షోభకు గురవుతున్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ నాయకుల భార్యలపై చేస్తున్న అనుచితమైన, జుగుప్సాకరమైన వ్యాఖ్యలవలన మరియు సోషల్ మీడియా పోస్టుల వలన సదరు తెలుగుదేశం పార్టీ నాయకుల భార్యలు బయటకు రావడానికి సిగ్గుపడుతున్నారని, వైసీపీ నాయకుల ప్రోద్బలంతో వారి పార్టీ కార్యకర్తలు అసభ్యకర, అసత్య పోస్టులతో మహిళలను మానసికంగా వేధించడం ద్వారా మహిళల మాన మర్యాదలను మంటగలుపుతూ మహిళల పాలిట కీచకులు, దుశ్శాసనుల మాదిరిగా తయారయ్యారన్నారు. ఆత్మహత్యలు చేసుకోవాలనుకునేలా దారుణంగా హింసకు గురి చేస్తున్నారు. జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేస్తున్న వైయస్సార్ పార్టీ వారిని కట్టడి చేసి, చట్ట పరంగా చర్యలు తీసుకొని మహిళలకు అండగా రక్షణగా మేమున్నామనే భరోసాను పోలీసులు కల్పించాలని కోరారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో అర్హులంతా భాగస్వాములు కావాలి



**ప్రజాభూమి ప్రతినిధి – తాళ్లపూడి**
కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) ఆనందరావు పిలుపునిచ్చారు. తాళ్లపూడి మండలంలో గత కొద్దిరోజులుగా ప్రత్యేక సవరణ కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఫారం–6 ద్వారా కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు కార్డులో పేరు, వయస్సు, ఫోటో తదితర వివరాల్లో పొరపాట్లు ఉంటే ఫారం–8 ద్వారా సవరణ చేసుకోవచ్చన్నారు. అలాగే ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరొక కేంద్రానికి మారిన వారు లేదా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా ఫారం–8 ద్వారా మార్పులు నమోదు చేసుకోవచ్చని వివరించారు. మరణించిన వారి పేర్లు లేదా డూప్లికేట్ ఓట్ల తొలగింపునకు ఫారం–7 సమర్పించాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాలు, మీసేవ కేంద్రాలు, బీఎల్‌ఓల వద్ద నేరుగా దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. దరఖాస్తులకు ఆధార్ కార్డు, వయస్సు ధ్రువీకరణ కోసం పదో తరగతి మెమో లేదా జనన ధ్రువీకరణ పత్రం, ప్రస్తుత చిరునామా రుజువు, ఒక పాస్‌పోర్ట్ సైజు ఫోటో జత చేయాలని తెలిపారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాదని, అర్హులైన ఒక్కరూ ఓటు లేకుండా మిగిలిపోకుండా చివరి తేదీ వరకు వేచి చూడకుండా వెంటనే దరఖాస్తులు సమర్పించాలని ఆర్డీఓ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తాళ్లపూడి రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు ఈ కార్యక్రమంలో భాగస్వాములై ఓటర్లకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు.

## దళిత క్రైస్తవ సమర శంఖారావాన్ని విజయవంతం చేయాలి

### జడ శ్రావణ్ కుమార్



**ప్రజాభూమి – ఏలూరు**
జూన్ 28వ తేదీ ఆదివారం ఏలూరు విద్యానగర్‌లోని సెయింట్ జేవియర్స్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న దళిత క్రైస్తవ సమర శంఖారావాన్ని విజయవంతం చేయాలని మాజీ న్యాయమూర్తి, హైకోర్టు అడ్వకేట్, జై భీమ్ భారత్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సమర శంఖారావం గోడపత్రికను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత క్రైస్తవులపై దాడులు పెరుగుతున్నాయని, మత స్వేచ్ఛకు విఘాతం కలుగుతోందని, చర్చిల కూల్చివేతలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న ఈ భారీ బహిరంగ సభకు దళిత క్రైస్తవులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఆర్ఎస్ మాజీ అధికారి చాగంటి సంజీవ్, రమేష్ బాబు, జక్కుల బెనర్జీ, డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, పళ్లెం ప్రసాద్, దాసరి నాగేంద్ర కుమార్, పెరికె వరప్రసాద్, గొల్లా నరేష్ పాల్గొన్నారు.

## మల్లికార్జున స్వామికి విశేష అభిషేకాలు



**ప్రజాభూమి ప్రతినిధి – ఆగిరిపల్లి**
పరాభవ నామ సం వత్సరం నిజ జ్యేష్ఠ శుక్ల ద్వాదశి సంద ర్భంగా శ్రీ శోభనా చల గట్టుపై వెలసిన శ్రీ దుర్గాపార్వతి సమేత మల్లికార్జున స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకవారాభి షేకం, పంచామృతాభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్ర సాదాలు అందజేశారు. అలాగే వరాహ పుష్క రిణి సమీపంలోని శ్రీ దుర్గాదేవి ఆలయంలో కుంకుమార్చన, అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించినట్లు కార్యనిర్వహణాధి కారి సి.హెచ్. సాయి తెలిపారు.



## తాళ్లపూడిలో రవాణా శాఖ ఆకస్మిక తనిఖీలు



**ప్రజాభూమి ప్రతినిధి – తాళ్లపూడి**
తాళ్లపూడి మండలంలో రవాణా శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన ఆటోలు, ఇతర రవాణా వాహనాలపై కఠిన చర్యలు తీసుకున్నారు. బ్రేక్ ఇన్‌స్పెక్టర్ కే. శివప్రసాద్ నిర్వహించిన తనిఖీల్లో సరైన పత్రాలు లేకుండా నడుస్తున్న వాహనాలను గుర్తించి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా బ్రేక్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, పర్మిట్ వంటి తప్పనిసరి పత్రాలు లేని వాహనాలకు అక్కడికక్కడే రూ.5,000 నుంచి రూ.15,000 వరకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. జరిమానా విధించిన ఆటోలను తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌కు తరలించామని, జరిమానా చెల్లించిన తర్వాత మాత్రమే వాటిని విడుదల చేస్తామని పేర్కొన్నారు. అలాగే పర్మిట్ నిబంధనలను ఉల్లంఘించడం, సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రయాణికుల భద్రతే రవాణా శాఖ ప్రధాన లక్ష్యమని, ఫిట్‌నెస్, లైసెన్స్ లేని వాహనాలు రోడ్డెక్కడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని అన్నారు. ప్రతి వాహనదారుడు తన వద్ద అవసరమైన అన్ని ఒరిజినల్ పత్రాలను తప్పనిసరిగా ఉంచుకోవాలని సూచించారు. ఇకపై ప్రతిరోజూ తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న వాహన పత్రాల రెన్యువల్, ఇతర పనులను వెంటనే ఆర్టీఏ కార్యాలయంలో పూర్తి చేసుకోవాలని వాహనదారులకు సూచించారు.